
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్‌పండ్యా**
సంపాదకులు
బి.సిహెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 06
**నవంబర్ 2016**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**
**99491 11175**

## నీపై విశ్వాసాన్ని, కావలసిన శక్తిని ప్రసాదించు

'ఓ భగవంతుడా! కష్టాలకు భయపడి పారిపోకుండా వాటిని ఎదుర్కొనగలిగే ధైర్యమును నాకు ప్రసాదించు. నేను కోరుకునేది ఇది ఒక్కటే. అందుచేత ఆపదలు వచ్చినప్పుడు నన్ను రక్షించమని నేను ప్రార్థించటం లేదు. కానీ వాటిని ఎదుర్కొనటానికి కావలసిన శక్తిని నాకు ప్రసాదించమని మాత్రం నిన్ను వేడుకొంటున్నాను. కష్టాలలో నేను దుఃఖపూరితమై ఉన్నప్పుడు నన్ను ఓదార్చమని నేను నిన్ను వేడుకొనటం లేదు. భావసుమాలను దోసిలినిండా నింపి నీ చరణముల చెంత అర్పిస్తూ – 'కష్టం వచ్చినప్పుడు దానిని ఎదుర్కొని, దానిపై విజయమును సాధించగలిగే శక్తిని నాకు ప్రసాదించమని' మాత్రం వేడుకొంటున్నాను.

నేను కష్టభూయిష్టమైన విషమ పరిస్థితిలో చిక్కుకున్న వేళ ఎటువైపునుండి నాకు ఎలాంటి సహాయము అందనప్పుడు నేను ధైర్యమును కోల్పోకూడదు. ఇంకెవ్వరినీ నేను సహాయం అడగను, ఆ క్షణంలో నా మనోబలం క్షీణించనివ్వను. ఓ ప్రభూ! అత్యంత కఠినమైన పరిస్థితులను గానీ, ఆపదలను గానీ, సమస్యలను గానీ ఎదుర్కొనగలిగే దృఢత్వమును, శక్తిని నాకు ప్రసాదించు. ప్రతిక్షణం నన్ను వెన్నంటి ఉండి, విపత్కర పరిస్థితులను ఒక ఆటగా భావించి హృదయాన్ని తేలికగా ఉంచుకొనగలిగే ధైర్యమును నాకు అందించు. నేను కోరుకునేది ఇంతమాత్రమే స్వామీ!'

ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, దైనందిన వ్యవహారంలో ఎంతటి నష్టం కలిగినా నాకేమీ పర్వాలేదు. కానీ ముందర వచ్చిపడిన కష్టమును చూసి ధైర్యమును కోల్పోయి, 'ఇప్పుడేం చేయాలి నాయనా? నా సర్వస్వం పోగొట్టుకున్నానే!' అని ఏడుస్తూ కూర్చునే బలహీనతను మాత్రం నానుండి దూరం చెయ్యి స్వామీ!'

'స్వామీ! కేవలం నీపట్ల దృఢ విశ్వాసాన్ని కలిగి ఉండటం వల్ల మాత్రమే ప్రజలు ఎంత అజ్ఞానావస్థలో ఉన్నప్పటికీ చరిత్రలోనే అత్యంత ఉన్నతస్థాయి వరాలను పొందగలిగారు. మీపైన విశ్వాసం నాకు యాచనగా కాక శక్తిగా మారాలి. నా మనస్సు బలహీనతకు గురికాకుండా శక్తివంతం కావాలి!'

*– అఖండజ్యోతి, మార్చి 1978*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

# విషయసూచిక


1. **సంపాదకీయం:**
నీపై విశ్వాసాన్ని, కావలసిన శక్తిని ప్రసాదించు 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-19:** గురుగోవిందసింగ్ - సంత్, గృహస్థ ధర్మాల సమన్వయం 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-53:**
దానంతోపాటు దక్షిణ 6
5. **సూక్ష్మీకరణ సాధన-12:**
భూతములు ఒక భ్రమ, ఒక వాస్తవికత కూడా 9
6. **తమ ఉనికి కోసం సంఘర్షిస్తున్న నదులు** 11
7. **విద్యతో పాటు స్వావలంబనకు శిక్షణనివ్వాలి** 13
8. **గహనాకర్మణోగతిః** 16
9. **తపస్సు-పుణ్యము శాశ్వత సంపదలు** 18
10. **మనము - మన ఆరోగ్యం:**
ఆరోగ్యానికి తారక మంత్రం ప్రాకృతిక జీవనం 21
11. **విజ్ఞానమును దారితప్పకుండా నిరోధించాలి** 25
12. **కేవలం విజ్ఞానం మాత్రమే కాదు సత్‌జ్ఞానం కూడా కావాలి** 27
13. **బోధ కథ:**
భగవంతుని చేతిలో దండించే లాఠీ ఉంటుంది 29
14. **యోగానుభూతులకు రాజమార్గం-ఆత్మ నియంత్రణ** 32
15. **మద్యపానమనే దుష్ప్రవృత్తి సమాజమును పతనం కావిస్తుంది** 34
16. **కుటుంబ నిర్మాణం:**
సుఖమయ దాంపత్య జీవనం ఎలా సాధ్యం? 37
17. **సాఫల్యమునకు అత్యవసరమైనది ఒక బలమైన టీమ్** 39
18. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** 41
ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే - 3
19. **నా వారితో నా మాట:** యువక్రాంతి సంవత్సరం - దివ్యాత్మ జాగరణ కార్యశాలలు 44
19. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-14) 47
20. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-30** 48
21. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 50



# యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**నవంబర్ 2016**

| | |
|---|---|
| 03-11-2016 | నాగులచవితి |
| 14-11-2016 | కార్తీక పౌర్ణమి<br>గురునానక్ జయంతి<br>నెహ్రూ జయంతి |


**డిసెంబర్ 2016**

| | |
|---|---|
| 10-12-2016 | గీతా జయంతి |
| 13-12-2016 | మిలాదున్-నబీ |
| 14-12-2016 | దత్తాత్రేయ జయంతి |
| 25-12-2016 | క్రీస్తు జయంతి (క్రిస్మస్) |
| 30-12-2016 | భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి |

**అనుభవాల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి**

యుగనిర్మాణ చిత్రావళి-19

# గురు గోవింద్ సింగ్ - సంత్, గృహస్థ ధర్మాల సమన్వయం



వివాహం కానివారే సంతులు కాగలరని ప్రజలు భావిస్తుంటారు. ఇలా భావించడం వలన ఈశ్వరుని, ఆత్మ సాక్షాత్కారం జీవన లక్ష్యమని అర్థం చేసుకున్న వారు ఇంద్రియ సంయమం లేనివారు కూడా అవివాహితులుగా ఉండవలసి వచ్చింది. ఇలాంటివారు ఆధ్యాత్మికమార్గంలో అనేక వికృతులకు స్థానం ఇచ్చారు. గురుగోవింద్ సింగ్ ఆ పరంపరకి స్వస్తి పలికాడు, దేశానికి సమర్థవంతమైన సేవలను అందించదలచిన వారికి వివాహం అటువంటి పుణ్య పరమార్థానికి అడ్డురాదని అన్నాడు.

ఆయన తపస్వి, సాధకుడు, సంత్ అయినప్పటికి వివాహం చేసుకున్నాడు, నలుగురు పుత్రులను కన్నాడు. తన మొత్తం తపస్సు, బుద్ధి, శ్రద్ధ ప్రజలకు ఉన్నటువంటి బాధలను తొలగించడానికి ఉపయోగించాడు. ఆయన జీవనం ఒక నిజమైన సంత్ జీవనం కానీ దుష్ప్రవృత్తులతో యుద్ధం చేసేందుకు వారి శౌర్యం తక్కువేమి కాదు. ఒక చేతిలో మాల, ఒక చేతిలో బల్లెం అనే మాటను ఆయన చరితార్థం చేశాడు.

భారతీయ సమాజంలో ధర్మం, ఆదర్శం అనే సిద్ధాంతములు పతనం అవుతున్న తరుణంలో గురుగోవింద్‌సింగ్ ప్రాదుర్భావం జరిగింది. హిందూజాతి భాగ్యవాదం అనే పేరుతో నిష్క్రియమయింది, నిస్తేజమయింది. గురుగోవింద్‌సింగ్ దానికి ఒక క్రొత్త స్వరూపాన్ని తీసికొచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఇది చూసిన ముస్లిం పాలకులు ఆయనను చాలా వేధించారు, ఆయనపై దాడి కూడా చేశారు. ఆయన కోట వారికి వశమయింది. ఎంతో కష్టంతో తప్పించుకున్నాడు.

తరువాత పోగొట్టుకున్న శక్తిని కూడగట్టుకుని యుద్ధానికి సిద్ధమయ్యాడు. అప్పుడు వారి పెద్ద కుమారుడు అజీత్‌సింగ్ ఇలా అన్నాడు – "నాన్నగారు! నేను ఉన్నప్పుడు మీరు యుద్ధానికి వెళ్ళడం సరికాదు. మన ధర్మం కొరకు, సంస్కృతి కొరకు నా జీవితాన్ని బలిదానంగా పెట్టనీయండి. అప్పుడు మీరు సురక్షితంగా ఉంటారు, ఇంకొక మహత్వపూర్ణకార్యం చెయ్యగలుగుతారు. ఈనాడు దేశానికి మీ అవసరం ఉన్నది. నాకు యుద్ధానికి వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి".

గురుగోవింద్‌సింగ్ తన పుత్రుని భుజం తట్టినప్పుడు ఆయన హృదయం గద్గదం అయింది. ఆయన ఇలా అనుకున్నాడు – "భగవంతుడా! ఇలాంటి సంతానాన్ని అందరికీ ఇయ్యి". అజీత్‌సింగ్ యుద్ధంలో మరణించినప్పుడు రెండవ కుమారుడు జోరావత్ సింగ్ కూడా యుద్ధానికి వెళ్ళడానికి అనుమతి కోరాడు. అప్పుడు గురు గోవింద్ సింగ్ ఇలా అన్నాడు – "నీ వయస్సు ఇప్పుడు 15 సంవత్సరాలు మాత్రమే. నీవు యుద్ధానికి వెళ్ళవద్దు." అప్పుడు జోరావత్‌సింగ్ ఇలా అన్నాడు. "గోరా–బాదల్ కూడా చిన్న వాళ్ళే, వారు యుద్ధం చేసి తమ జాతి గౌరవాన్ని ఇనుమడింప చేశారు. మరి నేను ఎందుకు యుద్ధం చేయకూడదు? "చివరకు అతనికి కూడా యుద్ధం చేసేందుకు అనుమతి ఇవ్వవలసి వచ్చింది. ధర్మయుద్ధంలో జోరావత్‌సింగ్ కూడా తన జీవితాన్ని బలిదానం చేశాడు.

ఇక్కడ సర్‌హింద్ నవాబు అతని మిగిలిన ఇద్దరు పుత్రులు జుఝార్‌సింగ్, ఫతేహ్‌సింగ్‌లను ఖైదు చేశాడు. వారిని చాలా ప్రలోభపెట్టాడు. ఆ ప్రలోభాలకు లోనుకాకపోతే కఠోర దండన విధిస్తానని బెదిరించాడు. ఇంతేగాక వారు జీవించి ఉండగానే వారి చుట్టూ గోడలు కట్టమని తలారులను ఆదేశించాడు.

ఫతేహ్‌సింగ్ పైన చివరి ఇటుక పెడుతున్నప్పుడు జుఝార్‌సింగ్ కంటి నుంచి ఆసువులు వచ్చాయి. తలారులు అతనికి భయం వేసిందని భావించారు. వారు ఇలా అన్నారు. "ఇప్పుడు నీవు సమర్పణ చేసుకుంటే మేము నిన్ను వదలి వేయగలము". అప్పుడు జుఝార్ సింగ్ ఇలా బదులిచ్చాడు. "మూర్ఖుల్లారా! నేను చావు గురించి భయపడటం లేదు. నేను పెద్దవాడిని. బలిదానం చేసే అధికారం ముందు నాకు రావలసి ఉన్నది, అది నా తమ్ముడికి లభిస్తున్నది",


ముసల్మానులు స్తభ్యులయ్యారు, వారి నోటి నుంచి "గురు గోవింద్ సింగ్ ధన్యుడు, సంత్‌ల మర్యాదలు పాటిస్తున్నాడు, పరివార నిర్మాణం ఎంత బాగా చేశాడు! దీనిని చూసిన వారు ప్రేరణ పొందకుండా, ప్రభావితం కాకుండా ఎవరూ ఉండరు."

*– అనువాదం: ముక్కామల రత్నాకర్*

**ఓటమి ఏమి చేయకూడదో, ఎలా చేయకూడదో నేర్పుతుంది**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-53

# దానంతోపాటు దక్షిణ



తీవ్రంగా ఆందోళన కొనసాగుతూ, జాగృతం అవుతున్న రోజులలో కూడా 'సైనిక్' పత్రికలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉండేవారు కాదు. పెద్ద పెద్ద వార్తాపత్రికల్లో కూడా కొంత మందే ఉండేవారు. అలంకరణ, ప్రచారాల పట్ల ధ్యాస తక్కువగానే ఉండేది. వార్తలు, మేలుకొలిపే దృక్పథం ప్రజలకు చేరితే చాలు అన్నదే ముఖ్యంగా భావించేవారు. 'సైనిక్' పత్రికలో నలుగురైదుగురు ఉండేవారు. రేడియోలో వార్తలు విని, వాటిని వ్రాసి, కంపోజింగ్ కోసం పంపి, ప్రూఫ్ చదివే బాధ్యత శ్రీరామ్‌దే. ఈ పనికి శిరోమణిగారు తోడుండేవారు. ఆయన అంతకు ముందు 'సాహిత్య సందేశం' అనే పత్రికలో పని చేసేవారు. ఆ పత్రికకు ఖర్చులకు కూడా కష్టమయ్యేది. ఆయన సాహిత్యపు తృప్తి కోసం 'సైనిక్'కి రమ్మని పిలిచారు పాలివాల్ గారు. శిరోమణిగారొచ్చాక శ్రీరామ్‌కు కాస్త పని తగ్గింది. కానీ ఈ సహాయం మహా అయితే ఆరు నెలలే అందింది.

కరావల్ గ్రామాన్ని దత్తత తీసుకుని, అక్కడి అభ్యుదయం కోసం పనులు మొదలుపెట్టాక శ్రీరామ్ వీలైనంత ఎక్కువ సమయాన్ని పత్రికకే ఇచ్చారు. ఎప్పుడో గాని ఆవల్‌ఖేడాకి వెళ్ళడానికి కూడా కుదిరేది కాదు. అప్పుడప్పుడు వారి భార్యే ఆగ్రాకు వచ్చేది. కొంత కాలం ఉండి వెళ్ళేది. కొన్ని నెలలు ఆయన జీవనక్రమం ఒక పద్ధతిగా గడిచింది. పది , పదకొండు గంటలకు ఆఫీసుకు వచ్చి ఉత్తరాలు వగైరా చూసుకుని వార్తలను వ్రాసేవారు.

ఆ రోజుల్లో వార్తల ఏజెన్సీలు అంత సక్రియంగా ఉండేవి కావు. అన్ని చోట్లా వారి శాఖలు, యంత్రాంగం ఉండేది కాదు. ప్రతిచోట వారి విలేకరులను ఉంచే ఆనవాయితీ అప్పట్లో లేదు. 'సైనిక్' అవసరాలు రేడియోతో పూర్తయ్యేది. శ్రీరామ్ స్వయంగా మధ్యాహ్నం మరియు సాయంత్రం సమాచార బులెటన్లు వినేవారు. ఆ వార్తలను నోట్ చేసుకుని పత్రికకు తగ్గట్టుగ్గా ప్రతిని తయారు చేసేవారు. రేడియోలో ప్రసారమైన వార్తలు ప్రజలు మర్నాడు పత్రికల్లో చదవగలిగేవారు. పత్రికలు వారి విధానాలను బట్టి వార్తలకు కాస్త రంగులద్దేవి. శ్రీరామ్ చాలా వేగంగా వ్రాసేవారు. రేడియోలో ప్రసార వేగాన్ని అందుకుని ఆయన నోట్ చేసేవారు. షార్ట్‌హాండ్ నేర్చుకున్నవాళ్ళు కూడా అంత త్వరగా వ్రాయగలిగేవారు కాదు. శ్రీరామ్ వ్రాసినది అందంగా, ఇంపుగా ఉండేది. ఆయన చేతి రాత ఎవరైనా చదవగలిగేవారు. సంవత్సరాలు గడిచాక వేగం బాగా పెరిగి ఆయన చేతిరాత అస్పష్టంగా మారసాగింది; అయితే 'సైనిక్'లో పని చేసిన 30,35 సంవత్సరాల తరువాతి విషయం అది.

మాటలతో పాటు రాతలోని ఆయన ప్రతిభకు ప్రభావితమై గులాబ్‌రాయ్ బాబుగారు కూడా అప్పుడప్పుడు ఆయన్ని పిలిచేవారు. వయసు మీదపడడంతో ఆయనకు వ్రాయడం కష్టంగా ఉండేది. ఆయన పిలిచినప్పుడల్లా స్టెనోగ్రాఫర్ లాగా వెళ్ళేవారు. శ్రీరామ్‌లోని విద్యార్థి భావమే అందుకు ఒక కారణం. ఆయన దగ్గరకు వెళ్ళి, చెప్పిన పని చేస్తే తన యోగ్యత పెరుగుతుందని చాలామంది భావించేవారు. వారానికి ఒకటి, రెండు సార్లు వెళ్ళేవారు. తిరిగొస్తూ 'సైనిక్' కోసం వారి రచనలు గానీ, వ్యాఖ్యలు గానీ తెచ్చేవారు. గులాబ్‌రాయ్ బాబుగారి వ్యాఖ్యలు, ప్రతి క్రియలు సామాజిక మరియు సాంస్కృతిక విషయాల మీద కేంద్రితమై ఉండేవి.

### 'సైనిక్' లో ఆసక్తికర సంఘటన

కార్యాలయంలో శ్రీరామ్ చుట్టూరా ఆసక్తికర పరిస్థితులు వస్తూనే ఉండేవి. ఆయన చిన్నకుమారుడు ఓంప్రకాశ్ ఊరి నుండి ఎవరితోనైనా కలిసి ఆగ్రాకు వచ్చేవాడు. కార్యాలయానికి కూడా వచ్చి తన పద్ధతిలో ఏవో ఆడుకునేవాడు. ఐదారేళ్ళ పిల్లవాడు ఆడుకోదగ్గట్టుగా అక్కడేమీ లేకపోయినా వార్తాపత్రికల కట్టలు, కాగితాలు, పెన్నులతోనే తృప్తిపడేవాడు. శ్రీరామ్ టేబుల్ దగ్గరే రేడియో సెట్ ఉండేది. అది చాలా పెద్దది. నేల మీద

**నిర్విరామంగా శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది**

పెడితే రెండున్నర అడుగుల ఎత్తుండేది. చిన్న టీపాయి మీదుండేది. వార్తలు వినాల్సినపుడు స్విచ్ ఆన్ చేసేవారు. దానిది చాలా పెద్ద గొంతు. రేడియో పెట్టగానే ఓం ప్రకాశ్ చాలా ఉత్సాహపడేవాడు. పరిగెత్తుకొచ్చి వినేవాడు. ధ్వని ఎక్కడ్నుంచి వచ్చేదో కనుక్కోవడానికి ప్రయత్నించేవాడు. తండ్రి పక్కకెళ్ళగానే టేబులెక్కి రేడియోలోని వ్యక్తిని చూడడానికి అన్ని వైపులా వెతికేవాడు.

టేబుల్ దగ్గరకు తిరిగి వచ్చిన శ్రీరామ్, ఓం ప్రకాశ్ చేష్టలు చూసి చిన్నగా నవ్వేవారు. చిరంజీవిని కిందకి దింపి మళ్ళీ పనిలో మునిగిపోయేవారు. కొడుకు చేసే చిలిపి పనులు ఆయన్ని పెద్దగా కవ్వించేవి కావు. బాబును ఊరినుంచి తీసుకొచ్చిన ఆ మరో వ్యక్తి కూడా రేడియోలోకి తొంగిచూసే ప్రయత్నం చేశాడు. దాని వివరాలు అడిగాడు. శ్రీరామ్ తనకు తెలిసిన విషయమంతా చెప్పారు, కానీ అతనికి బటన్ తిప్పితే రేడియో ఆన్ అవుతుందని మాత్రమే అర్థమైంది.

కొంతసేపటికి శ్రీరామ్ ప్రెస్‌కి వెళ్ళాక అతను రేడియో ఆన్ చేయాలని చూశాడు. బటన్ తిప్పాడు. కాని ప్రసార సమయం కాదు కాబట్టి ఏ ధ్వని రాలేదు. మళ్ళీ బటన్ తిప్పాడు. లాభం లేకపోయింది. ఈసారి గట్టిగా తిప్పేసరికి బటన్ ఊడి చేతికొచ్చింది. తప్పు జరిగిందని అర్థమై బటన్ టేబుల్ మీద పెట్టి ఆఫీస్ నుంచి జారుకున్నాడు. తిరిగి రాగానే ఖాళీగా ఉన్న ఆఫీసులో, టేబుల్ మీద బటన్ చూసి విషయం అర్థం చేసుకున్న శ్రీరామ్ దానిని సరిచేసే ప్రయత్నం చేశారు. కుదరకపోయేసరికి మెకానిక్‌కి కబురు పంపి తిరిగి తన పనిలో నిమగ్నమైపోయాడు.

ఆగ్రాలో ఉన్నన్నాళ్ళు తాయిజీ ఎప్పుడూ అక్కడికి రాలేదు. ఊళ్ళోనే ఉంటూ వీలైనంత పని చేస్తూ కుటుంబాన్ని చూసుకునేది. అడపాదడపా శ్రీరామే ఆవిడను కలవడానికి వెళ్తుండేవారు. అలా ఒక సారి వచ్చినప్పుడు దారిలోనే నలుగురు పెద్దలు ఆయన్ని గుమిగూడారు. వారిలో ఒకరు శ్రీరామ్ దగ్గర బంధువు, వరసకు బాబాయి. తాయాజీ ఇంటి పని, పొలం పనిచేయడం చూసి ఆయనకు బాధగా ఉండేది.

అప్పటికి తాయాజీ మూడో మనవరాలికి కూడా నానమ్మ అయింది. ఆమెకు శ్రీరామ్ 'శ్రద్ధ' అని పేరు పెట్టారు. ముగ్గురి పిల్లల తండ్రి అయ్యాక కూడా శ్రీరామ్ కుటుంబబాధ్యతలు స్వీకరించట్లేదని వారి ఫిర్యాదు. స్వాతంత్ర్య సంగ్రామములోనే మునిగిపోయాడు. ఈసారి శ్రీరామ్ రాగానే అతనిని సరైన దారిలో తేవాలని ఆయన నిర్ణయించుకున్నాడు. ఆయనే తన స్నేహితులతో కలిసి శ్రీరామ్‌ను చుట్టుముట్టి ఆపారు.

"పత్రికలో పని చేసేవారు చాలా గొప్పవారైపోతారు కదూ!" అంటూ నిలదీయటం మొదలుపెట్టారు. "అదేం లేదే, అయినా మీరు ఏం చెప్పదల్చుకున్నారు?" అన్నాడు శ్రీరామ్.

"చెప్పడానికేం లేదు. పత్రికల్లో వార్తలు ప్రచురించి, నేతలను కలిసి, పెద్దవాళ్ళతో పరిచయం పెంచుకుంటే ఏం దక్కుతుంది." అన్నారు. విషయం అర్థమవుతున్నా, వాదన అనవసరం అనుకున్న శ్రీరామ్, "బాబాయి గారు, మీరు ఆజ్ఞాపించండి, ఈ చుట్టుతిరుగుడు వ్యవహారమెందుకు. మీరు చెప్పినట్టు చేస్తాను." అన్నాడు.

"నువ్వు ఇంటికి పెద్ద కొడుకువి. మీ నాన్నగారి హయాంలో మీ అమ్మ ఇంటి గడప కూడా దాటలేదు. ఇప్పుడు కూడా ఆవిడ బయటకెళ్ళదు. ఇంటిని చూసుకునే వారు ఇంకెవరు లేరు. నువ్వు ఈ తలకుమాసిన పనులు వదిలేసి ఆవిడకి చేదోడుగా ఉండడం మంచిది. అది నీ బాధ్యత." కాస్త ఆలోచించి శ్రీరామ్ జవాబిచ్చారు, "కానీ నేను అమ్మనడిగే ఈ పని చేస్తున్నాను. ఆవిడ ఆశీర్వాదంతోనే దేశసేవ దారిన పడ్డాను."

"నువ్వు మొండిపట్టు పట్టుంటావు. కాదనలేక ఆవిడ సరే అనుంటుంది. కన్నబిడ్డని ఏ తల్లి దూరం చేసుకోవాలను కుంటుంది? నీ భార్యా బిడ్డలను కూడా ఆవిడ ఎంత కాలం చూసుకుంటుంది? ఆవిడ బాగోగులు నువ్వు చూసుకోవాలి కాని...." కాసేపు సంభాషణ కొనసాగింది. తల్లి అనుమతితోనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటున్నానని నిరూపించే ప్రయత్నం ఎంతగా చేసినా, ఆ పెద్దలు ఆవిడ పడే కష్టాన్నే చెప్పుకొస్తున్నారు. నువ్వు తిరిగొస్తానని చెప్తావని ఆవిడ ఎదురు చూస్తోందని వాదిస్తున్నారు. విషయం తెగకపోవడంతో అందరు కలిసి తాయాజీ దగ్గరకెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

### దానంతో పాటు దక్షిణ

శ్రీరామ తన మాట నిరూపించుకోవాలంటే వారు చెప్పిన పనిచేయాలని ఆ పెద్దలు పట్టుపట్టారు. తల్లి దగ్గరకెళ్ళి, అందరి ఎదుట తాను తిరిగొస్తానని, కుటుంబంతోనే కలిసుంటాననీ ఖచ్చితంగా చెప్పాలని ఒప్పించారు. ఆవిడ ముఖంలో ప్రసన్నత

**లేనిదానిని గురించి బాధపడటం కాదు, ఉన్నదానిని ఎలా ఉపయోగించాలో ఆలోచించాలి**

కనిపిస్తే ఇంతకు ముందు మొహమాటానికి ఒప్పుకున్నట్టు. చిరంజీవిని మనస్ఫూర్తిగా దేశానికి సమర్పించిందా లేదా అనేది కూడా తెలిపోతుంది. శ్రీరామ్ ఒప్పుకున్నాడు.

అందరు కలిసి హవేలీకెళ్ళారు. అమ్మ ఎదురవగానే శ్రీరామ్ "అమ్మా! నేను దేశానికి చేసిన సేవ ఇక చాలు. ఇక నీకు తోడుగా ఇక్కడే ఉండిపోతాను. కుటుంబంతోనే కలిసుంటాను." అని చెప్పారు. ఆవిడ ఆ మాటలకు ఆశ్చర్యపోయింది. చుట్టూ చూసింది. అందరి ముఖాల్లోని హావభావాలు పరిశీలించి విషయం అర్థం చేసుకుంది. "చాలా బావుంది! ఏంటిరా ఈ నాటకం. రామ్‌కిశోర్ గారు (బాబాయి) అబ్బాయిని ఎందుకు మీరు ఒత్తిడి చేస్తున్నారు?" అని సూటిగా అడిగేసింది.

"అబ్బే! అదేం లేదు వదినా. శ్రీరామే తన ఆలోచన మాతో చెప్తే, సరేనంటూ వెంట తీసుకొచ్చానంతే. నేనేం ఒత్తిడి చేయలేదే."

తాయిజీ ఇంకేం వినదల్చుకోలేదు అన్నట్టుగా ఒక్కో పదం గంభీరంగా పలుకుతూ, "ఎవరైనా ఎవరికైనా ఏదైనా దానం చేస్తే, దానంతో పాటు దక్షిణ కూడా ఇస్తారు. అంతేకానీ దానాన్ని తిరిగి తీసుకోరు. నేను శ్రీరామ్‌ను సమాజానికి దానమిచ్చేశాను. ఎట్టి పరిస్థితుల్లోను ఆ దానం తిరిగి తీసుకోను. ఇక దక్షిణ అంటారా, దానిని గురించి కూడా ఆలోచించి పెట్టుకున్నాను." అని నిక్కచ్చిగా చెప్పింది.

అక్కడున్నవాళ్ళంతా తాయిజీ మాటలకు నివ్వెరబోయారు. ఇప్పుడు కొత్తగా దక్షిణ ఏమిటో వారు ఊహించలేకపోయారు. ఆవిడ ఏమీ మాట్లాడకపోయేసరికి, ఉత్సుకతతో "ఏం ఆలోచించారు వదిన దక్షిణ గురించి?" అడిగారు.

"శ్రీరామ్‌తో పాటు ఈ ఇల్లు, ఆస్తులు కూడా సమాజానికి దక్షిణగా ఇచ్చేస్తాను. అతను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఊరికీ, సమాజానికీ అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు." ఈ మాటలు విని ఎవ్వరికీ నోట మాట రాలేదు. శ్రీరామ్‌ను తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తే ఇల్లు, ఆస్తి కూడా చేజారిపోయాయే అనుకున్నారు. తాయిజీనీ, శ్రీరామ్‌ను చూస్తూ ఉండిపోయారు. ఇంకేమీ మాట్లాడడానికి కానీ, అవతలివారి స్పందన వినడానికి కానీ ఏమాత్రం ఇష్టం చూపించకుండా తాయిజీ లోపలికి వెళ్ళిపోయింది. శ్రీరామ్ ముఖంలో ఆనందం, గర్వం కలిసిన భావం కనిపిస్తోంది. నివ్వెరబోయిన ఆ బాబాయి చివరికి ఒకే మాటన్నాడు, "వదినా! మీరు ధన్యులు. మీరు మన ఊరి పేరు ప్రపంచంలోనే మారుమ్రోగేట్టు చేశారు." రెండు మూడు రోజులుండి శ్రీరామ్ ఆగ్రా వెళ్ళిపోయారు. ఈసారి తాయిజీ కోడల్ని కూడా కొంత కాలానికి నగరానికి పంపించింది.

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

## సహాయం

*జాబలీ మహర్షి పర్వతం మీదున్న విచ్చుకున్న బ్రహ్మకమలాన్ని చూశాడు. ఎంతో అందంగా, సుగంధ భరితమైన పుష్పాన్ని ఆ ఋషి ముగ్ధుడై, దాన్ని దేవతకు చరణాలకు సమర్పించే సౌభాగ్యం పొందాలని అనుకోసాగాడు. తన సమీపానికొచ్చిన ఋషిని చూసిన ఆ కమలం సంతోషించింది. కానీ కొంత ఆశ్చర్యంతో ఆయన రాకకు కారణం అడిగింది. జాబాలి అన్నాడు – "నిన్ను దేవునికి సమర్పించాలనే కోరిక కలిగింది, అందుకని నిన్ను త్రుంచేందుకు అనుమతినివ్వు." ఇది విన్న పుష్పంలోని సంతోషమంతా వ్యాకులతగా మారిపోయింది. ఉదాసీనంగా ఉన్న కారణం గురించి ఋషి అడిగినప్పుడు ఆ పుష్పమిలా అంది – "దేవతకు సమర్పణ చేయు లోభ వస్తువులకు కొదవలేదు. కానీ నాకు దేవతా సమర్పణలో ఇష్టం లేదు. అంతకన్నా నేను ఎక్కువ సేవ సీతాకోక చిలుకలకు, తేనేటీగల వంటి క్షుద్ర క్రిమి-కీటకాలకు సహాయపడటంలో తప్పేముందు? చివరకు ఈ భూమికి బలం చేకూర్చటంలో కూడా నా ఆవశ్యకత ఉంది. ఎందుకంటే నేనిక్కడే పుట్టి పెరిగాను కాబట్టి, ఈ మాటలు విన్న ఋషి పుష్పపు ఆలోచనా సరళిని అర్థం చేసుకొని, ఎంతగానో ప్రశంసిస్తూ, ఆ పుష్పాన్ని అక్కడే ఉంచి వెనుదిరిగాడు.*

*– అఖండజ్యోతి, ఆగస్టు 2001*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**అందరికీ ఒకే విషయం నచ్చకపోవచ్చు**

సూక్ష్మీకరణ సాధన - 12

# భూతములు ఒక భ్రమ, ఒక వాస్తవికత కూడా

చిరకాలము నుండి ప్రచారములో ఉన్న మరియు అనేక మంది ద్వారా ఒప్పుకోబడిన నమ్మకాలు మన మస్తిష్కము చుట్టూ ఒక వలయము ఏర్పరచుకొని అవి సత్యమే నని అనిపింపచేస్తున్నవి. వ్యక్తి యొక్క ఆలోచనా తరంగములు పృథ్వి చుట్టూ వ్యాపించి ఉన్న Iono sphereలాగే మస్తిష్కము చుట్టూ ఒక Iono sphere ఏర్పరచుకుంటాయి. దాని ప్రభావము నిరంతరము అతని ఆలోచనలమీద పడుతుంది. వైజ్ఞానికుల ప్రకారము ప్రతి వ్యక్తి తనదైన ఆలోచనా మండలము Iono sphere తయారుచేసుకొనుటకు పరిపూర్ణముగా స్వతంత్రుడు. అతను దీనికి విధేయాత్మక (Positive) దిశనిచ్చి మనఃశక్తుల వికాసానికి దారిచూపగలడు లేక నిషేధాత్మక (Negative) ఆలోచనా ప్రవాహము అతనిని పతితుడిని చేయగలదు. ఈ Iono sphereకి సంబంధించిన మానవుల వ్యావహారిక జీవితక్రమములో ప్రభావము చూపించే ఒక లోకము (Plane) ఉన్నది. ఇది కుకల్పనలతో నిర్మించబడిన విచిత్రమైన జగత్తు. ఇక్కడే భూతప్రేతములు మొదలైనవి నివసిస్తుంటాయి.

పరంపరానుగతముగా విభిన్న సమాజములలో అనేక మంది దేవీదేవతల పూజ జరుగుతుంటుంది. ఆయా వంశము వారు వారి పెద్దలు ఏవిధముగా చేసేవారో చూస్తూ ఉంటారు. వాటి కథలు, గాథలు ఇంటింటా ప్రచారము పొందుతాయి. కథోపకథనాల వల్ల వారి ఉనికి, క్రియాకలాపాలకు పుష్టి జరుగుతూ ఉంటుంది. అందువల్ల చిన్నతనంనుంచే ఈవిధమైన నమ్మకాలు చాలా లోతుగా ప్రవేశించి, అవి సత్యములనే భావన గట్టిపడుతుంది. కానీ అప్పుడప్పుడు సందేహము ఎందుకు ఉత్పన్న మౌతుందంటే విభిన్న స్థలముల గురించిన నమ్మకాలు ఒకదానికొకటి విపరీతముగా ఉన్నా సత్యమనే భావించబడుతున్నాయి. ఈ పరస్పర విరుద్ధంగా ఉన్న నమ్మకాలు ముఖ్యంగా దేవీదేవతల సంబంధంలో కానీ భూతప్రేతముల సంబంధంలో కానీ విశేషంగా కనిపిస్తాయి. వాస్తవికతలో ఏవిధంగాను తక్కువగాని ఈ అవాస్తవికత ఆశ్చర్యజనకము. అంతేకాక ఏయే క్షేత్రాలలో ఆవిధమైన భూత ప్రేతములు కానీ దేవిదేవతలు కానీ పూజింపబడరో అక్కడ ఈవిధమైన చర్య హాస్యాస్పదముగా తీసుకోబడి అవిశ్వాసము వ్యక్తము చేయబడుతుంది. దీనికి విరుద్ధముగా ఏ కుటుంబాలలో అయితే ఆ దేవతలు మన్నింపబడి పూజింప బడుతున్నారో అక్కడ వారి అస్థిత్వము గురించి శంక ఒక్కొక్కసారి తీవ్రమైన ప్రతిస్పందనకు కారణమౌతుంది.

ఇటువంటివే అనేక విశ్వాసాలు ఉన్నాయి. ఉదాహరణకు జైన్‌ధర్మ అనుయాయులకు దేవతలు బలి అడుగుట, ఇవ్వ నప్పుడు కోపగించుకొనటం అనేవి హాస్యాస్పదంగా ఉంటాయి. దీనికి విరుద్ధముగా ఆదివాసీ వ్యక్తులు చిన్నచిన్న సమస్యలు కూడా భూతముల యొక్క ఆగ్రహంగా భావించి దానికి పశుబలి ఒక్కటియే ఉపాయమని భావిస్తారు. వీరిరువురు తమ పక్షమును నిరూపించటానికి ఎన్ని ప్రమాణాలు ఇవ్వగలరంటే వారివారి స్థానములో అదే సత్యమనిపిస్తుంది. అది నిజమై ఉండకపోతే వారు ఇంతలా ఎలా వాదించగలరు? దానికి వ్యతిరేకమైన ఆలోచనావిధానము వలన ఎందుకు బాధపడతారు?

ఇక్కడ చర్చించబడే మూలవిషయము సూక్ష్మీకరణము. శరీరము అంతమైన తరువాత ఆత్మయొక్క అస్థిత్వము శరీర రూపంగా ఉంటుందా? ఉండదా? శరీరము ఉన్నప్పటికీ అనేక ఆత్మలు తమ సూక్ష్మశరీరములో అసంభవంగా భావింపబడే ప్రత్యక్ష క్రియాకలాపాలు చేపట్టగలవా? లేదా? దీనికొరకు ఎటువంటి తర్కములు, తథ్యములు ఆధారంగా తీసుకోవాలి? ఇది మూల విషయము. నాయొక్క పక్షమును మీ ముందు ఉంచినప్పటికీ ఈ పంక్తులు చదువుతున్న పాఠకులు అనేక విశ్వాసాలను దృఢముగా పట్టుకొని ఉంటే, వాటిమీదే మంకు పట్టుతో ఉంటే ఈ సూక్ష్మీకరణ వివరణ వారికి కేవలము ఒక కపోలకల్పన అనిపించవచ్చు.

విశ్వాసముల సత్యము, ఒక విశేషమైన సత్యము. అది ఇంచు మించుగా పరిపూర్ణ సత్యమునకు సమతుల్యముగానే ఉంటుంది. పాత ఆలోచన మారినప్పుడు అంతవరకు ఇవ్వబడిన తర్కములు తప్పు అనిపించినా, అంతవరకు వాటిమీద మొండి

**అందరితో స్నేహంగా ఉండాలి**

మంకుతనపు ఆవరణ ఉంటుంది. కనుక పూర్ణసత్యముగానే ప్రతీతమౌతుంది. ప్రతీతమవుటయే గాక పరిణామాలు కూడా అలాంటివే లభిస్తాయి. ఇది శ్రద్ధయొక్క క్షేత్రము. శ్రద్ధ ఘనీభూతమై సృజనాత్మక దిశలో ఉపయోగించినప్పుడు తదనుకూలంగా వాతావరణాన్ని, పరిస్థితులను, సంఘటనలను మారుస్తుంది. 'సంశయాత్మా వినశ్యతి' అనేది పరిపూర్ణ సత్యము. స్మశానముతో పాటు భూతప్రేతముల మీద నమ్మకం ఉంటే, అటువైపు నుండి వెళుతున్నప్పుడు చెట్టు ఆకు కదలిక కూడా భయంకరమైన పిశాచంగా కనిపించి వ్యక్తిని భయపెడుతుంది. మనస్సులో ఉత్పన్నమైన భూతము కూడా సత్యమే. రాత్రియొక్క అంధకారంలో మెలకువగా ఉన్న వ్యక్తిని అతనికి పూర్వ విశ్వాసాలను బట్టి తలుపుల, కిటికీల చప్పుళ్ళలో కూడా భూతము చేసే ఉత్పాతముగానే కనిపిస్తుంది. ఇంతవరకు అనేకమంది వ్యక్తులు భూతప్రేతముల కారణంగా తమ ప్రాణాలు కోల్పోయారు. తాంత్రికుల వలలో చిక్కుకొని ధనమును, ఆరోగ్యమును, మనోబలమును కోల్పోయినవారు అనేకమంది ఉన్నారు. వారి మిథ్యావిశ్వాసమే నిజమైన భూతము వలె భ్రమింపజేసి వారి ప్రాణాలను బలిగొన్నది.

భూతములు నిజంగా ఉన్నవా? లేవా? అనేది ఒక శోధింప బడవలసిన విషయము. వెనుకబడిన వర్గములలో భూతోన్మాదము అనే జబ్బు ఉన్నది. దీనికి మూలంలో వారి మిథ్యా విశ్వాసమే ఉన్నది. అవసరమైనప్పుడు చుట్టుప్రక్కలున్న వాతావరణంలోని కారణములు, భూతములవలె వారిని ఆవహిస్తాయి. ఒక భూతము వారిని బలవంతంగా క్రియా కలాపాలు చేయిస్తున్నట్లు సంఘటనలు జరుగుతాయి. ఈ దౌర్భాగ్యపు స్థితి మిథ్యావిశ్వాసం మీద ఆధారపడి ఉన్నప్పటికి రోగిని జీవితాంతము పీడిస్తూనే ఉంటుంది. నిజంగా భూతము ఉన్నదా? లేదా? అనేదే నిర్ణయింపవలసి ఉన్నది. కేవలము నమ్మకము వలన స్వసమ్మోహితమైన రోగి (Self-Hypnotise) తనకుతాను ప్రాణసంకటానికి చేరుకుంటాడు.

ఫ్రాన్స్‌లో ఒకరాజు మృత్యుదండన ఇవ్వబడినవానికి విచిత్రమైన మనోవైజ్ఞానిక విధానములో ఉరిశిక్ష వేయించాడు. అతని కన్నులకు గంతలు కట్టేశారు. ఒక పాత్రలోంచి చుక్కలు చుక్కలుగా నీరు పడేటట్టు చేశారు. సూదిని గ్రుచ్చి రక్త నాళములను చిన్నగా కోసివేశాము అని చెప్పారు. ఆ నీటి చుక్కల చప్పుడును అతను సహజంగానే తన శరీరము నుండి స్రవించే రక్తపుచుక్కలు అనుకున్నాడు. తన రక్తము మెల్లమెల్లగా చుక్కలుచుక్కలుగా పడుతోంది అని చెప్పేటప్పటికి భయ భ్రాంతుడై చనిపోయాడు. ఒక వ్యక్తిని విషసర్పం కాటువేసింది. ఇది చూసిన వ్యక్తి వుత్తినే కొంచెము గీరుకుపోయిందని అతనికి చెప్పాడు. ఆ విషయము అక్కడితో మరచిపోయారు. చాలా రోజుల తర్వాత అతను నిజంగానే విషసర్పం కాటేసింది అనే సత్యాన్ని తెలిపారు. తక్షణమే అతనికి నాటి స్మృతి వచ్చి భయంతో చనిపోయాడు. ఇక్కడ విష ప్రభావ ప్రశ్నే లేదుకదా! మంత్ర తంత్రాలలో సాధారణంగా ప్రయోక్త యొక్క ఆత్మవిశ్వాసము, దృఢమైన మనోబలమే పనిచేస్తుంది. ఎవరిమీదైతే మంత్ర ప్రయోగము చేయబడుతున్నదో అతనికి కూడా ప్రయోక్త మీద ఒకప్పుడు విశ్వాసము ఉన్నప్పుడే అద్భుతమైన పరిణామాలు వస్తాయి.

సాధారణంగా భూతప్రేతముల గురించి వచ్చే ప్రసంగాలు అధికాంశము ఆధారరహితమైనవే. కానీ అప్పుడప్పుడు భూత ప్రేతముల వాస్తవిక అవతరణ కూడా జరుగుతుంది. ఒక్కొక్క సారి సానుభూతి కలిగిన ఆత్మ విశుద్ధంగా సహాయపడే దృష్టితో సంపర్కము పెట్టుకున్నా భూతప్రేతముల పేరుతోనే భయపడి పోయే వ్యక్తులు, సహాయము చేసేవారి, హాని చేసేవారి మధ్య తేడా తెలుసుకొనలేరు. పరోక్షజగత్తుకు సంబంధించిన సంవ్యాప్తమైన అజ్ఞానమే ఈ భూతోన్మాదానికి కారణము. వెనుక బడిన అజ్ఞానులయిన మూఢవిశ్వాసముగల వ్యక్తుల శారీరక, మానసిక స్థితిని సూక్ష్మశరీరధారి ఆత్మలనుండి వేరుగా గుర్తించాలి. ఒక వ్యక్తిమీదకు దేవీదేవతలు గాని, భూత ప్రేతములు గాని ఆవహిస్తాయి అనే అజ్ఞానాన్ని పూర్తిగా తుడిచి వేయాలి. మస్తిష్కముమీద ఆవరించి ఉన్న అజ్ఞానమే హిస్టీరియా లేక ఉన్మాదముగా బహిర్గతమౌతుంది. కానీ ఉత్కృష్టతా మార్గము మీదకు నడిపించటానికి సహాయపడే ఆత్మలు పరోక్ష జగత్తు నుండి ఇచ్చిపుచ్చుకునే మార్గము స్థాపన చేయదలచి నప్పుడు, అది ఎల్లప్పుడు ఒక శ్రేష్ఠ పరామర్శ రూపంలో లేక అజ్ఞాతమైన సహాయోగరూపంలో ప్రకటితమౌతోంది. అదృశ్య మగుటవలన చూడలేకపోయినా, అర్థము చేసుకొనలేకపోయినా కేవలము ఇది ఒక సంయోగము (Chance) అనుకున్నా సత్యము ఇదే. *(సశేషం)*

**ఇష్టమైన వృత్తిని ఎన్నుకుని కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి**

# తమ ఉనికి కోసం సంఘర్షిస్తున్న నదులు

జలప్రవాహముతో కూడిన నదులు మన జీవన వికాసమునకు, నీటిలో నివసించే జీవజంతువుల మనుగడకు ఆధారములు. నదుల ఉనికి వలన ప్రకృతి అత్యంత జీవంత మైనదిగా గోచరిస్తుంది. స్వచ్ఛమైన నీటితో ప్రవహించే నదుల సౌందర్యము ఎంత చూసినా తనివితీరదు. నదుల పవిత్రత, ప్రాముఖ్యతల కారణముగానే భగవాన్ భోలేనాథులు (శివుడు) గంగను తన జటాజూటములో ధరించి 'గంగాధరుడు'గా ప్రతీతిగాంచినాడు. శివుడు హిమవంతుని పుత్రికయైన పార్వతీదేవిని వివాహమాడాడు. ఈ కారణముగా నదుల రూపములో హిమాలయములలో ప్రవహించే హిమవంతుని ఇతర పుత్రికలు కూడా మహాశివునికి బంధువులైనట్లుగా చెప్పబడుతున్నారు. ఐతే ఈనాడు నదులు ఉన్న పరిస్థితులను చూస్తుంటే ఎవరికైనా బాధ కలుగుతుంది.

మహాశివుడు ఈనాడు నదుల పరిస్థితిని చూసి ఆగ్రహముతో రౌద్రరూపమును ధరించినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. మానవుల దుష్కర్మల వలన దేశములో నదులకు ఇలాంటి దుర్గతి పట్టింది. కొన్ని కొన్ని చోట్ల అవి ఎంత కలుషితమై ఉన్నాయంటే ఆ నీటితో కనీసము ఆచమనము చెయ్యటానికి కూడా వీలుకావటం లేదు. ఇలాంటి నదులలో నివసించే జలచరముల మనుగడ కూడా నేడు ప్రశ్నార్థకముగా మారిపోయింది. దేశములోని కొన్ని నదులైతే పూర్తిగా అదృశ్య మయ్యాయి.

నదుల యొక్క ఈ స్థితి మనస్సును ఎంతో కలచివేస్తుంది. మానవ నాగరికత అభివృద్ధి చెందటానికి, ప్రకృతి నిరంతరము పోషించబడటానికి ఆధారభూతమైన నదులు నేడు తమ ఉనికి కోసమే కొట్టుమిట్టాడుతున్నవి. వాటి దయనీయమైన స్థితిని చూసి హృదయము వ్యథాపూరితమవుతున్నది. నియంత్రణ లేని అభివృద్ధి, పారిశ్రామీకరణల కారణముగా మానవులు నదులను ఒక సాధనముగా చూడటము ప్రారంభించారు, తాము కోరుకున్న రీతిలో నదులను ఉపయోగించుకుంటున్నారు. పైపెచ్చు తమ మలమూత్రములను, పారిశ్రామిక వ్యర్థాలను, రకరకములైన విషపూరిత రసాయనములను నదులలోనికి వదలి వాటి జీవితాలను శాపగ్రస్తము గావిస్తున్నారు.

ప్రజలు ఎంతో శ్రద్ధగా తీర్థయాత్రలకు వెళ్తారు. నదులలో స్నానము చేస్తూ తమ శరీరము పైని మురికినే గాకుండా, హృదయములలోని పాపాలను కూడా కడిగివేసుకుంటున్నట్లు భావిస్తారు. అయితే ప్రస్తుత కాలములో పుణ్య క్షేత్రములలో ప్రవహించే నదుల పరిస్థితిని చూసి యాత్రికులు 'ఈ నదిలో స్నానము చెయ్యటమా? మానటమా? ఇందులో స్నానము చేస్తే పాపములను కడిగివేసుకొనటము మాట అటుంచి ఏమైనా చర్మవ్యాధులు కానీ, ఇతర వ్యాధులు కానీ అంటుకుంటాయేమో!' అని ఆలోచించవలసి వస్తున్నది. నిజానికి నేడు మానవజాతి యొక్క పాపభారము ఎంతగా పెరిగిపోయిందంటే దానిని మోసి మోసి నదులు ఎంతగానో అలసిపోవటమే కాదు; వాటి సహనము కూడా నశించిపోయింది.

'జాతీయ కాలుష్య నియంత్రణా మండలి' వారి యొక్క నివేదికను అనుసరించి ప్రస్తుతము మన దేశములోని నదులలో 35 నదులు పూర్తిగా కాలుష్యపు కోరలలో చిక్కుకుని ఉన్నాయని తెలుస్తున్నది. 2005 నుండి 2015 సంవత్సరముల మధ్య కాలములోని లెక్కల ఆధారముగా నిర్వహించిన అధ్యయనములో దేశములోని 40 నదుల యొక్క కాలుష్యస్థితిని పరిశీలించిన సందర్భముగా అస్సాంలో-1, దక్షిణ భారతదేశములోని 4 నదులు స్వచ్ఛతా ప్రమాణములకు తగినట్లుగా ఉన్నట్లు తేలింది. మిగిలిన 35 నదుల పరిస్థితి కాలుష్యపు దెబ్బలతో ఎంతో దయనీయముగా ఉంది. కాలుష్యపు కోరలలో చిక్కుకున్న నదులే కాక; వాటి ఉపనదులు కూడా తమ అస్తిత్వము కోసము గిలగిలలాడుతున్నాయి, ఘర్షణ పడుతున్నాయి. మరికొన్నింటి పరిస్థితైతే అవి 'నదులు' అని చెప్పటానికి కూడా వీలుకాని పరిస్థితి!

అసలు సత్యమేమిటంటే మన దేశములో 70% నదులు కలుషితమైనవే! కానీ కాలుష్య నియంత్రణా మండలి కేవలము 40 నదులను-83 చోట్ల పరిశీలించింది. వాటిలో నాలుగు అంశములను కొలబద్దగా తీసుకుంది. అవి 1) బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 2) డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ 3) టోటల్ కోలీఫార్మ్ 4) టోటల్ డిజాల్వ్ సాలిడ్. ఈ విధముగా 1) బయోకెమికల్

**దయాగుణం + కష్టం + ఓర్పు = సంఘసేవ**

ఆక్సిజన్ డిమాండ్' నీటిలోని ఆక్సిజన్‌ను ఉపయోగించే తత్త్వములను; 2) 'డిజాల్వ్‌డ్ ఆక్సిజన్' కేవలము ఆక్సిజన్ ప్రాణమును 3) టోటల్ కోలీఫార్మ్' మొత్తం ఎన్ని రకములైన సూక్ష్మక్రిములు ఉన్నాయనే విషయమును; 4) టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్ అనేది నీటిలో ఉన్న ఘనపదార్థ తత్త్వములను ప్రకటిస్తాయి.

ఈ పరిశోధన-అధ్యయనముల ద్వారా నీటిలోని స్వచ్ఛత చెడిపోవటానికి 'కోలీఫార్మ్' అనబడే బాక్టీరియా యొక్క ఉనికియే ముఖ్యకారణము అని వెల్లడైనది. నియమానుసారము 100 మిల్లీలీటర్ల నీటిలో 500 కన్నా అధికముగా కోలీఫార్మ్ సూక్ష్మ క్రిములు ఉండకూడదు. కానీ యమునానదిలో అక్కడక్కడా వీటి సంఖ్య 16 కోట్ల వరకు ఉన్నట్లు తెలిసింది. పరీక్ష చేసిన వానిలో 51 నమూనాలలో 1) 'బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్'. పరిమాణము అధికముగా కనపడింది. 57 ప్రదేశములలో 2) డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ యొక్క పరిమాణము నీటి స్వచ్ఛతను ప్రభావితము చేసేటంత అధికముగా ఉన్నట్లు వెల్లడైనది. కేవలము కొన్ని ప్రదేశములలో మాత్రమే కోలీఫార్మ్ సూక్ష్మజీవులు ఉండవలసిన సంఖ్యలో ఉన్నాయి. కానీ మిగిలిన ప్రదేశములలో వీటి పరిమాణము చాలా అధికముగానే ఉన్నట్లు తెలిసింది. ఇదేవిధముగా 39 చోట్ల నీటి యొక్క నాణ్యత 4) టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్ వల్ల ప్రభావితమై ఉన్నది.

కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి మూడు సంవత్సరముల పాటు దేశములోని 29 నదులలోని నీటి స్వచ్ఛతను విశ్లేషించి 12,363 కి.మీ. విస్తీర్ణము గల నదీ క్షేత్రములో 1500 కి.మీ. నదీక్షేత్రము కనీసము నీటిలో పెరిగే మొక్కలు, జీవజంతువులు సైతం బ్రతకలేనంతగా కలుషితమైనట్లు వెల్లడించినది. అన్నింటికన్నా బాధాకరమైన అంశమేమిటంటే 1991వ సంవత్సర ప్రాంతములో దేశములోని ఈ 29 నదుల కాలుష్యము రెండు రెట్లు పెరిగింది. పట్టణముల నుండి వచ్చే చెత్తాచెదారమే నదులలోని మురికికి ముఖ్యకారణమని నివేదిక ద్వారా తేటతెల్లమైనది. పూర్తిగా స్వచ్ఛమైనది, నిర్మలమైనదైన నది ఈనాడు మనదేశములో ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు.

నదులను కలుషితము చెయ్యటమే కాదు; వాటిని పూర్తిగా వాడుకుంటున్నారు కూడా! అమరకంటకములో ప్రారంభమై వింధ్య-సాత్పురా పర్వతశ్రేణుల గుండా ప్రయాణించి అరేబియా సముద్రములో విలీనమయ్యే నర్మదానది ప్రవహించే మొత్తము 1289 కి.మీ. క్షేత్రమంతా ఆవు నుండి పాలను పితికినట్లే అత్యధికముగా వాడుకోబడినది. బైతుల్ జిల్లాలోని ములతాయి నుండి బయలుదేరి సూరత్ ద్వారా ప్రయాణించి అరేబియా సముద్రములో కలిసిపోయే సూర్యపుత్రికయైన తపతీనది కూడా ప్రస్తుతము అదే పరిస్థితిలో ఉన్నది.

అత్యధికముగా ఉపయోగించుకొనటము వల్ల కలిగే దుష్పరిణామముల కారణముగా 'తమసానది' ఎప్పుడో కనిపించకుండాపోయింది. తత్ఫలితముగా బేతవా యొక్క కొన్ని ఉపనదుల తాలూకు చిన్నా-పెద్దా ప్రవాహజలధారలు ఎండి పోయినవి.

కాన్పూర్‌లోని పాండునది పూర్తిగా అంతరించిపోయే ప్రమాదస్థితిలో ఉన్నది. ఉత్తరాఖండ్‌లోని గీలానది హల్ద్వానీ చేరుకొని ఇసుకమేటతో నిండిన మైదానముగా మారిపోతున్నది. అక్కడే ఉత్తరప్రదేశ్ యొక్క పశ్చిమ భాగములోని శహరన్‌పూర్ జిల్లాలో పంచదార కర్మాగారముల కారణముగా యమునానది విషాక్తమవుతున్నది. ఇవన్నీ నదుల దుర్దశకు సంబంధించిన చిన్నపాటి వివరణలు మాత్రమే! లెక్కకురాని ఇంకెన్ని వివరణలు ఉన్నాయో తెలియదు. కానీ ఆ నదులు ప్రస్తుతము తామున్న దుఃస్థితిని భరించక తప్పని పరిస్థితిలో ఉన్నాయి.

నదులు మానవుడి అభ్యున్నతికి, వికాసమునకు ఎంతో ఉపకారము చేశాయి. బదులుగా తమకు ప్రత్యుపకారము చెయ్యమని అవి ఎన్నడూ కోరలేదు. పరులకు మేలు చెయ్యటానికే అవి నిరంతరము ప్రవహిస్తుంటాయి. అంతేకాదు మానవులు చేసే దుష్కర్మల తాలూకు పరిణామములను కూడా అవి అనుభవిస్తుంటాయి. ఇటువంటి పరిస్థితులలో నదులు చేసే దీనమైన ఆలాపనలను పెడచెవిన పెట్టకుండా ఉండటము, వాటి దుఃస్థితిని చూసిచూడనట్లుగా ఉండకుండా ఉండటము, వాటి స్వచ్ఛత కోసము-పునరుద్ధరణ కోసము భగీరథుని స్థాయిలో పురుషార్థ ప్రయత్నము చెయ్యటము, నదుల స్వచ్ఛతా కార్యక్రమములో భాగస్వాములం కావటము అన్నది కనీస మానవ బాధ్యతగా స్వీకరించాలి.

*- అఖండజ్యోతి, జనవరి 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**సమాజసేవ చేయాలని అనుకునేవారికి ఉండవలసిన ప్రాథమిక లక్షణం దయాగుణం**

# విద్యతో పాటు స్వావలంబనకు శిక్షణనివ్వాలి

మహాత్మాగాంధీ 'విద్య' అను పదమును విశ్లేషిస్తూ "ఏ విద్య నేర్వటం వలన విద్యార్థి అంతులేని జ్ఞానరాశిని స్వంతం చేసుకుంటాడో, తర్కంలో దిట్ట మరియు పాండిత్యములో మేటి అని పేరు గడిస్తాడో; అదే విద్య. ఆ విద్యార్థిని సదాచార పరాయణుడిగా తీర్చిదిద్దకపోతే; మనస్సు-ఇంద్రియములను నియంత్రణంలో ఉంచుకొనుటను నేర్పించకపోతే; ఆత్మ వికాసము కలగచేయదో, స్వావలంబిగా నిలబెట్టదో అట్టి విద్య అసంపూర్ణమైనదే' అని అన్నాడు.

ప్రస్తుతము అమలులో ఉన్న విద్యా విధానము 'విద్యార్థిని తనను తాను స్వావలంబునిగా తీర్చిదిద్దుకొనుటలో మరియు నిత్యజీవితములో వ్యావహారికముగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకొనుటలో అసమర్థునిగా నిలబెడుతున్న వైనం నిరుద్యోగుల వృద్ధి శాతము ఋజువు చేస్తున్నది. లభిస్తున్న గణాంకములననుసరించి చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువత సంఖ్య ప్రతి సంవత్సరము తామరతంపరగా పెరుగుతూనే ఉన్నది.

ప్రభుత్వము ఒక పరిమిత సంఖ్య వరకే విద్యావంతులకు ఉద్యోగావకాశమును కల్పించుటలో సఫలమవుతున్నది. అందుచేతనే ప్రతి సంవత్సరం గణనీయముగా పెరుగుతున్న విద్యావంతులు ఉద్యోగావకాశమును పొందుటలో విఫలమవు తున్నారు. చదువుకున్న యువత సంఖ్య ఈ విధముగా వృద్ధి చెందుతుండటం వలన పరిస్థితి మరింత జటిలముగా మారు తున్నది. అప్పుడిక దేశ అభ్యున్నతికి దేశములోని యువశక్తి యొక్క భాగస్వామ్యము నామమాత్రముగా ఉండిపోతుంది.

ప్రస్తుతము ఈ సమస్యా పరిష్కార మార్గము ప్రభుత్వమునకే విడచిపెట్టి మౌనముగా ఉండటమా? (లేక) దేశములోని మేధావులు మరియు సామాన్య మానవులు కూడా శాశ్వత పరిష్కార దిశగా అడుగులు వేయవలసిన కర్తవ్యమున్నదా? అనేది ఇక్కడ ఆలోచించవలసిన అంశము. సగటు మానవుల సహాయ సహకారముతోనే ప్రభుత్వ పథకములు విజయవంత మవుతాయి అన్నది సర్వవిదితమే. గత కొన్ని సంవత్సరములుగా నిరుద్యోగ సమస్య దేశమును పట్టి పీడిస్తున్నది. అంతేకాదు అది రోజురోజుకు మరింత భయంకర రూపును దాల్చుతున్నది. ప్రభుత్వ కొలువుల్లో పరిమిత సంఖ్యలోనే ఉద్యోగస్థుల అవసరం ఉంటుంది. ఆ కారణము చేత అవకాశములు కూడా కొందరికే అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ కొలువుల్లో విద్యావంతులు అందరికీ ఉద్యోగము లభించే అవకాశముంటుంది అని భావించటము అవివేకము.

రెండు రకములైన ప్రయత్నముల ద్వారా నేడున్న సమస్యకు పరిష్కారమును వెతుకవలసి ఉన్నది. 1) ప్రభుత్వ సహకారమును ఆశించటము 2) లోకుల చేదోడు వాదోడు సాధించటము. ఇతర దేశములలో విద్య రెండు భాగములుగా విభజించ బడినది. 1) సామాన్య విద్య 2) ప్రత్యేక విద్య. సాధారణ విద్యతో పాటు సర్వసాధారణముగా ఉండే అనేక రకములైన విద్యాంశముల బోధన అన్నది కూడా జోడించబడినది. విద్యార్థులకు నిత్యజీవితములో పనికొచ్చే సామాన్య పరిజ్ఞానం కూడా అనివార్యరూపంలో అందించబడుతున్నది. రష్యా, అమెరికా మరియు ఇంగ్లాండ్ వంటి దేశములలో ప్రాథమిక మరియు ఉన్నతస్థాయి విద్యతోపాటుగానే విద్యార్థిలో నైపుణ్యం పెరిగేందుకు మరియు ఉద్యోగావకాశమును కల్పించేందుకు అవసరమైన చదువు కూడా బోధించబడే వ్యవస్థ ఉన్నది. ఇలా చేయటం వలన విశిష్టమైన విద్యను పొందలేని విద్యార్థులు కూడా ఉద్యోగ వేటలో పరుగులు పెట్టాల్సిన అవసరం రాదు. తన బ్రతుకుబండిని తానే సజావుగా నడుపుకోగలగటానికి కావలసిన వృత్తిపరమైన పలు నైపుణ్యాలను విద్యార్థి ఈ దశలోనే సముపార్జించుకునే వెసలుబాటు ఉంటుంది. ఏ విద్యాలయాలలో ఈవిధమైన వ్యవస్థ లేదో అక్కడ ప్రత్యామ్నాయ సంస్థలు ఈ రకమైన శిక్షణనే అందిస్తున్నాయి. అందువలన విశిష్టమైన విద్యను పొందలేనటువంటి విద్యార్థులకు సైతం ఉద్యోగము కోసం తిప్పలు పడవలసిన అవసరం రాదు. ఏకకాలములో అనేకమైన పనులు చక్కబెట్ట గలిగే శిక్షణ పొందుటచేత తన జీవనరథమును తానే స్వయముగా నడపగలిగే ప్రావీణ్యము ఈ స్థాయిలోనే లభిస్తుంది. ఇలాంటి చోట్ల ఎన్నోరకములైన విద్యలు అందుబాటులో ఉన్నాయి.

**సద్గుణాలను మించిన సౌందర్యం లేదు**

కుటీరపరిశ్రమలు, వ్యవసాయపు మెళకువలు, చిత్రలేఖనము, చిన్నచిన్న యంత్రపరికరములను తయారుచేయటము, గడియారములు మరమ్మత్తు చేయటము వంటి వృత్తిపరమైన పలు శిక్షణలు పొందగలిగే అవకాశములు మెండుగా ఉన్నాయి. ఎంతోమంది విద్యార్థినీ-విద్యార్థులు తమ విద్యార్థి దశలోనే వీటిలో ప్రావీణ్యతను గడించి స్వావలంబిగా నిలబడగలిగే శిక్షణను పొందుతున్నారు. ఏవో కొన్ని వ్యక్తిగతమైన కారణముల చేత ఇంకా పై చదువులు చదవలేనివారు స్వంతంగా తమదంటూ ఒక వ్యాపారమును ఆరంభిస్తున్నారు లేదా వృత్తిపరమైన నైపుణ్యము కలిగి ఉండుట చేత ఏదో ఒక పేరెన్నికగన్న సంస్థలో సులభముగా ఉద్యోగమును పొందు తున్నారు.

అసమాన ధీశక్తి (తెలివితేటలు) కలిగిన మరియు భవిష్యత్తులో పి.హెచ్.డి. చేసి తన ప్రతిభను నిరూపించు కోవాలనుకునే యువత మాత్రమే విశిష్ట విద్య వైపు మొగ్గు చూపుతుంది. రష్యా మున్నగు దేశములలో దేశం యొక్క అవసరములను బట్టి విద్య అందించబడుతుంది. ఏ రంగములో ఎంత మంది మనుష్యులు అవసరమో అంతమంది వ్యక్తుల పేర్లు మాత్రమే ఆ విభాగములో నమోదు చేయబడతాయి. ఇలా చేయటం వలన అసంతులన పరిస్థితి తలెత్తదు, మన దేశములోలాగా వృత్తి నైపుణ్యాలు నిరూపించబడిన తదుపరి యువత ఉద్యోగ ప్రయత్నము చేయుట వలన దాపురించిన పరిస్థితి ఎదురుకాదు. మన దేశమునకు కూడా పైన చెప్పబడిన వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. దేశమునకు ఎంత మంది ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, వైద్యులు అవసరమవుతారో గణాంకముల ద్వారా సేకరించి; ఆయా రంగములలో ప్రత్యేక నైపుణ్యాన్ని కనబరిచినవారి పేర్లు మాత్రమే నమోదు చేయబడే రీతిలో షరతును వర్తింపజేస్తూ అవసరమైన మేరకే యువతను ఎన్నుకొన్నచో నేడున్నటువంటి అసంబద్ధమైన పరిస్థితి ఎదురవ్వదు. ప్రత్యేక విద్యను అభ్యసించాలనుకునేవారి కొరకు ఇటువంటి ప్రణాళికాబద్ధమైన, ముందుచూపుతో నిండిన వ్యవస్థ మన దేశమునకు ఎంతగానో అవసరము.

**సామాన్యమైన విద్యను అభ్యసించేవారికి తప్పకుండా వృత్తి నైపుణ్యాలను ఒసగే శిక్షణ అందించబడాలి.** మన దేశములో ప్రస్తుతము ఉన్నతవిద్య, ఇంటర్, బి.ఎ.లో ఉత్తీర్ణులైన పిమ్మట ప్రభుత్వ కొలువుల్లో ఏదైనా ఒక ఉద్యోగము రానిచో యువత పనీపాటా లేకుండా ఉండిపోవలసి వస్తున్నది. స్వయముగా ఏదైనా బ్రతుకుతెరువు చూసుకోవటమో లేక వ్యాపారమో చేసుకొనగలిగే శక్తి సామర్థ్యము యువతలో కొరవడుట వలన ఇలా ఉండిపోవటం మినహా ఏమీ చేయలేని దుఃస్థితి తారసిల్లు తున్నది. తత్కారణముగా యువత ఉద్యోగపు అన్వేషణలో వీధివీధి తిరగవలసి వస్తున్నది. **నేడు అమలులో ఉన్న విద్యా విధానముతో పాటు ఉద్యోగావకాశమును కల్పించగలిగే చక్కని శిక్షణా పద్ధతి అమలులోకి తేవలసిన అవసరమెంతైనా ఉన్నది.** ఇలా చేస్తే యువతలో తమ కాళ్ళ మీద తాము నిలబడగలిగే ఆత్మవిశ్వాసము ఉత్పన్నమవుతుంది మరియు చదువు పూర్తయిన తరువాత తమ నైపుణ్యము ఆధారముగా చిన్నచిన్న వ్యాపారములు ప్రారంభించి వచ్చిన డబ్బుతో జీవితాన్ని హాయిగా వెళ్ళబుచ్చగలుగుతుంది. నిరుద్యోగ సమస్య మరింత విజృంభించకుండా ఉండటం కోసం చదువుతో పాటు పైన చెప్పబడిన పద్ధతికి రూపకల్పన చేసుకోవాలి.

నైపుణ్యమును గడించిన యువత ఉద్యోగము లేనందున నిరర్థకముగా తిరుగుతూ తన శ్రమశక్తిని పాడుచేసుకుంటున్నది. అలాంటివారి కోసం ప్రభుత్వ సంస్థల ఆసరాతో కుటీర పరిశ్రమలను నెలకొల్పగలిగే వ్యవస్థ నిర్మించబడాలి. సుశిక్షిత యువత యొక్క నిరుద్యోగ సమస్యను పారద్రోలుటలో ఒక మనోవైజ్ఞానిక అవరోధము కూడా ఉన్నది. బ్రిటిష్ పాలకులు కార్యాలయములలో పనిచేసే ఉన్నతాధికారులకు ఇచ్చిన గౌరవ - ప్రతిష్ఠల పట్ల కలిగించిన మోజు ఈనాడు కూడా మన మనస్సులలో వ్రేళ్ళూనుకునియున్నది. పెద్ద పెద్ద ఉద్యోగములు చేస్తూ అధికారం చెలాయించేవారు, ఉన్నతపదవులలో ఆసీనులై అలవోకగా సంతకాలు పెట్టి పెత్తందారీతనం వెలగబెట్టే వారంతా పెద్దలనీ; అలా కాకుండా శారీరిక శ్రమ చేసేవారు, చిన్నాపొన్నా పనులు చేస్తూ పొట్ట నింపుకునేవారు చిన్నవారని భావిస్తూ వారిని వేలెత్తి చూపించే ఆనాటి చెడు సంస్కారము నేడు కూడా మనదేశములో ఇంకా కొనసాగుతున్నది. అందువలన **శ్రమ పట్ల అయిష్టత మరియు దానిపట్ల విముఖత చూపించే ప్రవృత్తి నేడు సర్వత్రా కానవస్తున్నది. ఈ మనోస్థితే నెమ్మది నెమ్మదిగా పనిదొంగలుగా తయారవ్వటం, పాపిష్టి సంపాదనతో పొట్ట నింపుకోవటం అనే హేయమైన ప్రవృత్తిగా**

**ప్రశ్న విజ్ఞానానికి తల్లి వంటిది**

**పరిణమించినది. నిరుద్యోగ సమస్య పరిష్కరించ బడకపోవటం వెనుక గల కారణములలో శ్రమ పట్ల విముఖత అన్నది కూడా ఒక అడ్డంకిగా నిలుస్తున్నది.**

ప్రజలలో శ్రమ ఎడల ఈ విముఖత, అయిష్టత లేనట్లయితే విశేషమైన యోగ్యత-అనుభవము పెద్దగా అవసరము లేనటువంటి మరియు ప్రత్యేకమైన ఏ శక్తి-సామర్థ్యము ప్రదర్శించనవసరము లేకుండా సహజముగా చెయ్యగలిగే వృత్తిపనులు ఎన్నో ఉన్నాయి. కొద్దిపాటి అభ్యాసం చేతనే వాటిని ఎవరైనా సులువుగా చెయ్యవచ్చును. వంశపారం పర్యంగా వస్తున్న వృత్తులెన్నో ఉన్నాయి. ఉదా: కంసాలి-కుమ్మరి-మంగలి-చర్మకారుడు-దర్జీ-వ్యవసాయం. ఇటువంటి వంశానుగత వృత్తులను కొనసాగించే ఇంటిలో పాలవ్యాపారం వంటి వృత్తులలో కొనసాగటానికి విశిష్టమైన మెళకువలు సముపార్జించవల్సిన ఆవశ్యకత కూడా ఏమీ లేదు. అయితే వాటిలో కొద్దిపాటి అధికశ్రమ చెయ్యవలసి ఉండి ఉన్న కారణము చేత యువత వాటిపట్ల విముఖత చూపిస్తున్నది. బ్రతుకుతెరువుకు అవి ఆసరాగా నిలుస్తున్నా యువత వాటి పట్ల అభిరుచిని ప్రదర్శించటము లేదు. శ్రమ ఎడల ఉపేక్షను చూపించే ఈ మనోప్రవృత్తిని మార్చవలసి ఉన్నది.

ప్రభుత్వ సంస్థలను స్థాపించాలి. అలాగే వాటి చేయూతతో మనగలుగుతూ లాభాల బాటలో నడిచే కుటీర పరిశ్రమలను గురించి జనబాహుళ్యములో విరివిగా ప్రచారం కల్పించాలి. కొద్దిమంది ఆలోచనాపరులు మరియు సమర్థులు ఈ పవిత్ర కార్యం కొరకు చొరవ చూపిస్తూ నడుం బిగించినచో ఏ సమస్యయైతే ప్రభుత్వమునకు పెద్ద తలనొప్పిగా ఉన్నదో అది చూస్తూ చూస్తూ ఉండగానే తొలగిపోతుంది. కుటీర పరిశ్రమలను పట్టణములలో కంటే గ్రామములలోనే ఎక్కువగా వికేంద్రీ కరించినచో అవి మెరుగైన ఫలితాలను ఇవ్వటముతోపాటు పల్లెల అభివృద్ధికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి.

ఈ రకమైన ద్వివిధ ప్రయత్నముల ద్వారానే దేశమెదుర్కొం టున్న పైన చెప్పినటువంటి సమస్యలను శాశ్వతముగా పారద్రోలగలము. విద్యతోపాటు **'ఆత్మస్థైర్యము పొందుటకు, దైనందిన జీవితములో ఎదురయ్యే సమస్యలకు, పరిష్కారాలను చూపగలిగే శిక్షణా పద్ధతుల వ్యవస్థ'** జతకలవనిచో విద్యను ఆర్జించిన యువత సంఖ్య ప్రతి సంవత్సరము పెరుగుతూనే ఉంటుంది తప్ప దేశం యొక్క సంతులన మరియు ప్రగతిలో ఆ యువత యొక్క పాత్ర-సహకారం నిరర్ధకమై పోతుంది.

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## కోరిక ఆత్మజ్ఞానానికి బంధనము

*కాకాభుసుండికి ఈ ప్రపంచంలో విద్వాంసుడైయుండి ఆత్మజ్ఞాన శూన్యుడై పడి ఉన్న దీర్ఘజీవి ఎవరో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది. వశిష్ఠుని ఆజ్ఞపొంది వెతకటం ప్రారంభించాడు. గ్రామాలు, నగరాలు, వనాలు సమస్త ప్రదేశాలు తిరిగి చివరకు విద్యాధరుడనే బ్రాహ్మణుని కనుగొన్నాడు. వేదశాస్త్ర పరిపూర్ణ అధ్యయనం చేసి ఏ సందేహానికైనా అవలీలగా సమాధానాన్ని ఈయగలడు. ఈయన దర్శనం వలన కాకాభుసుండికి అపరిమిత ఆనందం కలిగింది. కానీ ఇంత గొప్పవాడైనా ఇతడిని ఆత్మజ్ఞానిగా ప్రజలు ఎందుకు చెప్పుకోరో అర్థం కాలేదు. ఇది తెలుసుకోవటానికి కాకాభుసుండి రహస్యంగా విద్యాధరుని వెంట తిరుగసాగాడు. ఒకరోజు నీలగిరి పర్వతం మీద విద్యాధరుడు వనవిహారం చేస్తూ ఉండగా ఆయనకు కణ్వద రాజకన్య కంటపడింది. ఆ స్త్రీ సౌందర్యానికి ముగ్ధుడై, ప్రకృతి సౌందర్యం ద్వారా పొందే ఆనందాన్ని విస్మరించి కామంతో కుక్కలా ఆమె వెంట పడసాగాడు. ఆ క్షణంలో ఆయనకు శాస్త్రజ్ఞానంగానీ, బ్రాహ్మణత్వం గానీ గుర్తుకురాలేదు. ఇంతలో రాజభటులు ఈ ఉన్మత్తుణ్ణి చూడటం, బంధించి కారాగారంలో పడవేయటం క్షణంలో జరిగిపోయాయి. కారాగారంలో పడియున్న విద్యాధరుని కాకాభుసుండి సమీపించి, 'ఓ విద్వాంసుడా కోరిక ఆత్మజ్ఞానానికి బంధనమని గ్రహించలేకపోయావు. నీ కాముకత్వమే నీకిలాంటి దుస్థితిని తెచ్చిపెట్టింది' అని ఆయన తప్పిదాన్ని తెలియ చెప్పాడు. విద్యాధరుడు సిగ్గుతో తలవంచుకొన్నాడు. సౌజన్యం-వినమ్రత, కర్మ-నిష్ఠ-పరాక్రమం వీటి సమన్వయ స్వరూపమే జీవితాన్ని క్రియాన్వితం చేయటంలో ప్రముఖపాత్ర వహిస్తోంది. ఈ రెండూ అన్యోన్యాశ్రితమైనవి.*

– *ప్రజ్ఞాపురాణం నుండి, అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**జీవితేచ్ఛ ఉన్నచోట విసుగు అనేమాట ఉండదు**

# గహనాకర్మణోగతిః

న్యాయస్థానంలో ఉన్న బోనులో మహాత్మా ఓంకారానందులవారు శాంతంగా, స్థిరంగా చాలా సహజంగా నిలబడి ఉన్నారు. ఆయన తన తరపున ఏ వకీలును నియమించుకోలేదు. తనపై మోపిన ఆరోపణలకు ప్రతిగా వాదించదలుచుకోను లేదు. ఆయనపై మోపబడిన ఆరోపణలు చాలా గంభీరమైనవి. అవి నిరూపింపబడితే ఆయనకు జీవితఖైదు కానీ, ఉరిశిక్ష కానీ పడుతుంది. అయినా ఆయన ప్రతివాదము చేయదలుచుకోలేదు. ఆయన వైపు వారంతా చాలా ఉద్వేగంతోను, బాధతోను విచలితులైవున్నారు. కానీ మహాత్ములు మాత్రం ప్రశాంతంగా, నిశ్చింతగా ఉన్నారు.

ఆయన వ్యతిరేకులు కొందరు ఆయనపై ఒక మహంతు హత్య కేసులో ఇరికించారు. మహంతుగారి అనుయాయులు తప్ప మహాత్ములే ఇందుకు కారణమని ఎవరూ నమ్మడం లేదు, సమర్థించడం లేదు. సేవాభావం, ఉదారత, కరుణతో నిండిన హృదయమున్న సదాచారపరులైన మహాత్ముల వారు ఇంత ఘోరమైన హత్యను ఎలా చేస్తారని వారి ఉద్దేశ్యం. పాపాత్ములను ఇంకా అంతకంటే ఎక్కువ దుర్మార్గులను కూడా ఆయన సహృదయంతో ఎన్నోసార్లు క్షమించారు. అది అందరు చూశారు. అటువంటి ఆయన అంతటి అపరాధం చేస్తారని వారికి కలలో కూడా ఊహించడం కష్టమే.

కానీ చట్టం భావనలపై ఆధారపడి కాక సాక్షాలపై ఆధారపడి తీర్పు చెప్తుంది. ప్రజల భావనలకు వ్యతిరేకంగా మహాత్ముడే దోషియని నిరూపించే సాక్ష్యాలు బలంగా సిద్ధం చేయబడ్డాయి. వాటిని ఆధారంగా చేసుకొని ప్రత్యర్థి తరఫు వకీలుతన వాదనను ఇలా వినిపించాడు – 'జడ్జీగారు! ఈయన మహాత్ముడు కాదు, ఒక హంతకుడు. మహాత్ముని వేషంలో ఉన్న మహాపరాధి. ఆశ్రమ సంపదనంతటినీ హరించాలనే దురుద్దేశంతో ఒక పథకం ప్రకారమే ఈ ఘోరానికి ఒడికట్టాడు. ఈయన పరమలోభి. పైకి సామాన్య రూపంలో కనిపిస్తూ ప్రజలను మభ్యపెడుతూ పరోక్షంగా కుట్రపన్ని ఇదంతా చేశాడు'.

మహాత్ములైన ఓంకారానందులకు అతని వాదనను విన్న తరువాత ప్రపంచం పట్ల నాకు ఉన్న వైరాగ్యం ఇంకా ఎక్కువైంది. మనిషి తన స్వార్థమును, అహంకారమును తృప్తిపరుచుకునేందుకు మోసము, కపటములతో జీవిస్తూ సదాచారానికి, ధర్మానికి, మానవీయ విలువలకు నీళ్ళొదిలేయడం చూస్తుంటే ఆయనకు చాలా బాధ కలిగింది. 'నేను', 'నాది' అనే పదాలే జీవితానికి ఆధారాలైనాయి. వాటిని పరిరక్షించుకునేందుకు మనిషి ఎటువంటి తప్పు చేయడానికైనా వెనుకాడటం లేదు. కానీ వీటన్నింటి మధ్య కూడా కర్మ యొక్క గతి చాలా లోతుగా పనిచేస్తూనే ఉంటుంది. దీని నుండి ఎవరూ తప్పించుకోలేరు. ఆ కర్మయే ఆయనను బోనులో నిలబెట్టింది. ఒక బలీయమైన కర్మయే తనను ఇంతదాకా లాక్కుని వచ్చింది. ఈనాడు మరొక శుభకర్మయే ఈ సమస్య నుండి ఆయనను బైటపడేస్తుందని ఆయనకు తెలుసు.

అయినా ఆయన తనకు వకీలును నియమించుకోలేదు. అందువల్లనే న్యాయం ఏకపక్షీయమైంది. ప్రతివాది వకీలు సిగ్గు వదిలేసి తన వాదనకు సిద్ధపడ్డాడు. అది ప్రజలను బాధకు గురిచేసింది. వారంతా ఆయనను ఒక వకీలును నియమించుకోవాలని బ్రతిమాలారు. ఆయన వారిని సమాధానపరుస్తూ 'మీరు బాధపడవద్దు. నాకేమీ కాదు. ఏ కర్మ నన్ను ఇక్కడ నిలబెట్టిందో దానినుండి నేను విముక్తి పొందాను. మీకు అది అర్థం కాదు. నాకు భగవంతునిపై నమ్మకముంది. ఆయన నాపై దయ చూపిస్తాడు.' అని చెప్పారు.

వకీలు వాదనలు విన్న జడ్జిగారు నిజాయితీగల వ్యక్తి. ఎన్ని తప్పుడు సాక్ష్యాలు చూపించినా ఆయన ద్వారా నిర్దోషులకు ఎప్పుడూ శిక్ష పడలేదనే పేరు ఉంది. అందుకే ఆయనను అందరు చాలా గౌరవిస్తారు. ఈ కేసు విచారణను, తీర్పును ఆయన కొద్ది రోజులు వాయిదా వేశారు.

ఆ రాత్రి ఆయనకు నిద్రపట్టలేదు. తన పదవీకాలంలో న్యాయస్థానంలో అంత నిశ్చలంగా ఉన్న వ్యక్తిని ఎప్పుడూ చూడలేదు. ఎంత నిర్దోషియైనా ఆ వాతావరణంలో కొంత ఒత్తిడిని అనుభవిస్తాడు. కానీ అంత గంభీరమైన ఆరోపణలున్నా కూడా అంత నిశ్చింతగా, నిర్ద్వంద్వంగా నిలబడ్డ వ్యక్తిని చూడలేదు. దానితో పాటే ఆయనకు, తనకు పూర్వపరిచయమున్నదనే అనుభూతి కలుగుతున్నది.

ఈ ఆలోచనలతోనే నిద్రపోయారు జడ్జిగారు. కలలో ఆయనకు ఒక దివ్యపురుషుడు కనిపించి 'పుత్రా! మహాత్ముడు అపరాధి కాదు. నిర్దోషి. ఆయనతో నీకు పూర్వజన్మ సంబంధ

**కష్టమన్నది లేకుండా ఎవరు ఏ పాఠం నేర్చుకోలేరు**

ముంది. ఆయనను నిర్దోషిగా నిరూపించాలంటే మహంతు కార్యక్రమాలు చూసే కార్యదర్శిని వేరుగా పిలిచి మాట్లాడు' అని చెప్పారు.

మరుసటిరోజు న్యాయస్థానం కార్యక్రమం ప్రారంభం కాక ముందే జడ్జిగారు అతనిని, అతనితోపాటే ఆ క్షేత్రానికి సంబంధించిన పోలీసు అధికారిని కూడా పిలిపించారు. పోలీసు వారు ఆ కార్యదర్శిని ప్రశ్నలు వేయడం మొదలుపెట్టిన కొద్దిసేపటికే అతను డబ్బుపై ఆశతో ఈ నేరాన్ని తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే అతనిని న్యాయస్థానంలో హాజరు పరచగా తన నేరాన్ని ఒప్పుకొని శిక్షను స్వీకరించాడు.

న్యాయస్థానంలో జరిగిన ప్రచండమైన వాదనలన్నీ గాలికి ఎగిరిన దూదిపింజల వలె కొట్టుకుపోయాయి. మహాత్ముల వారిని నిర్దోషిగా ప్రకటించి ఆయనను సగౌరవంగా ఆశ్రమానికి పంపించారు. తీర్పు అయితే ఇచ్చారు కానీ జడ్జిగారికి రాత్రి కలలో లభించిన దివ్యసంకేతాలను గురించి తెలుసుకోవడం మిగిలిపోయింది. దానిని తెలుసుకునేందుకై మహాత్ముల వారి కుటీరానికి వెళ్ళారు.

మహాత్ముల వారు జడ్జిగారిని చాలా ఆప్యాయంగా పలకరించి దగ్గర కూర్చోబెట్టుకొని దాహం తీర్చారు. జడ్జిగారు ఇలా అన్నారు – 'మీరు హత్య వంటి ఘోరమైన అపరాధం చేయరని, నిరపరాధియని తెలుసు. కానీ ఇంత వ్యతిరేక పరిస్థితిలో కూడా మీరు అంత శాంతంగా, స్థిరంగా ఎలా ఉండగలిగారు?' మహాత్ములవారు 'శాంతి, స్థిరత్వం అనేవి అవతలివారిని దోషులు గానో, నిర్దోషులుగానో నిరూపిస్తే వచ్చేవి కావు. ఆత్మ విశ్వాసము తోను, ఈశ్వరునిపై ఉండే నమ్మకముతోను వస్తాయి. నాకు నా కర్మపై సంపూర్ణ విశ్వాసముంది. భగవంతుడు కృపతో నన్ను ఈ విపత్కర పరిస్థితి నుండి బైటపడేస్తారనే నమ్మకముంది. అందుకే అలా ఉన్నాను' అని చెప్పారు.

మహాత్ముల వారి సమాధానం తరువాత జడ్జిగారు రాత్రి తనకు వచ్చిన కల గురించి చెప్పి తనకు వచ్చిన సంకేతమేమిటో అడిగారు. మహాత్ములవారు ఇలా అన్నారు – 'జడ్జీగారు! మనమిరువురము గతజన్మలో ఒకే గురువు యొక్క శిష్యులము. మన గురువు మీ ద్వారా నన్ను ఈ కర్మబంధం నుండి తప్పిస్తానని చెప్పారు. ఆయన న్యాయస్థానం ప్రాంతంలోనే సూక్ష్మశరీరంతో కనిపించారు. ఆయన సమక్షంలో ఉండగా ఇంక నాకు ఆందోళన ఎలా ఉంటుంది? ఆయన ఉన్నారు. మీరున్నారు. మీ ద్వారా ఆయన నన్ను విముక్తుడిని చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిసి కూడా నాకు వ్యర్థ ప్రయాస ఎందుకు? అందుకే నేను శాంతంగా ఆ దృశ్యాన్ని గమనిస్తూ ఉండిపోయాను.'

ఈ సత్యం వెనుక ఉన్న రహస్యాన్ని విన్న జడ్జిగారు ఆశ్చర్య పోయారు. మహాత్ముల వారిని చూస్తే తనవారనే అనుభూతి ఎందుకు కలిగిందో ఆయనకు ఇప్పుడు అర్థమైంది. ఆయన భావావేశాన్ని ఆపుకోలేకపోయారు. తన గురుసోదరుడిని కౌగిలించుకొని కన్నీరు కార్చారు. కొంత సమయం తరువాత జిజ్ఞాసతో మహాత్ముల వారిని ఇలా అడిగారు, 'మిత్రమా! మరి మన గురువుగారు మీకు కనిపించారు కదా,! నాకెందుకు కనిపించలేదు?'

మహాత్ములు ఇలా అన్నారు, 'మిత్రమా! నీ దృష్టి, భావము ఆయనను చూసేంత సూక్ష్మంగా లేవు'. అప్పుడు జడ్జీగారు 'మరి నా జీవితంలో అంతటి పరమ సౌభాగ్యం ఎప్పుడు సిద్ధిస్తుంది?' అని అడుగగా, మహాత్ములు 'నీ కర్తవ్యపాలన చేస్తూ ఉండు, సమయం కోసం నిరీక్షించు, గురుకృప వల్ల త్వరలోనే నీవు కూడా సూక్ష్మదృష్టిని పొందుతావు. ఈ జన్మలోనే ముక్తిని కూడా పొందుతావు' అని చెప్పారు. తమ జీవితపు కర్మగతిని, దాని రహస్యాన్ని అర్థం చేసుకున్న ఆ గురు సోదరులు ఇరువురూ 'గహనాకర్మణోగతిః' బోధను అందుకొని తమ కర్మపథంలో ముందుకుసాగారు.

*– అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**

**యుగశక్తి**  **గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి!!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**అపర కుబేరులు సైతం కష్టాలతో సావాసం చేయాల్సిందే**

# తపస్సు-పుణ్యము శాశ్వత సంపదలు

తపస్సు-పుణ్యము...ఇవి రెండూ సంపదలే! సంపాదించుకొనగలిగినదానిని 'సంపద' అంటారు. తపస్సు, పుణ్యము అనేవి మానవుడి అంతరంగమునకు చెందిన నిధులు. కానీ మనిషి జీవితములో ఈ రెండింటి పాత్ర వేరువేరుగా ఉంటుంది. తపస్సు ద్వారా బలం లభిస్తుంది, అది 'శక్తి'గా రూపాంతరము చెందుతుంది. పుణ్యం వలన జీవాత్మ ప్రకాశవంతమౌతుంది. తద్వారా మానవునికి అనుకూల పరిస్థితుల నిర్మాణము జరుగుతుంది. పుణ్యం శక్తిరూపంలోకి రూపాంతరము చెందదు, పరిస్థితుల రూపంలోకి మార్పుచెందుతుంది. ఈప్రకారముగా 'తపస్సు-పుణ్యము' ఈ రెండింటికీ వేర్వేరుగా ప్రాముఖ్యత ఉంటుంది. ఈ ప్రపంచములో ఏ పని చెయ్యాలన్నా శక్తి అవసరము. శక్తిహీనుడు ఏ పనినీ చెయ్యలేడు, 'శక్తిమంతుడు' దేనినైనా చెయ్యగల సామర్థ్యము కలిగి ఉంటాడు.

తపస్సు-పుణ్యం అనేవి ఈ పాంచభౌతికమైన శరీరము ఉన్నా, లేకపోయినా జీవాత్మతో పాటు ఎల్లప్పుడు ఉండే సంపదలు! ఈ ప్రపంచములో సంపాదించుకున్న ధనం మానవుడు తన స్థూలశరీరమును వదలివేసిన తరువాత ఈ ప్రపంచములోనే ఉండిపోతుందితప్ప అతనితో వెళ్ళలేదు. జీవాత్మ సూక్ష్మరూపములో ఉంటుంది కాబట్టి దానితోపాటు సూక్ష్మపదార్థములు లేదా తత్త్వములు మాత్రమే వెళ్ళగలవు. ధనం స్థూలరూపములో ఉంటుంది కాబట్టి దానికి సూక్ష్మ శరీరముతో పయనించగలిగే శక్తి ఉండదు. తపస్సు-పుణ్యం ఈ రెండింటి స్వరూపము సూక్ష్మరూపములో ఉంటుంది. మానవుడి హృదయములో ఉండే సంస్కారములు కూడా సూక్ష్మ రూపములోనే ఉంటాయి. అందుచేత జీవాత్మ తన యొక్క కర్మలను, సంస్కారములను, సంపాదించుకున్న తపస్సు-పుణ్యము మొదలైనవాటిని తనతోపాటు తీసుకుని వెళుతుంది. వానిలో అన్నింటికన్నా ముఖ్యమైన సంపద 'తపస్సు-పుణ్యము!' అనేవి.

'తపస్సు-పుణ్యము'ల సహాయముతో జీవాత్మ ఈ సృష్టిలో దేనినైనా నిర్వహించగలదు. అయితే సంకల్పించిన పనికి తగినంత 'తపస్సు' రాశీభూతమై అతని వద్ద ఉండాలి. అప్పుడే ఆ పనిని అతడు నిర్వహించగలడు. పుణ్యసంపద వలన జీవాత్మ తేజోవంతమౌతుంది. తత్ఫలితముగా ప్రపంచములో ఆ వ్యక్తికి కీర్తి-ప్రతిష్ఠలు, గౌరవము, విజయము మొదలైనవన్నీ హస్తగత మౌతాయి. అతనికి అనుకూలపరిస్థితులు వాటంతట అవే నిర్మితమౌతాయి. అదే 'తపస్సు' పుణ్యప్రకాశము జీవునకు ఈ ప్రపంచములో కీర్తిని ప్రసాదిస్తుంది. ఇతరుల ముందు అతడు సన్మానపాత్రుడౌతాడు. అదే 'తపస్సు' అనే సంపద ద్వారా ఏకత్రితము చేసుకున్న శక్తి సహాయముతో మానవుడు ఈ సృష్టిలో ఏ పనినైనా చెయ్యగలిగే సామర్థ్యమును పొందుతాడు. తపస్సు ద్వారా కీర్తి లభించదు, అది పుణ్యముతో మాత్రమే లభిస్తుంది. ఈ ప్రకారముగా తపస్సు అనేది సహన శీలతకు మారుపేరైతే 'పుణ్యము' కీర్తి ద్వారా వెదజల్లబడే సుగంధపరిమళమునకు ప్రతీక.

'తపస్సు' అనేక రూపాలుగా ఉంటుంది. పరమ పూజ్య గురుదేవులు గాయత్రీమహావిజ్ఞాన్‌లో 1) అస్వాద తపస్సు 2)తితీక్షాతపము 3) కర్షణతపము 4) ఉపవాసతపము 5) గవ్యకల్పతపస్సు 6) ప్రదాతవ్యతపము 7) నిష్కాసనతపము 8) సాధనా తపము 9) బ్రహ్మచర్యతపము 10) చాంద్రాయణ వ్రతము 11) మౌనతపస్సు 12) అర్జనతపము అనే పన్నెండు విధములైన తపస్సులను గురించి వివరించారు. పైన చెప్పబడిన తపస్సు లన్నింటిలోను 'శరీరము-మనస్సు' ఈ రెంటికీ కష్టమును సహించవలసి ఉంటుంది. నీటిని మరిగించటానికి పొయ్యిమీద వేడిచెయ్యవలసిన విధముగానే; తపస్సు చేసేటప్పుడు మనిషి తపించాలి, కరగాలి, మూసపోయబడాలి. తపస్సు అంటేనే 'కష్టమును సహించుట!'

విభిన్న ప్రకారములకు చెందిన తపస్సులను 1) పరిశోధన తపస్సు 2) అర్జనతపస్సు 3) పరమ తపస్సు అనే మూడు స్వరూపములుగా విభజించవచ్చు. మానవుడు తన మనస్సును పరిశోధించి, సంస్కరించుకొనడమును పరిశోధనతపస్సు అంటారు. తపస్సు ద్వారా లభించిన శక్తిని తనలో ధారణచేసి సంచితము చెయ్యటాన్ని (కూడగట్టడాన్ని) అర్జనతపస్సు అంటారు. అన్నింటికన్నా విశిష్టమైనది 'పరమతపస్సు!' ఉచ్చస్తరీయమైనది, విశిష్టమైన లక్ష్యము కోసమై చెయ్యబడేది కాబట్టి పరమతపస్సు ఎంతో లోతైనది, రహస్యమైనదిగా

**కష్టమే జగద్గురువు**

చెప్పబడినది. వ్యక్తిగతమైన లాభము కోసము కాక, సమిష్టి గతమైన ప్రయోజనాల కోసము మాత్రమే దీనిని ఉపయోగించాలి. తపస్సులన్నింటిలోకి ఇది సర్వాధికముగా ఉన్నతమైన రూపము.

పరమతపస్సు అనే ఆధ్యాత్మిక తపస్సు ద్వారా జీవాత్మ అంతరిక్షములోని శక్తిప్రవాహమును తనవైపు లాగుకొనగలదు, శక్తియొక్క విభిన్న స్వరూపములను తనలో ధారణ చేయగలదు, తన ఇచ్ఛానుసారము ఆ శక్తులను సదుపయోగము చెయ్య గలదు కూడా! అంతరిక్షములోని శక్తిప్రవాహములు నదీ ప్రవాహముల వలె ఉంటాయి. ఈ ప్రవాహములు అత్యంత వేగపూర్ణమైన శక్తితో నిండి ఉంటాయి. వాటిని ధారణ చెయ్యట మనేది అంత తేలికైన పనికాదు. ఇందుకొరకై శారీరకముగా, మానసికముగా, ఆధ్యాత్మికముగా శక్తివంతులై ఉండటము చాలా అవసరము.

సాధారణముగా తపస్సులో చిత్తవృత్తులను, కర్మసంస్కారములను పరిశోధించుకొనటమే ఏకమాత్ర లక్ష్యముగా ఉంటుంది. జీవాత్మపైన ఆవరించి ఉన్న కుసంస్కారముల పొర తొలగిపోయేకొద్దీ, దానిలోపల శక్తిని ధారణ చెయ్యటానికి, కూడగట్టుకొనటానికి కావల్సిన సామర్థ్యము ఉత్పన్నమవుతుం టుంది. జీవాత్మ లోపల ఆవరించి ఉన్న అన్ని రకములైన సంస్కారములు పరిశోధింపబడి, సంస్కరించబడిన పిదప హృదయము స్ఫటికము వలె నిర్మలము, స్వచ్ఛము అవుతుంది. అప్పుడే జీవాత్మ పరమతపస్సు చెయ్యటానికి అర్హతను పొందుతుంది.

శ్రీ అరవిందులు, శ్రీ రమణమహర్షి ఈ ఇరువురి ద్వారా చెయ్యబడిన తపస్సు పరమతపస్సు ఒక సాటిలేని ఉదాహరణ. తమ యొక్క తపస్సు ద్వారా వారు సూక్ష్మలోకములలో అలజడిని ఉత్పన్నముచేసి, ప్రజల హృదయములను జాగృతము చెయ్యగలిగారు. అంతేకాదు, దేశము స్వాతంత్ర్యము పొందటానికిగాను అనుకూలమైన పరిస్థితులను నిర్మించారు. మానవుడి కార్యరంగము ఒక నిర్ధారితమైన ప్రదేశమునకే పరిమితము కాదు. సంపూర్ణమైన బ్రహ్మాండమంతట అతడు తన యోగ్యతను అనుసరించి కార్యములను నిర్వహించగలడు. సరిగ్గా ఇదేవిధముగా శ్రీ అరవిందులు తాము పాండిచ్చేరి ఆశ్రమములో ఉంటూనే రెండవ ప్రపంచయుద్ధమును సమాప్త మొందించటానికిగాను ఆసురీశక్తులను పరాజితులను గావించారు. ఈ ప్రభావము వలన స్థూలజగత్తులో యుద్ధములో అగ్రస్థానములో ఉన్న దేశము వెనుకంజవేసి తమ దేశమునకు మరలిపోయేవిధముగా' పరిస్థితులు మార్పుచెందాయి.

పరమపూజ్య గురుదేవులు కూడా తమ యొక్క పరమ తపస్సు ద్వారా సంపాదించిన శక్తి సహాయముతో మానవజాతి యావత్తూ ఆపదలో పడవేసే అనేక సంఘటనలను జరగకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆచార్యులవారు తమ యొక్క పరమతపస్సు ద్వారా కూడబెట్టుకున్న శక్తితో యుగనిర్మాణ బాధ్యతను కూడా చేపట్టారు. వారు తమ సూక్ష్మ శరీరముతో తపస్సు చేసి యుగనిర్మాణయోజనకు కావలసిన శక్తిని సంపాదించుకున్నారు. దాని ఫలితములు ఒక నిశ్చిత రూపములో స్థూలజగత్తులో నెమ్మదినెమ్మదిగా కనిపించసాగాయి.

తపస్సు చెయ్యడమనేది కష్టమైన సాధనే. ప్రారంభములో కష్టముగానే అనిపిస్తుందిగానీ దాని యొక్క మంచి ఫలితములు లభించినప్పుడు సాధకునికి ఈ తపస్సును జీవితాంతం తన జీవితములో అభిన్న అంగముగా చేసుకొనవలెనని అనిపిస్తుంది. తపస్సును తన జీవితములో ఒక అంగముగా చేసుకొనలేక పోయినప్పుడు అతడు జీవితములో ప్రత్యేకమైన ఏ పనిని సాధించలేడు. కాబట్టి తపస్సుకు తనదైన విశిష్టస్థానమున్నది. అందుచేత మానవుడు నిరంతరము ఏదో ఒకరూపములో తపస్సు చేస్తూనే ఉండాలి. మౌనము, ఏకాంతము, ఏకాగ్రత... ఇవి తపస్సుకు మారురూపములు, వీటిద్వారా తపశ్శక్తిని సంపాదించుకొనగలము. తపస్సు కోసమై చేసిన సాధనలను గురించి చర్చించరాదు. వాటిద్వారా తపఃసంపద ఏకత్రితము కాదు, పేరు ప్రఖ్యాతల రూపములో అది ఖర్చయిపోతుంది.

సాధన చేసే వ్యక్తులను గొప్ప తపస్వులుగా భావించి ప్రజలు గౌరవిస్తుంటారు. సాధన చెయ్యటము వలన వారికి లభించే గౌరవము, వారు తపస్సు ద్వారా ఆర్జించుకున్న సంపద ఫలితమే! దానినే వారు కీర్తి-ప్రతిష్ఠలరూపములో పొందుతారు. అందుచేత సాధనాకాలములో మౌనంగా ఉంటూ కేవలము సాధనమాత్రమే చెయ్యటము మంచిది. ఏకాంతము దీనికి చాలా అవసరము. లేకుంటే మనస్సును ఏకాగ్రమొనర్చడం సాధ్యముకాని పని. ఏకాగ్రత లేనప్పుడు చేసిన సాధన మంచి ఫలితాలను ఇవ్వలేదు. మనస్సును ఎంతగా ఏకాగ్రం చెయ్యగలిగితే అతడు అంతగా సాధన లోతుల లోపలికి వెళ్ళి ముత్యములను, రత్నములను వెదకిపట్టుకొనగలడు.

**అందరితో మర్యాదగా ప్రవర్తించాలి**

ఈవిధముగా తపస్సు యొక్క మహిమ అనంతమైనది, అపారమైనది. దానిని మాటలలో వర్ణించలేము. అలాగే పుణ్యము కూడా ఎంతో మహిమ కలది. పుణ్యమును సంపాదిం చాలనుకుంటే ఆ వ్యక్తి సహృదయుడై ఉండాలి. ఇతరుల బాధలను అర్థము చేసుకొని వారికి సహాయపడేందుకు ముందుకు రాగలగాలి. హృదయములో ఇతరుల పట్ల ఆత్మీయతను నింపుకొని దుఃఖితుల బాధలను తొలగింప చేసి ఎల్లప్పుడు సత్కర్మలలో నిమగ్నమై ఉండే వ్యక్తి పుణ్యాత్ముడు అనబడతాడు. మతపరమైన అనుష్ఠానములు, కర్మకాండలు కూడా మానవుడి పుణ్యమును వృద్ధిచేస్తాయి. మానవుడి జీవాత్మను ప్రకాశ వంతము గావించి, దానిలోపల వ్యాపించి ఉన్న అంధకారమును తొలగింపజేయగలిగే పనులన్నీ కూడా 'పుణ్యము' క్రిందకే వస్తాయి.

కానీ తపస్సు-పుణ్యము... ఈ రెండింటినీ సంపాదించుకునే ప్రక్రియలో అన్నింటికన్నా ఎక్కువగా ఆటంకమును కలిగించేది మానవుడి 'అహంకారము.' అంతేకాదు సంపాదించుకున్న తపోరాశిని, పుణ్యరాశిని అత్యంత వేగముగా నశింపజేసేది కూడా అహంకారమే. సృష్టి అనే మహాసముద్రములో మానవ జీవితము క్షణకాలము పాటు మాత్రమే మనగలిగిన నీటిబుడగ వంటిది. అయితే తపస్సు-పుణ్యము అనే రెండు సంపదలు మానవ జీవితానికి కీర్తి-ప్రతిష్ఠల ద్వారా ఎల్లప్పటికీ అమరత్వ మును ప్రసాదించగలవు. అందుచేత అహంకారరహితులమై ఈ సంపదలను ఆర్జించుకొనుటే మనకు ఏకమాత్రమైన కర్తవ్యము కావాలి!

– అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

## అసలైన పుణ్యం

*కాశీ నగర రాజు పుణ్యాన్ని కొనుటలో ప్రసిద్ధుడు. అక్కడ ఒక త్రాసు ఉంచారు. పుణ్యం అమ్మేవారు తాము నిజాయితీగా సంపాదించిన పుణ్యం గురించి వ్రాసి త్రాసు యొక్క సిబ్బిలో ఉంచేవారు. దానిననుసరించి త్రాసు బంగారు నాణాలను స్వయంగా ఇచ్చే ఏర్పాటు ఉన్నది.*

*ప్రక్కనే ఉన్న జయనగరంపై శత్రువులు దాడిచేయడం, వలన ఆ రాజు సతీసమేతంగా అర్ధరాత్రి ఉత్తచేతులతో పారిపోవలసి వచ్చింది. మరుసటి రోజు వారు ఒక చెట్టు నీడలో కూర్చుని పొట్టకూటికి ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నారు. రాణి సలహా చెప్పింది. మీరు జీవితంలో చాలా దానం చేసి పుణ్యం సంపాయించుకున్నారు. దానిలో కొంత కాశీనగర రాజుకు అమ్మి ధనం తీసుకుందాం. రాజు అంగీకరించాడు. కాని ఆకలి కడుపుతో కాశీనగరం చేరేదెలా? రాణి ఒక ఉపాయం చెప్పింది. ఇక్కడ గ్రామస్థుల ఇళ్ళలో పిండి విసరి, నిత్యం తినే దానిలో కొంత మిగులుస్తాను అన్నది. రాజుగారు రొట్టెలు చేసేవాడు.*

*ఒక రోజు ఆ రాజు రొట్టెలు కాలుస్తున్నాడు. ఇంతలో ఒక బిచ్చగాడు వచ్చాడు. ఆకలిగొన్న ఆ రూపాన్ని చూసి రాజు చలించిపోయాడు. కాని ఇది కూడా ఇస్తే ఇంకా తినేదేమిటి? అప్పుడు రాణి అన్నది "మనం ఇంకొక రోజు ఆకలితో ఉండాలి" రాణి సలహాపై రొట్టెలన్ని బిచ్చగాడికి ఇచ్చేశాడు. నెమ్మది నెమ్మదిగా పది రోజుల తరువాత కాశీనగరం చేరుకున్నారు.*

*జయనగర రాజు తన పూర్వ పుణ్యాన్ని తలచుకుని వివరణ వ్రాసి త్రాసు సిబ్బిలో ఉంచారు. కాని ఏమి లభించలేదు. అక్కడ ఉన్న పురోహితుడు మీరు శ్రమ చేసి సంపాదించిన దానిని దానం చేసి ఉంటే దాని వివరణ వ్రాసి ఉంచండి అన్నాడు. రాజుకు బిచ్చగాడికి రొట్టెలు ఇచ్చిన సంగతి గుర్తుకు వచ్చి దానిని వ్రాసి తక్కెడలో ఉంచాడు. దానికి బదులుగా బంగారు నాణేలు లభించాయి. పురోహితుడు అన్నాడు "నిజాయితీతో శ్రమ పూర్వకంగా సంపాదించిన దానిని దానం ఇచ్చినపుడే పుణ్యఫలం లభిస్తుంది".*

*రాజు, రాణి ఆ రోజు ఇచ్చిన సలహాకు, పరోపకార ప్రవృత్తికి ధ్యన్యవాదాలు అర్పించాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి, అనువాదం: శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**ఎవరితోను శత్రుత్వం వద్దు**

# ఆరోగ్యానికి తారక మంత్రం ప్రాకృతిక జీవనం

## ప్రకృతి వైపు మరలండి

మనిషి తప్ప మిగతా ప్రాణులన్నీ ఆరోగ్యంతో, రోగాలు లేకుండా జీవిస్తున్నాయి. సృష్టిలోని సమస్త జీవజంతువుల శరీర స్థితిని పరిశీలిస్తే ఈ వాస్తవం వెలికివస్తుంది. ఆకాశంలో విహరించే పక్షులు, గడ్డిలో దాగి ఉండే క్రిమికీటకాలు, అడవులలో తిరిగే శాకాహారులు మాంసాహారులు అయిన పశువులు ఇలా అన్ని రకాల ప్రాణులు ఆరోగ్యంతో బ్రతుకుతున్నాయి. వాటికి వైద్యులు అవసరం లేదు. మందు బిళ్ళల, లేహ్యాల అవసరం లేదు. లోషన్‌ల, సూదిమందుల, శస్త్రచికిత్సల అవసరం లేదు. ఈ ప్రాణులు అల్పబుద్ధి కలిగినవి. ఆయుర్వేదం గురించి, డాక్టర్ల గురించి వాటికి తెలియదు. అవి మనిషికన్నా ఆరోగ్యంగా ఉంటాయి. సృష్టిలోని ప్రాణులన్నీ పరమేశ్వరుని ఆనందమయ సామ్రాజ్యంలో హాయిగా జీవిస్తున్నాయి. పుట్టినది మొదలు చనిపోయేవరకు తమ శరీరం తమను ఇబ్బంది పెడుతోందనే అనుభవం వీటికి ఎన్నడూ కలగదు. ఇతర కష్టాల నివారణ కోసం శరీరమనే ఆయుధం లభించింది. ఆ ఆయుధమే కష్టం కలిగిస్తే, దానివల్ల జీవనయాత్రలో ఆనందం ఎలా కలుగుతుంది?

పరమేశ్వరుని ఆనందమయ సామ్రాజ్యంలో అన్ని ప్రాణులు రోగగ్రస్తులు కానప్పుడు – మానవజాతి రోగాలకు నిలయంగా ఎలా తయారయింది? ఇది చాలా ప్రముఖమైన ప్రశ్న. దీనిని గురించి తీవ్రంగా ఆలోచించాలి. మనుషులలో నూటికి 99 మంది ఏదో ఒక తీవ్రరోగంతో, అజీర్ణరోగంతో సతమతం అవుతున్నారు. ఆసుపత్రులలో ఉన్న ఆ రోగాల నివేదికలు చదవండి. చిత్రవిచిత్రమైన రోగాలతో బాధపడుతున్న రోగులు లెక్కలేనంతమంది గురించిన వివరాలు మీకు తెలుస్తాయి. ఆసుపత్రులలో, మందుల దుకాణాలలో జనం వరుసలు కట్టి నిలవడం మీరు చూస్తారు. ఔషధాలు తయారుచేసే సంస్థలు, అమ్మే సంస్థలు మేడలమీద మేడలు కడుతున్నాయి. అంతే కాదు. సిగ్గువల్ల, సంకోచంవల్ల, పేదరికంవల్ల, అజ్ఞానంవల్ల, సాధనాల కొరతవల్ల తమ రోగాలు దాచుకునే వ్యక్తులు మరెందరో కనిపిస్తారు. అజాగ్రత్తవల్ల, ఉపేక్షవల్ల, అసౌకర్యంవల్ల పలువురు తమ రోగాలను లోలోపలే అణచిపెట్టుకుని ఉంటున్నారు. వందమందిలో 35 మంది రోగాలు బయటికి కనిపిస్తాయి. 65 మంది పైకి రోగం లేనివారుగా కనిపిస్తారు. కానీ రోగాలు లోపల లోపల వారిని పీడిస్తూ ఉంటాయి. అజీర్ణం, ఆకలి లేకపోవడం, మలబద్ధకం, స్వప్న దోషం, మంట, అవయవాలలో లోపాలు మున్నగు రోగాలతో హెచ్చుమంది బాధపడుతున్నారు.

## ప్రకృతికి దూరమైతే జంతువులకు కూడా రోగాలు

ఇలా రోగాలు మనుషులను చుట్టుముట్టాయి. మనుషులే రోగాలను ఆహ్వానించారని చెప్పడం మరింత సముచితంగా ఉంటుంది. మనిషి సంపర్కంలోకి వచ్చిన జంతువులకు సైతం రోగాలు పట్టుకుంటున్నాయి. మనిషి కొన్ని జంతువులను పెంచాడు. పెంపుడు జంతువులుగా చేసుకున్నాడు. తనకు నచ్చిన విధంగా జీవించేటట్లు, పనిచేసేటట్లు వాటిని అదుపు చేశాడు. అలాంటి పెంపుడు జంతువులకు రోగాలు వచ్చాయి. ఆ రోగాలతో కొద్ది సమయంలో అనేక పశువులు చనిపోతున్నాయి. ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలవంటి పశువులలో ఒక్కోసారి మహమ్మారులు వ్యాపిస్తాయి. కుక్కలు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులు, చిలుకల వంటి వాటికి కూడా రోగాలు వస్తున్నాయి. వీటికోసం పశువైద్యశాలలు స్థాపించే అవసరం ఏర్పడుతోంది. ఇదంతా మనిషితో సంపర్కం ఏర్పడటం వల్ల కలిగిన ఫలితం. మనిషి తన రోగాలను ఈ పెంపుడు జంతువులకు బహూకరించాడు. మనుషులకు దూరంగా ఉంటూ, తమ ఆహార విహారాలలో, అలవాట్లలో స్వతంత్రంగా ఉన్న జంతువులకు ఈ బహుమతులు అందడం లేదు. అవి రోగాల బారిన పడటం లేదు.

చాలా ఆశ్చర్యకరమైన విషయం ఇది. బుద్ధి, సాధనలు లేని పశువులు రోగాలు లేకుండా బ్రతుకుతున్నాయి. రోగాలతో యాతనలు అనుభవిస్తున్నది ఒక్క మనిషే. మనిషి తన

ప్రతినెల బడ్జెట్ వేసుకుని దానిని దాటకుండా చూసుకోవాలి

సంపర్కంలోకి తెచ్చుకున్న జంతువులకు కూడా రోగాలను తెచ్చిపెట్టాడు.

## మిథ్యా, నాగరికత, రోగము

మనిషి బుద్ధి చాలా తీవ్రమైనది. అతడు బుద్ధిబలంతో ఆశ్చర్యకరమైన ఆవిష్కరణలు ఎన్నింటినో వెలికి తెచ్చాడు. పెద్ద పెద్ద యంత్రాలను నిర్మించాడు. జ్ఞాన విజ్ఞానాలలో ఎన్నెన్నో పరిశోధనలు జరిపాడు. మనిషి బుద్ధి చేసిన అద్భుతాలు ఎటుచూసినా కనిపిస్తాయి. మరి జీవితంలోని ఒక మౌలిక సమస్య అయిన ఆరోగ్యం విషయంలో మనిషి బుద్ధి ఏ గంగలో కలిసింది? భోగ విలాసాలకు, వినోద విహారాలకు అవసర మయ్యే అద్భుతమైన, అపూర్వమైన వస్తువులను ఒకదానిని మించి మరొకదానిని మనిషి తయారుచేశాడు. రోగ రాహిత్యానికి, దీర్ఘజీవనానికి సంబంధించి చెప్పుకోదగిన ఫలితాలను అతడు సాధించలేదు. ఈ రంగంలో అతడు చేసిన ప్రయత్నాలు ప్రయోజనం కలిగించడానికి బదులు హానికరములుగా పరిణమించాయి.

మరి–దీనికి మూలకారణం ఏమిటి? ప్రాణుల జీవితం ప్రకృతి నియమాలతో విడదీయరాని విధంగా జోడింపబడి ఉన్నది. జీవితాన్ని నిర్మించిన సత్తా అది సవ్యంగా సాగడం కోసం ఒక నియమావళిని కూడా రూపొందించింది. ఈ నియమ నిబంధనలు ఏ ప్రాణి ఏమేరకు పాటిస్తే అది ఆ మేరకు రోగ రహితంగా జీవిస్తుంది. ఏమేరకు వాటిని ఉల్లంఘిస్తే ఆ మేరకు రోగాల వలలో చిక్కుకుంటుంది. మనిషి ఎత్తులు జిత్తులు, అతడు వేసే నాటకాలు, చేసే బూటకాలు ప్రకృతి మాత ముందు పనిచేయవు. ప్రకృతిమాత ఎంత దయాళువో అంత కఠినురాలు. ఆమె నియమాలను పాటించే వారు ఆనందమయ జీవితాన్ని బహుమతిగా పొందుతారు. వాటిని ఉల్లంఘించేవారు దండనను అనుభవిస్తారు. ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘించే వ్యక్తి ఏవో ఉపాయాలతో ఒక్కోసారి శిక్షనుంచి తప్పించుకోవచ్చు. కానీ, ప్రకృతిని వంచించడం మరింత కష్టమైన పని.

## ప్రాకృతిక జీవితం సహజసిద్ధం

ప్రకృతి నియమాలు స్పష్టమైనవి. బహిరంగమైనవి. అందరికీ తెలిసినవి. సహజమైనవి. కనుక వాటిని తెలుసు కోడానికి గ్రంథాలు చదవనవసరం లేదు. పరిశోధనాలయా లకు వెళ్ళనవసరం లేదు. పది ఇంద్రియాలు, పదకొండవది బుద్ధి ఆ నియమాలకు గీటురాళ్ళు. శరీరాన్ని సవ్యంగా ఉంచడానికి ఏవి సరైనవో, ఏవి కావో అవి ఒక్కక్షణంలో చెప్పివేస్తాయి. అసలు సరుకును, నకిలీ సరుకును వేరుచేసే పనికి వాటికి సమయం పట్టదు. ఏది ఉపయోగకరమో, ఏది పనికిరానిదో అవి వెంటనే తేల్చి చెప్తాయి. ఇంద్రియాల చైతన్య జ్ఞానసూత్రాలను సహజంగా, స్వేచ్ఛగా, మోసగించ కుండా పనిచేయనిస్తే–అక్షయమైన ఆరోగ్యం పొందడానికి అవి మనకు చక్కగా దారిచూపుతాయి.

తమ ఇంద్రియాలకు ప్రకృతి ప్రసాదించిన జ్ఞానంపై సృష్టిలోని ఇతర ప్రాణులు పూర్తిగా ఆధారపడతాయి. ఆరోగ్య భాగ్యాన్ని పొందుతాయి. తమ ఇంద్రియాలు తమకు తగిన ఆహారాన్నే తీసుకుంటాయి. ఇతర వస్తువులను అసలు తాకనే తాకవు. మేక జిల్లేడు ఆకులను తింటుంది. ఆ ఆకులను ఆవుకు పెడితే, అది ఆకలితో చనిపోవలసి వచ్చినా వాటిని తినదు. గొర్రెలు మాంసం తింటాయి. గేదెకు మాంసం పెడితే, అది దానిని ముట్టనే ముట్టదు. చిలుక మిరపకాయ తింటుంది. పావురం దానిని ఎట్టిపరిస్థితిలోను తినదు.

ప్రకృతి నోటి గుమ్మంవద్ద నాలుక అనే కాపలాదారును కూర్చొనబెట్టింది. దేనిని లోపలకు వెళ్ళనివ్వాలో, దేనిని వెళ్ళనివ్వకూడదో అది పరీక్షిస్తూ ఉంటుంది. తన గీటురాయి ఎన్నడూ పొరపడని వైద్యుడు, శాస్త్రవేత్త–నాలుక. కానీ, ఈ కాపలాదారును మోసగించడానికి, భ్రమలో ఉంచడానికి, నిద్రలో ఉంచడానికి, స్పృహతప్పి అసమర్థంగా ఉండేటట్లు చేయడానికి మనిషి తన ఎత్తులను, జిత్తులను ప్రయోగిస్తున్నాడు. నిరంతరం అత్యాచారాలను సహిస్తూ వస్తున్న ఇంద్రియాలు కూడా ఆ మూసలో ఇమిడిపోవడం మొదలు పెడతాయి. హాని కలిగించే ఆహారాన్ని వ్యతిరేకించవలసినంతగా వ్యతిరేకించవు. పసిపిల్లవాడికి రుచి పూర్తిగా తెలియదు. అతడి ముందు ఆహార పదార్థాలను ఉంచండి. వాటిలోని తగిన పదార్థాలనే తీసుకుంటాడు. పాలు, పండ్లు, ఎండుపండ్లు (dry fruits) వంటివాటిని అతడు తృప్తిగా తింటాడు. మిరప కాయలు, మసాలా, మాంసం, నూనెవంటివాటిని తీసుకోడు. ప్రతిరోజు అత్యాచారాలు జరిపి చెడు అలవాటు చేసినప్పటికీ నాలుక మిరపకాయ తినేటప్పుడు మండుతుంది.

**తీసుకోవడం కాదు, ఇవ్వడం అలవరచుకోవాలి**

మనిషి అనేక వస్తువులను వాటి అసలు స్థితిలో తినలేడు. కానీ, మనిషి వాటిని రకరకాలుగా మార్చుతున్నాడు. వాటిలో మిర్చిమసాల, పంచదార కలుపుతున్నాడు. నాలుక వాటి అసలు రూపం గుర్తుపట్టకుండా చేస్తున్నాడు. మాంసాన్ని అలాగే నోటిలో పెడితే, దానిని ఎవ్వరూ తినరు. దానిని రకరకాలుగా ఉడికించి, వేయించి, ఎండబెట్టి, నేయి మసాలాలు దానితో కలిపి, ఇంకా రకరకాలుగా మసిపూసి మారేడుకాయ చేసి, దానిని పూర్తిగా మార్చివేస్తారు. అప్పుడు అది ఎలాగో గొంతు దిగుతుంది. పొగాకు, నల్లమందు, మద్యం, మాంసం, గంజాయి వంటి మత్తు పదార్థాలను తినేటప్పుడు నాలుకకు అవి రుచించవు. కానీ, మనిషి అలవాటు చేసుకుని వాటిని బలవంతాన కడుపులోకి పంపుతున్నాడు. ఇదంతా నాలుకపై జరుగుతూన్న అత్యాచారం. ప్రకృతి నియమించిన కాపలా దారుపై అత్యాచారం చేసేవాడు శిక్షనుండి తప్పించుకోలేడు. రోగం రూపంలో అతడికి ఆ శిక్ష పడుతుంది.

చెడువాసన వస్తున్న స్థలం చేరగానే మన ముక్కు అది హానికరమని, అక్కడ నుండి పారిపొమ్మని మనకు ఆదేశం ఇస్తుంది. ఉద్యానవనంలోని సుగంధం, స్వచ్ఛమైన గాలి ముక్కుకు సంతోషం కలిగిస్తాయి. ఆ గాలి ఉపయోగకరమైనదని ఆవిధంగా అది మనకు చెపుతోంది. అందవికారంగా, మురికిగా, వికృతంగా, అసహ్యంగా, భీభత్సంగా ఉన్న వస్తువులను కన్ను ద్వేషిస్తుంది. అందంగా, చైతన్యవంతంగా, సరసంగా, పద్ధతిగా, తేజోవంతంగా, ముచ్చటగా ఉన్న వస్తువుల పట్ల అనురాగం ప్రకటిస్తుంది. దానికి ఉన్న ఈ విచక్షణాజ్ఞానం మనకు లాభనష్టాలను స్పష్టంగా సూచిస్తుంది. హానికరం, భయంకరం, కర్కశం, కటువు అయిన శబ్దాలను విని చెవి అయిష్టాన్ని ప్రకటిస్తుంది. పరీక్ష చేసే ఈ శక్తి ప్రతి ఇంద్రియానికి ఉంది. అయితే, ప్రతిరోజు అభ్యాసం చేయించడం వల్ల ఇంద్రియాలు ఆ చెడుకు అలవాటు పడిపోతాయి. ఇలా ప్రతి ఇంద్రియాన్నీ దుర్వినియోగపరుస్తున్నాం. తినకూడనివి తింటున్నాం. దుర్వాసన కలిగిన గాలి పీల్చుతున్నాం. మురికి వస్తువులను, వికారమైన వస్తువులను చూస్తున్నాం. కటువైన, కర్కశమైన, అశాంతి కలిగించేవి అయిన శబ్దాలను, ధ్వనులను వింటున్నాం. హద్దుమీరి, అతిగా లైంగికక్రియలు జరుపుతున్నాం. ఇలా ఇంద్రియాలకు ఉన్న హద్దులను మీరుతున్నాం. ఇలాంటి జీవితం రోగరహితంగా ఎలా ఉంటుంది?

## ప్రకృతికి దూరమైన అలవాట్లు

పగటినిద్ర, రాత్రిపూట మేలుకోవడం, తీక్షణమైన విద్యుద్దీపాల కాంతిలో చదవడం, దుమ్ము వేడి, మురికి నిండిన వాతావరణంలో నివసించడం ఇదంతా ప్రకృతి నియమాలను అతిక్రమించడమే. శరీరాన్ని వేడినుండి చలినుండి కాపాడే శక్తి చర్మానికి సహజంగా ఉంది. చిన్న చిన్న ప్రాణులు, అత్యంత బలహీనమైన ప్రాణులు సైతం ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా వేడిలో, చలిలో తిరుగుతూ ఉంటాయి. వాటికి జలుబు చేయదు. నిమోనియా రాదు. ఫ్యాషన్‌ల మోజులో పడి మనం దుస్తులపై దుస్తులు ధరిస్తున్నాం. బనియను, కమీజు, వెయిస్ట్‌కోటు, కోటు, ఓవర్‌కోటు ఒకదానిమీద ఒకటి తొడుక్కుంటున్నాం. ఒక్కొక్కదానికి రెండుమూడు మడతలు ఉంటున్నాయి. ఇలా శరీరాన్ని అతిగా కప్పివేయడం వల్ల చర్మంలోని చైతన్యం దెబ్బతింటుంది. చర్మం నుండి వెలువడే చెడుగాలి బట్టలలో నిలచిపోయి శరీరానికి అంటుకుని ఉండిపోతుంది. స్వచ్ఛమైన బయటి గాలి చర్మం వరకు వెళ్ళదు. మూసిన గదిలో మొక్క వెలుగులేక వాడిపోయి చచ్చిపోతుంది. బట్టల బరువువల్ల శరీరానికీ అదే గతి పడుతుంది. నోరు, ముక్కు, చెవులు, మెడ వంటివాటికి ఎప్పుడు గాలి తగులుతూ ఉంటుంది. చలి, వేడి పెద్దగా తేడా చేయవు. ఇలా శరీరమంతా ఆచ్ఛాదన లేకుండా ఉన్నప్పటికీ నష్టం లేదు. సాధువులు, సన్యాసులు, రైతులు, గిరిజనులు చాలావరకు ఆచ్ఛాదన లేకుండానే ఉంటారు. వారికి చలి, వేడి ఇబ్బంది పెట్టవు.

ఫ్యాషన్ల మోజు, కృత్రిమత్వం, లేనిపోని సింగారింపులు, ప్రకృతివిరుద్ధమైన ఆహార విహారాలు మనిషి ఆరోగ్యాన్ని, దీర్ఘ జీవనాన్ని దెబ్బతీశాయి. ఈ ధోరణి మారకపోతే, మనుషులు అల్పజీవులుగా తయారవుతారు. ప్రకృతి విరుద్ధమైన ఆచరణ ఆరోగ్యాన్ని నశింపచేస్తుంది. ప్రకృతి నియమాలను అతిక్రమించడంలో కాక, వాటిని అక్షరాలా పాటించడంలోనే మనిషి శ్రేయస్సు ఇమిడి ఉంది. డాక్టర్లు ఇచ్చే రంగురంగుల మందులు రోగరాహిత్యాన్ని అందించలేవు. ప్రకృతిమాతను ఎదిరించడం ద్వారా కాక, దాని ఆదేశాన్ని పాటించడం ద్వారా మాత్రమే మనం దాని నుండి జీవనదానాన్ని పొందగలుగుతాం.

**ఎదుటివారి మీద పెత్తనం చేయాలని చూడకు**

## ప్రకృతిని శరణుపొందుదాం

ప్రాకృతికమైన ఆహార విహారాలను పూర్తిగా పాటించడం సాధ్యమయ్యే పరిస్థితిలో మానవజాతి నేడు లేదనే మాట నిజమే. అయితే ఫ్యాషన్ల మోజులో తెచ్చిపెట్టుకుంటున్న కృత్రిమత్వాన్ని చాలా తగ్గించుకోవడం మాత్రం పూర్తిగా సాధ్యమే. సాత్వికత, సహజత్వం, అవసరం. వీటిని దృష్టిలో పెట్టుకుని జీవన పద్ధతిని మలచుకోవడం సాధ్యమే. అప్పుడు బాహ్య ఆడంబరాలన్నీ నిరర్థకాలుగా, లేనిపోని బరువుగా కనిపిస్తాయి. వాటిని క్షణాలమీద వదులుకోవాలని అనిపిస్తుంది.

కాయకల్పాన్ని కోరే వ్యక్తులారా! ఆరోగ్యాన్ని కోరే వ్యక్తులారా! ప్రకృతివిరుద్ధమైన ఈ ఆహార విహారాలకు స్వస్తి చెప్పండి. పూజనీయులైన మన పూర్వీకుల మార్గాన్ని అనుసరించండి. సాదా అయిన, సరళమైన, దోషరహితమైన జీవితాన్ని గడపండి. ప్రకృతిమాత చరణాలమీద పడి మీ తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోండి. ఆమె నుండి ఆరోగ్యం, జీవితం అనే క్షీరాన్ని అర్థించండి. దయాళువు అయిన మాత ఆ క్షీరాన్ని త్రాగిస్తుంది. ఔచిత్యం, అవసరం, జీవన రక్షణ అనే అంగాలు ఆధారంగా ఆహార విహారాలను తీర్చిదిద్దుకోండి.

## అంతా జీర్ణశక్తి మహిమ

రోగాల నుండి విముక్తి పొందడానికి మందులు, పౌష్టికాహార సలహాలు ఆశ్రయించనవసరం లేదు. జీర్ణశక్తి దెబ్బతింటే ఖరీదైన మందులు, బలవర్ధకాలని చెప్పబడే టానిక్‌లు పనిచేయవు. అవి కడుపులోకి వెళ్ళి మలద్వారం నుండి వెలికి వస్తాయి. అవి జీర్ణం కాకపోతే, రసంగా రక్తంగా మారకపోతే వాటివల్ల పోషణ ఎలా జరుగుతుంది? జీర్ణశక్తి మామూలు భోజనానికి సైతం బలం ఇస్తుంది. గొర్రె పొట్టేలును చూడండి. అది గడ్డి తింటుంది. అయినా లావెక్కుతుంది. పంది వెన్న, మీగడ, పాలు, మిఠాయి తినదు. పౌష్టికతత్వాలు బాగా తక్కువగా ఉన్నవాటిని తింటుంది, జీర్ణశక్తి ద్వారా తన శరీరాన్ని పుష్టిగా చేసుకుంటుంది. గేదెలు, ఎద్దులు, గుర్రాలు, ఏనుగులు వంటి జంతువులు మిఠాయిలు తినవు. ధాతుపుష్టి మాత్రలు వేసుకోవు. అయినా బలంగా ఉంటాయి.

**కనుక జీర్ణశక్తి చక్కగా ఉండడం ముఖ్యం. జీర్ణశక్తి లోపిస్తే, ఆకలి లేకపోతే, మలం పేరుకుపోతే అదే బలహీనతలన్నింటికీ మూలమని గుర్తించాలి.** జీర్ణశక్తిని పెంచడం ఎలా అని ఆలోచించాలి. రైతు జొన్నరొట్టెలు, ఉల్లికారం తిని దృఢంగా ఉంటాడు. పన్నెండు గంటలు శ్రమిస్తాడు. రాత్రిపూట సుఖంగా నిద్రపోతాడు. పట్టణంలోని ఆఫీసు ఉద్యోగి నెయ్యి, మిఠాయి, నిలవ పచ్చళ్ళు, చిత్రవిచిత్రమైన వేపుడు కూరలు తింటాడు. రోజుకో క్రొత్త టానిక్ త్రాగుతాడు. అయినా ఈసురోమంటూ ఉంటాడు. ఆఫీసులో ఆరుగంటలు పనిచేసి అలసిపోతాడు. అతడికి రాత్రి సరిగా నిద్రపట్టదు. ఇదంతా జీర్ణశక్తి జరిపే క్రీడ. నోరు, ఆమ్లాశయం, హృదయం, ప్రేగులు మున్నగు అవయవాల నుండి వెలువడే జీర్ణరసాలు భోజనంతో కలిసి శరీరానికి అవసరమైన పుష్టిని ఇస్తాయి. జీర్ణశక్తి సక్రమంగా ఉంటే, మనిషి మామూలు భోజనం నుండి కూడా బలవర్ధక తత్వాలను పొందగలుగుతాడు.

★★★

## హరిశ్చంద్రుడు

*"యుగపరివర్తన అనే మహాకార్యాన్ని విశ్వామిత్రుడు తన భుజస్కంధాలపైన వేసికొన్నాడు. దానికి కావలసిన సాధనాలను సమకూర్చే బాధ్యతను ఆయన శిష్యుడైన హరిశ్చంద్రుడు స్వీకరించాడు. అవసరాలను తీర్చటానికి తన కోశాగారాన్ని, సమస్త వైభవాన్ని వినియోగించారు. అయినా పని పూర్తికాకపోవటంతో ఈయన తనని తాను దాసునిగా అమ్ముకొని అవసరాలను తీర్చాడు. లోక కళ్యాణం కోసం వ్యక్తిగత, సుఖసౌఖ్యాలను త్యజించి వేయటం ద్వారా హరిశ్చంద్రునికి లభించిన ఆనందం ఇంతని వర్ణింపనలవిగానిది. ఈ హరిశ్చంద్ర నాటకమే బాలగాంధీని మహాత్మాగాంధీగా మార్చింది. ఈ ప్రేరణ వల్లనే, గాంధీ చరిత్ర ఎందరికో ఆదర్శప్రాయమైనది. మహాపురుషులు కీర్తికాంక్షకు విరుద్ధంగా కర్తవ్యనిష్ఠ రూపంలో బాధ్యతల్ని నిర్వహిస్తారు. ఈ పని చేస్తున్నాం. దీనికి ప్రతిఫలమెలా ఉంటుందన్న ఆలోచన ఏ మాత్రం ఉండదు. 'కర్మణ్యే వాధికారస్తే' అనే గీతావాక్యాన్ని వీరు అక్షరాలా అనుసరిస్తారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**పరిస్థితులకు వెరవకుండా విశ్వాసంతో ముందుకు సాగాలి**

# విజ్ఞానమును దారితప్పకుండా నిరోధించాలి

ఒకసారి ఐన్‌స్టీన్ ఒక భయంకరమైన రోగం బారినపడ్డాడు. బ్రతికి బట్టగడతాడన్న ఆశ మసకబారిపోయింది. కానీ ఆ తరువాత అదృష్టవశాత్తు ఆరోగ్యవంతుడయ్యాడు. అయితే అనారోగ్యమునకు గురైన రోజులలో తలెత్తిన ఒక నూతన చింతన, గడించిన అనుభవము చాలా గొప్పవని అతను భావించినాడు. 'ఆంతరికమైన అనుభూతల దృష్టితో చూసినప్పుడు ఆరోజులలో నేను గడించిన అనుభవము జీవితమంతా చేసిన ప్రయోగముల ఫలితముల కంటే ఎంతో అధిక మహత్వపూర్ణమైనది' అని అన్నాడు.

అనారోగ్యం నుండి కోలుకున్నాక అతను తత్త్వజ్ఞానుల భాషను ప్రయోగించసాగాడు. 'సమస్త చేతనత్వ జగత్తుతో నాకు నేను ఎంత తాదాత్మ్యము చెందిన అనుభూతిని పొందుతున్నానంటే నాకిప్పుడు జీవన్మరణముల మధ్య ఎట్టి వ్యత్యాసము గోచరించుటలేదు'.

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయమునకు చెందిన లారెన్స్ అను వైజ్ఞానిక ప్రయోగశాలకు చెందిన ఎంతోమంది మూర్ధన్యులైన భౌతికశాస్త్రవేత్తలు ఒకసారి ఒకచోట కలుసుకుని ఒక సదస్సును ఏర్పాటుచేశారు. ఆ సదస్సులో దార్శనికస్థాయికి చెందిన భౌతికశాస్త్రవేత్తల ఒకానొక పెద్ద మండలి హాజరైనది.

ఆ సదస్సుకు భౌతికవిజ్ఞానానికి చెందిన మూర్ధన్యులైన వారిలో నుండి అనేకమంది పాల్గొని తమ అభిప్రాయములను వెలిబుచ్చారు. ఉదా॥ ఎలిజా-వెథ్, రోజర్-మైకెల్-ఫ్రిట్‌జాఫ్. మొదలైనవారు భౌతికవిజ్ఞానము తన చరమలక్ష్యము దిశగా ముందుకు సాగిపోతున్నదా? మనము వర్తమానకాలపు రీతి-నీతులను, నైతికవిలువలను అనుసరించి జీవిస్తూ విజ్ఞానము చేరుకొనుటకు ఉచితమైన ఆ ఉన్నతమైన లక్ష్యమును చేరుకొనగలమా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. జవాబు 'కాదు' అని అంటే కనుక మరి దీనియొక్క ఏకపక్ష దిశాధార ఏమైవుంటుంది? అన్న విషయమును గురించి చర్చించారు.

సదస్సులో వ్యక్తీకరించబడిన అభిప్రాయముల సంక్షిప్త సారాంశము ఏమిటంటే -'మనము సదుద్దేశ్యముతోనే దీనిని ఆరంభించినాము.ఆ సదుద్దేశ్యమును చాలాకాలంపాటు అలాగే కొనసాగిస్తూవచ్చాము. అయితే ఇప్పుడు దారి తప్పుతున్నాము. **విజ్ఞానము యొక్క లక్ష్యము మానవ ప్రగతి ఒక్కటే కాదు. శాంతికూడా!** శాంతిని చేకూర్చని ప్రగతితో అనుకున్న లక్ష్యము నెరవేరదు. మనము ప్రకృతి యొక్క రహస్యోద్ఘాటన దిశలోనే, మానవీయ గరిమకు అనురూపముగా ఉపలబ్ధులను సక్రమంగా ఉపయోగించుకునే పద్ధతిని రూపొందించాలి.'

సదస్సులో వ్యక్తీకరించబడిన రెండవ అభిప్రాయము ఏమనగా 'ఇప్పుడిక ప్రకృతిపరమైన పదార్థశక్తియే సమస్తము అని భావించలేము. చేతనత్వము యొక్క స్వతంత్ర అస్థిత్వము కూడా ఉన్నదని నిరూపించబడుతున్నది. అందుచేత చింతనను ప్రభావితము గావించే తత్త్వదర్శనము కూడా వైజ్ఞానిక పరిశోధనలలో సమ్మిళితమై ఉండవలెను.

విజ్ఞానము దారితప్పకుండా నిరోధించేందుకుగాను ఎంతో మంది మూర్ధన్యులైన వైజ్ఞానికులు 'మనము గుడ్డిపరుగులు తీయరాదు. అంతేకాకుండా మనము పొందుతున్నదేదైనా సరే దానిని సరైన రీతిలో స్వీకరిస్తున్నామా? అది సరైనరీతిలో ఉపయోగపడుతున్నదా? లేదా? అన్న విషయములను సైతము గమనించుకోవాలి అని గళమెత్తి నినదించారు.

ఈ సందర్భములో ప్రొఫెసర్ కాప్రా వ్రాసిన 'ది తావో ఆఫ్ ఫిజిక్స్' అన్న పుస్తకము మరియు కైవ్ వ్రాసిన 'ది డాన్సింగ్ ఆఫ్ మాస్టర్స్' అన్న పుస్తకము ముఖ్యమైనవి, చదువతగినవి. అవి కొద్ది సంవత్సరముల క్రిందటనే ముద్రించబడినవి. అయితే సారగర్భితమైన తమ ప్రతిపాదనల కారణముగానే అవి ప్రఖ్యాతిచెందాయి. చూస్తూచూస్తూ ఉండగానే లక్షల సంఖ్యలో పునర్ ముద్రించబడి అమ్ముడుపోయాయి. దీనివల్ల ఆలోచనాపరుల సానుభూతి ఏ వైపున నిలుస్తున్నది అన్న విషయము తేటతెల్లమవుతున్నది. విజ్ఞానమును ఈరోజులలో ఉపయోగించుకుంటున్నట్లు దుర్మార్గమైన రీతిలో, అనుపయుక్తమైన కార్యాలలో ఉపయోగించుకోవాలి అని ఎవ్వరు కోరుకోవటము లేదు.

జార్జియా స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫిజిక్స్ డైరెక్టర్ ఫిన్నెన్టాయిన్ తన ప్రతిపాదనలలో ఒక విషయమును గురించి గట్టిగా చెప్పాడు. అది-కొద్దికాలముపాటు వైజ్ఞానిక ఆవిష్కరణములను నిలిపివేయాలి. అవి ఎవరికి, ఎటువంటి ప్రయోజనముల కొరకు నియోగించబడుతున్నాయి' అన్న విషయమును గురించి ఆలోచించాలి. పర్యవేక్షించకుండా, ఉద్దేశ్యములు నిర్ధారించబడకుండా గుడ్డి గుఱ్ఱపు పరుగులు తీస్తుంటే దాని పరిణామముగా సాధారణజనులు, వైజ్ఞానిక

**శ్రమే అన్నింటికీ మూలం**

క్షేత్రమేకాదు, స్వయముగా వైజ్ఞానికులు కూడా ఆపదలలో కూరుకుపోవడము తథ్యము.

సత్యము-తథ్యము రెంటినీ అన్వేషించుట అన్న విషయము వైజ్ఞానిక లక్ష్యమై ఉండాలి. వీటిని ఏ ప్రయోజనము కొరకు ఉపయోగించవలెను? వాటి మీద ఎవరికి ఆధిపత్యము ఉండవలెను? అనుచితమైన పరిశోధనలను నిరోధించుట ఎలా? ఈ విషయములు కూడా ఆలోచించతగినవి. వాటిని ఉపేక్షిస్తే గనుక ఉన్నతికి ఉపయోగపడేవి వినాశనమును కలిగించే వాటితో చేతులు కలుపుతాయి.

విజ్ఞానము ఇప్పుడు భౌతికస్థాయి వరకే పరిమితమవ్వక ఆధ్యాత్మికక్షేత్రములోకి ప్రవేశించవలసి ఉన్నది. ఈ మంథనమే విశ్వములోని మనీషుల మస్తిష్కములో దినదినాభివృద్ధి చెందుతూ పోసాగినది. అమెరికా పత్రికలో ప్రచురింపబడిన 'సటర్డ్ రివ్యూ' అనే వ్యాసం కాప్రాని బాగా ఆలోచింపజేసినది. అతనిలా అన్నాడు. 'ప్రకృతి రహస్యాల అన్వేషణలో ఇప్పటి వరకు మానవుని తార్కికబుద్ధే పనిచేసింది. ఇప్పుడు మారుతున్న పరిస్థితులలో ఒక క్రొత్త ఆధారమును చేపట్టవలసిన ఆవశ్యకత ఏర్పడినది. ఆ ఆధారము 'అంతర్‌ప్రజ్ఞ'! నేటివరకు అంతర్‌ప్రజ్ఞ యొక్క రీతి-నీతి, నైతికత మరియు భావసంవేదనలు ఉపేక్షించ బడుతున్నాయి. అంతర్‌ప్రజ్ఞకు సమున్నతస్థాయిని కల్పించ వలసిన సమయము ఆసన్నమైనది. రంగనాథానందులు 'సైన్స్ అండ్ రెలిజియన్' అన్న పుస్తకములో ఈ విషయమునే చక్కని భావకుశలతతో వివరించినారు.

ప్రగతిశీలురైన మనీషుల ఎదుట కొన్ని నూతన తథ్యములు మరియు నవసంకల్పములు ఉన్నవి. పదార్థసంపద మాధ్యమముగానే మానవ ప్రగతి సాధ్యపడుతుందా? అందులో నైతికత మరియు భావసంవేదనలు సమ్మిళితమై ఉండుట కూడా ఆవశ్యకమైనదేనా? అన్న విషయములను పరిశోధించవలసిన అవసరమున్నది. సామర్థ్యసాధనములతోనే మనిషి బలిష్ఠుడుగా తయారవుతాడా? లేకపోతే అతని వ్యక్తిత్వములో నైతిక విలువలు (సత్ప్రవర్తన) కూడా ద్విగుణీకృతమవ్వవల్సిన అవసర మున్నదా? అనికూడా ఆలోచించవలసిన అవసరమున్నది.

పదార్థజన్యమైన సుఖ-సౌకర్యాలనందించే సాధనములు ఎంత గొప్పవైనప్పటికినీ మనఃస్థితిలో ఉత్కృష్టతను ఉత్పన్నము చేయకుండా అవి సదుపయోగపడుట అసాధ్యము. దురుప యోగపరిస్తే అమృతము కూడా విషమవుతుంది. బట్టలను కుట్టే సూది కూడా ప్రాణాలను హరించే ఆయుధముగా మారుతుంది. విజ్ఞానము సౌకర్యాలను ఒనగూర్చినది అన్న అంశము ప్రశంసించవలసినదే! అయితే ఇక్కడ నిందించవలసిన విషయము కూడా ఒకటున్నది. మనిషి విలాసవంతుడుగా, లోభిగా, ఆక్రమణా ప్రవృత్తిగలవాడుగా తయారవుతుండటము, బలహీనులను కబళించే మత్స్యన్యాయమును అనుసరించుట మరియు వైరమును పెంచే ప్రతీకారజ్వాలలు రగిలించి తనను తాను భస్మీపటలము గావించుకునే అవకాశములు ఇందులో ఉన్నాయి. అవన్నీ నిందించతగిన అంశములే. ఈ స్థాయి దుర్గతిని ఉత్పన్నము చేయుటలో ఒకవేళ విజ్ఞానము దుర్విని యోగం అయితే అది నియంత్రించవలసిన అంశమే. విజ్ఞానము ద్వారా సత్యము-తథ్యములను అన్వేషించుటయే కాదు, ఉపలబ్ధులను వివేకపూర్ణముగా ఉపయోగించు కొనవలెను అన్న ఉద్దేశ్యమును పట్టించుకొనడం లేదు. ఈ విషయము గురించి కూడా ఆలోచించవలసినదే!

అంధవిశ్వాసములను దూరము చేయటమే విజ్ఞానము యొక్క కార్యము! దానితోపాటే మానవీయ గరిమను అక్షుణ్ణముగా ఉంచేందుకు సహాయపడే విధంగా మనిషిలో శ్రద్ధాభావనను అంకురింపజేసి, దానిని పెంచి పోషించాలి. **ఐన్‌స్టీన్ ఇలా అంటుండేవాడు - 'విజ్ఞానము లేకుండా ధర్మము గుడ్డిది. ధర్మం లేకుండా విజ్ఞానము కుంటిది.'**

పని ఏదైనప్పటికినీ దాని వెనుక సదుద్దేశ్యములు ఉండాలి. ఉపలబ్ధులు ఏ స్థాయికి చెందినవైనా అవి సరైన ప్రయోజనము కొరకు, సరైన మనుష్యుల ద్వారా ఉపయోగించబడాలి. లేకుంటే ఉపయోగకరమైనవి కూడా ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ప్రకృతిలోని రహస్యాలను అన్వేషించుట వలన ఎన్నెన్నో చమత్కారవంతమైన సామర్థ్యములు వైజ్ఞానికక్షేత్రములో లభ్యమయ్యాయి. వాటి సహాయముతో సుఖ-సౌకర్యాలను అందించే సామగ్రికూడా వృద్ధిచెందినది. ఈ అద్భుత ఉపలబ్ధుల వెనుక అనేకానేకమంది మనీషుల యొక్క శ్రమశీలత, తెలివితేటలు వినియోగించబడ్డాయి. అవి దురుప యోగమైనపుడు వెలిగించబడిన అగ్గిపుల్ల ఈ విశ్వవైభవమును క్షణమాత్రములో భస్మీపటలము గావించగలదు. ఈ విపత్తు మనిషి ఎదుటనే పొంచి ఉన్నది. వైజ్ఞానికులు దుష్టత్వమును పెంచి పోషించేందుకు. వెనుకబడిన వర్గమును మరింత దిగజార్చి, క్రిందికి నెట్టివేయుటకు ఉపయోగపడకుండా, తమ ప్రయత్నములు మానవప్రగతి మరియు సుఖశాంతుల నిమిత్తము ఉపయోగపడాలి.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1984*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**మనిషికి అంతిమ లక్ష్యం ఒక్కటే - ఆనందంగా ఉండటం**

# కేవలం విజ్ఞానం మాత్రమే కాదు సత్‌జ్ఞానం కూడా కావాలి

వైజ్ఞానిక క్షేత్రములో 'వాయోనిక్స్' అనే పేరుతో ఒక నూతన పద్ధతి కనుగొనబడినది. ఈ పద్ధతిలో వేలాదిమంది శాస్త్రవేత్తలు చాలా లోతుగా ప్రకృతిని అధ్యయనము చేయుటలో లీనమై ఉన్నారు. వాయోనిక్స్‌లో ప్రకృతిలోని సమస్త జీవ-జంతువులను గురించిన శారీరక విశేషతలను గంభీరముగా పర్యవేక్షిస్తున్నారు. వాటి ఆధారముగా నూతన ప్రయోగములు, పరిశోధనలు చేయగలుగుటకు ఈ పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్షేత్రములో పరిశోధనలు గావిస్తున్న శాస్త్రవేత్తలు 'జీవ-జంతువుల క్రియాకలాపములలో ఇంజనీరింగ్ యొక్క గొప్ప సిద్ధాంతము దాగి ఉన్నది. వాటిని అర్థము చేసుకుని, ఉపయోగించుకోగలిగినచో భౌతికక్షేత్రములో మనిషి ఈనాడున్న స్థితికన్నా మరింత మెరుగ్గా ముందుకు వెళ్ళగలుగుతాడు.

పరిశోధనాకర్తల అభిప్రాయము ప్రకారము 'మనిషి మౌలికంగా ఏమీ చెయ్యలేదు!' ప్రకృతిని చూసి దానినుండి ప్రేరణలను గ్రహించే అతను వికాసం చెంది ఇంత అభ్యున్నస్థితికి చేరుకోగలిగాడు.' వాయోనిక్స్ అధ్యయనములో మునిగి ఉన్న వైజ్ఞానికులు 'ప్రకృతే ప్రపంచములో అందరినీ మించిన ప్రశిక్షకురాలు! ఎల్లవేళల ప్రకృతి మౌనంగా మనిషికి పాఠాలను నేర్పుతూనే ఉన్నది. ప్రకృతి ఇచ్చిన శిక్షణను సరైన రీతిలో జీవనములో దింపుకోగలిగినచో అది సర్వాంగీణ ప్రగతికి ఆధారములుగా నిలుస్తుంది' అని అంటారు.

ఇప్పటివరకు సాధించిన ప్రగతిని సమీక్షిస్తే గనుక ఇంజనీరింగ్ రంగములో అందిపుచ్చుకున్న ఉన్నతస్థితి ప్రకృతిలోని జీవజంతువులను చూసి వాటి విధానమును అనుసరించి సాధించినదే అని స్పష్టమౌతుంది. కప్ప యొక్క నేత్రసంరచన మరియు చూసే పద్ధతిమీద ఆధారపడి అనేకానేక యంత్రములు నిర్మించబడ్డాయి. కప్పలోని విశేషత ఏమిటంటే అది జీవించి ఉన్న కీటకాలను మాత్రమే భక్షిస్తుంది. నోటికి అందుబాటులోకి వచ్చిన కీటకాలనే దాని కన్నులు చూడగలవు. చనిపోయి నేలమీద పడి ఉన్న జీవులను బహుశః అది చూడలేదేమో! ఒక ప్రయోగములో జాన్‌హోప్ మరియు హ్యూమర్‌జోన్ అను శాస్త్రవేత్తలు చనిపోయిన ఒక ఈగల గుట్టను కప్పకు చేరువలో వుంచారు. ఈగలలో చలనము లేని కారణముగా కప్ప కన్నులు నేలమీద పడి ఉన్న ఈగల గుట్టను చూడలేక పోయాయి. కదలిక ఉన్న వస్తువులను చూగలిగే రీతిలోనే వాటి నేత్ర నిర్మాణము జరిగినది. చలించేవాటి సందేశములే మస్తిష్కమునకు చేరుకుంటాయి. కప్ప యొక్క నేత్ర నిర్మాణము మరియు క్రియాపద్ధతిని ఆధారముగా చేసుకొని సైన్య విభాగములో 'మ్యాప్ రీడింగ్' కొరకు చక్షువులను నిర్మించుటలో శాస్త్రవేత్తలు సఫలతను పొందారు. అమెరికాలోని వాయుయాన సురక్షా పద్ధతిని 'ఆటోమేటిక్ గ్రౌండ్ ఎన్వైర్‌మెంట్' అని పిలుస్తారు. కప్ప తన కన్నులతో కేవలము తన శత్రువులను మరియు ఆహారమును మాత్రమే చూస్తుంది. ఆ పద్ధతిలోనే 'రాడార్'ని ప్రయోగిస్తున్నారు. ఎమ్.జి.ఇ. రాడార్‌కూడా ఆ విధానములోనే పనిచేస్తుంది. సామాన్యముగా ఆకాశములో ఒకేమారు పలు వస్తువులు గోచరిస్తాయి. మేఘములు, చిన్న ఉల్కలు, పక్షులు, విమానములు మొదలైనవన్నీ ఒకేమారు కనిపిస్తున్న కారణముగా ఖచ్చితముగా ఎప్పుడు అసౌకర్యము ఉంటుంది. ఎగిరే విమానము స్వ-పక్షానికి చెందినదా? లేక శత్రు పక్షమునకు చెందినదా? అన్న విషయమును నిర్ధారించు కొనుటకు కొంత సమయము పడుతుంది. ఈ అసౌకర్యము తొలగిపోయేందుకు ఎమ్.జి.ఇ. రాడార్ ద్వారా ఒక పరిష్కారము లభించినది. కప్ప కన్నులతో సమానముగా ఈ రాడార్ కేవలము శత్రు విమానములను గుర్తించగలుగుతుంది. విమాన ప్రమాదములను నివారించటానికి మరియు విమానముల రాకపోకలను గురించిన సరైన పర్యవేక్షణ చేసుందుకు సైతము కప్పనేత్ర వీక్షణా పద్ధతిమీద ఆధారపడి 'ఎయిర్ ట్రాఫిక్ రాడార్ స్కోప్'ల నిర్మాణము జరిగినది.

రైటెల్‌స్నేక్ అన్న పేరు గల ఒక విశేషమైన సర్పమున్నది. అది ఎక్కువ వేడి రక్తము గల జంతువులనే వేటాడుతుంది. ఉష్ణోగ్రతను కొలిచేందుకు దాని మస్తిష్కము మీద ఒక విశేషమైన సంవేదనాశీలత గల యంత్రముంటుంది. అది ఒక డిగ్రీలోని వేలాది విభాగముల బిందువుల భేదమును గుర్తించి కొలువగలదు. ఈ యంత్రము ద్వారా అది 'ఇన్‌ఫ్రారెడ్' కిరణములను కూడా గ్రహించగలుగుతుంది. వైజ్ఞానికులు దానిని అధ్యయనము చేసి ఒక ప్రేరణను పొంది 'యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ సైడ్‌విండర్ మిస్సైల్ అండ్ మెగా శాటిలైట్'ను నిర్మించారు. ఈ యంత్రము. ద్వారా సూక్ష్మతమమైన ఉష్ణోగ్రతలను కొలిచే వీలు ఉంటుంది. ఈనాడు వృద్ధిచెందుతున్న 'ఇన్‌ఫ్రారెడ్ సెన్సింగ్' పద్ధతి కూడా ఈ సిద్ధాంతము ఆధారముగానే పనిచేస్తున్నాయి. ఈ ఇన్‌ఫ్రారెడ్ పద్ధతి ద్వారా ప్రపంచములో ఏ మూలలోనైనా విడువబడిన రాకెట్ సమాచార

**సుఖం భౌతికమైనది, సంతోషం మానసికమైనది**

మును కొద్ది క్షణములలోనే తెలుసుకోగలము. 'కొనికల్ చాంబర్ వింగ్' నిర్మాణమును చూసి మనిషి తెలివి తేటలను పొగడాలనిపిస్తుంది. కానీ దీని నిర్మాణము యొక్క ప్రేరణ కూడా పక్షులనుండే లభించినది. ఆకాశములో వేగముగా ఎగిరే సముద్రపు పక్షుల రెక్కల నిర్మాణమును నమూనా ఆధారముగా ఓడలలో స్థిరత్వమును సాధించుటకు పైన చెప్పిన వింగ్‌ను నిర్మించడము సాధ్యమైనది.

సామాన్యమైనవి మొదలుకొని అసామాన్యమైన భౌతిక విజ్ఞాన ఉపలబ్ధులు ప్రాకృతిక ప్రేరణల ద్వారానే ప్రాపించినవి. విద్యుత్ సాంకేతిక రంగములో సాధించిన ప్రగతే వాయోనిక్స్ వలన పొందిన గొప్ప లాభము. అమెరికాకు చెందిన 'ఎయిర్ బార్స్ ఇన్స్ట్రమెంట్ లేబోరేటరీ' ఒక కృత్రిమ నేత్రమును రూపొందించినది. అది సామాన్య కణములనుండి కేన్సర్ కణములను వేరుగా చూపిస్తుంది. మానవ నేత్రమును చూసే పైన చెప్పబడిన యంత్ర నిర్మాణము జరిగినది. 'లింకన్ లేబోరేటరీ – జనరల్ ఎలక్ట్రికల్ కంపెనీ' మానవ నేత్ర క్రియా పద్ధతిని అనుసరిస్తూ చలిస్తున్న వస్తువుల వాస్తవ దూరమును కొలుచుటలో గల కష్టమును తొలగించి సరైన ఫలితమును అందించే యంత్రమును రూపొందించినది.

కంప్యూటర్‌ను నిర్మించినందుకు శాస్త్రవేత్తలు గర్విస్తారు కానీ ఒక సామాన్యమైన కీటకము దానికన్నా ఎక్కువ సామర్థ్యము కలది, సక్రియముగా ఉంటుంది. ఒక సెకండ్‌లోని 20వ వంతు సమయములో ఎగురుతున్న దోమను ఒక కీటకము వేటాడి పట్టుకోగలదు. అది కంప్యూటర్ పనిచేసే తీరుకన్నా అధిక శక్తివంతమైనది. డా॥ వైరన్‌మైకులో అనే శాస్త్రవేత్త కంప్యూటర్ కార్యపద్ధతిని, ప్రణాళికను రూపొందించాడు. 'కంప్యూటర్ అతి జటిలమైన మందబుద్ధి గల పశువు వంటిది. దానికన్నా వెనుకబడిన చీమకు ఉన్న మనో సామర్థ్యము–శక్తి కంప్యూటర్‌కు లేదు. చీమ చేయగలిగే పనికూడా ఆ శక్తివంతమైన కంప్యూటర్ ద్వారా చేయుట అసంభవమే' అని అంటాడు డా॥ వైరన్‌మైకులో.

చేప యొక్క ఊపిరితిత్తులను గురించిన అధ్యయనము సాగుతున్నది. ఆ ఊపిరితిత్తులలో ఉన్న ఏ విశేషత చేత చేపలు నీటిలో నివసిస్తూ కూడా ఆక్సిజన్‌ను గ్రహించి, కార్బన్–డై–ఆక్సైడ్‌ను విడిచిపెడుతున్నాయి? ఆ ఫలితమును పొందుట ద్వారా సముద్రములో మునిగి పరిశోధనలు చేసేవారు మరింత లోతైన గొప్ప పరిశోధనలు చేయుటకు సహాయము లభిస్తుంది. డాల్ఫిన్ చేప నోటి పైభాగములో సాగు గుణము కలిగిన చర్మము ఉంటుంది. డాల్ఫిన్‌నుండి ప్రేరణ పొంది యు.ఎస్ సంస్థ ఓడలు మరియు సముద్రములో మునిగి పరిశోధనలు చేసే వారికి ఉపయోగపడేందుకు ఒక యంత్రమును రూపొందించుటలో లీనమై ఉన్నది.

ప్రపంచములోని జీవశాస్త్రవేత్తలు, భౌతికశాస్త్రవేత్తలు, రసాయనశాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఇంజనీరింగ్ మరియు గణితశాస్త్రవేత్తలు వాయోనిక్స్ పరిశోధనలలో మునిగి ఉన్నారు. వీరందరు కలిసి జీవన శరీర నిర్మాణము యొక్క రహస్యములను వెలుగులోకి తెచ్చి భౌతికక్షేత్రములో నవీన ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నారు. భౌతిక ప్రగతిలో ప్రాకృతిక ప్రేరణలు అసామాన్యరూపములో సహాయపడినవి అని నిరూపితమైనది. తెలివైన మానవుడు జీవులనుండి సంపూర్ణమైన లాభములను హస్తగతము చేసుకున్నాడు. ఇకముందుకూడా అలాగే అందిపుచ్చుకుంటాడు.

అయితే ప్రకృతి ప్రేరణలకు చెందిన మరో పక్షము కూడా ఉన్నది. జీవజంతువుల ప్రాకృతిక జీవనక్రమము అనే ఆ రెండవ పక్షమును అనుసరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. సహజత్వము, సరళత్వము, ఉల్లాసము, ఉత్సాహముల తో నిండిన దినచర్య! కృత్రిమత్వము నుండి దూరంగా వైదొలగి ఆరోగ్యవంతమైన, ప్రసన్నత, ప్రఫుల్లతతో నిండిన జీవితమును సాగించేందుకు మనిషి కూడా పశుపక్ష్యాదుల జీవనచర్యనుండి ప్రేరణను పొందాలి. కేవలము జీవ–జంతువులు మాత్రమే కాదు, ప్రకృతిలోని ప్రతి సంఘటన మనిషికి ప్రేరణ ఇవ్వగలదు. ఆరోగ్యమేకాదు, మానవ ఐక్యత, సమత, శుచి, సహకారము మరియు సౌహార్ద్రములను వికసింప జేసుకొనుటకు సైతము ప్రకృతిని అధ్యయనము చేయవలసి ఉన్నది. సృష్టియొక్క సువ్యవస్థ, సంతునలము అన్నవి దానిలో ప్రతి అణువు, పరమాణువు యొక్క పరస్పర సహకార, సహయోగముల మీదే ఆధారపడి ఉన్నవి. మానవుని ఐక్యత, ఆత్మీయతలకు కూడా ఇవే ఆధారములు. మనిషి ప్రకృతి నమూనాను అనుసరిస్తూ యాంత్రిక ప్రగతిని సాధించాడు. శాంతి–సంతోషములు నిండిన, స్నేహము, సౌహార్ద్రములతో కూడిన, స్నిగ్ధత, ప్రసన్నతలతో ఉన్నటువంటి జీవితమును పొందుటకు కూడా ప్రకృతి యొక్క పరస్పర సహకార, సహయోగముల ప్రేరణను సైతము అందిపుచ్చుకోవాలి. అప్పుడే వాయోనిక్స్ యొక్క ఉపలబ్ధులను సరిగ్గా ఉపయోగించు కోగలము.

*– అఖండజ్యోతి, జూన్ 1981*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సౌకర్యాలు అన్నీ వారు సుఖంగా ఉంటారనే గ్యారెంటీ లేదు**

బోధ కథ

# భగవంతుని చేతిలో దండించే లాఠీ ఉంటుంది

విథూన్ నుండి బస్సు బయలుదేరింది. అది ఎగుదు దిగుడు దారిలో అటూ-ఇటూ ఊగుతూ ముందుకు పోతూ ఉంది. గ్రామ ప్రజలు అందులో గొఱ్ఱెలమందలవలె కూరినట్లు ఉన్నారు. గ్రామీణ స్త్రీలు తమ పొడవాటి ముసుగులు తల మీద వేసుకొని పెద్ద-పెద్ద దుప్పట్లు కప్పుకొని కూర్చొని ఉన్నారు. అర్ధనగ్న పిల్లలు ఏడుస్తూ గోలచేస్తూ ఉంటే బస్సు ఆ గతుకుల దారిగుండా పోతూ ఉంది.

అక్టోబరు నెల అయినందువల్ల వాతావరణం ఉల్లాస భరితంగా ఉంది. ఆయన కూడా తన గ్రామం నుండి వాపసు వస్తున్నాడు. కొంతదూరం పోయాక కండక్టర్ ఆయనతో, బాబూజీ! ఇక్కడ సీటు ఖాళీగా ఉంది. ఇటుగా వచ్చి కూర్చోండి అని అన్నాడు. ఆయన గుంపు నుండి దారిచేసుకుంటూ అక్కడకు చేరాడు. బస్సుపోతూనే ఉంది. కొంతమంది ప్రయాణీకులు చేసిన అభ్యర్థన మేరకు మాధోబాగ్ బజారు వద్ద బస్సు ఆగింది. అక్కడ ఒక వృద్ధ బాబా, ఇంకా ఆయనతోపాటు ఇరువురు యువకులు బస్సు ఎక్కారు! బాబా వయస్సు 50 నుండి 55 సంవత్సరాల వరకు ఉండవచ్చు. తెల్లటి ధోవతి, తెల్లటి చొక్కా ధరించి, తలమీద పెద్ద తలపాగాతో, తెల్లటి గడ్డం కలిగి, చూడటానికి పెద్ద మనిషిలాగా కనబడుతున్నాడు. ఆయనతోపాటు బస్సు ఎక్కిన ఇద్దరు యువకులు పిచ్చాపాటి మాటల్లో మునిగి ఉన్నారు. వారిరువురు ఏదో ఒక విషయం గురించి పెద్దగా మాట్లాడుతూ నవ్వుకుంటున్నారు.

వీరి చూపు ఎదురుగా ఉన్న బాబామీద పడినప్పుడల్లా ఆయన కిటికీకున్న మసకబారిన అద్దంలోనుంచి బయటకు చూస్తూ ఉన్నట్లు గమనించారు.

అకస్మాత్తుగా బస్సు ముందు స్టాప్‌లో ఆగింది. తుంటరి యువకులిరువురు బస్సు నుండి దిగారు. నిలబడి ఉన్న ఇరువురు ప్రయాణీకులు వచ్చి బాబా ప్రక్కన సీటుమీద కూర్చున్నారు. బస్ కండక్టర్ ముందుకు వచ్చి ఆయన దిగబోయే స్థానానికి టిక్కెట్ ఇస్తూ బాబా మీరు మాధోబాగ్ స్టాప్‌లో బస్సెక్కారు కదా అని అన్నాడు. అవును అంటూ బాబా కూడా టిక్కెట్టు తీసుకొన్నాడు. అదే సమయంలో బాబా ప్రక్కన కూర్చున్న వ్యక్తి తన జేబులో చెయ్యిపెట్టి "నా పైకం నా డబ్బులు పోయాయి. బస్సు ఆపండి నా జేబు ఎవరో కత్తిరించి నా పైకం దోచుకున్నారు. ఎవరో నా జేబు నుండి 500 రూపాయలు తీసుకొన్నారు. బస్సు ఆపండంటూ పెద్దగా కేకలు వేయసాగాడు.

'అరె భాయి! ఒకసారి మళ్ళీ నీ వద్ద చూసుకో... ఏదైనా పొరపాటు పడ్డావేమో చూసుకో" మిగిలిన వారు అన్నారు. ఆ వ్యక్తి రుద్ధకంఠంతో నేనేం పొరపాటు పడలేదు. నా బాధ మీరెందుకు అర్థం చేసుకోవటం లేదు.

ఎవరు పైకం పోగొట్టుకుంటారో, అటువంటి వారు పొరబడరు. నేను బాగా తెలివిడిగానే ఉన్నాను... ఇంతకు క్రితమే చూసుకొన్నాను... నా జేబులో పైకముంది. ఇప్పుడు టిక్కెట్ తీసుకొందామని జేబులో డబ్బు కోసం చూసుకొంటే నా జేబు పూర్తిగా ఖాళీగా వుంది! ఇలా ఆ వ్యక్తి పెద్దగా అరవసాగాడు.

ముందు రాబోయే పోలీస్‌స్టేషన్‌లో బస్సునాపండి! పోలీసులు అందరినీ వెదికేంతవరకు ఎవరూ బస్సు దిగవద్దు. డ్రైవర్‌గారు పోలీసుస్టేషన్‌కి బస్సు తీసుకొనిపోండి.

"నేను వచ్చే స్టాప్‌లో దిగాలి" అని బస్సులో ఎవరో మేక అరుపులాగా అనగానే "ఎట్టి పరిస్థితులోను కుదరదు. ఎవరు దిగుటకు అవకాశం లేదు. నౌబస్తా పోలీసు చౌకీ వరకు వెళ్ళవలసిందే" బస్సు కండక్టర్ ఒక 'జడ్జి' లాగా తన నిర్ణయాన్ని అందరకు తెలిపాడు.

"మొత్తం 500 రూపాయలు... వంద-వంద చొప్పున మొత్తం ఐదు వంద నోట్లు!" ఆ వ్యక్తి పెద్దగా అరుస్తూ చెప్ప సాగాడు.

బస్సులో గోలగా హంగామా మొదలైంది! కండక్టర్ బస్సు తలుపులను మూయించి వేశాడు. అందరు తమతమ జేబులను తడుముకోసాగారు. ఎన్నడూ తాము కూడా ఏదైనా పోగొట్టు

కంటికి కనిపించేది అంతా నిజం కాదు

కున్నామేమోనని కనిపించని దొంగ గురించి అందరు రకరకాలుగా మాట్లాడుకోసాగారు. ప్రతి వ్యక్తి, ఇతరులను సందేహ దృష్టితో చూడసాగారు.

"ఇప్పుడే తేలిపోతుంది... ఎవరు నా జేబు కొట్టేశారో! నా నోట్ల మీద ఒక మూల నల్లటిసిరా గుర్తులున్నాయి. ఇప్పుడే తెలుస్తుంది. దొంగ తప్పించుకొని ఎక్కడకుపోతాడో చూస్తాను!"

"దొంగ దొరికితే గనక, వంద చెప్పు దెబ్బలు తగిలిస్తాను" ఒకవేళ... ఇంతకు క్రితం స్టాప్‌లో దిగిపోయిన వారెవరైనా జేబు కొట్టి ఉండవచ్చును గదా!

"లేదు... ఏమంటున్నారు మీరు? ఇప్పుడేగా నా వద్ద ఉంది. బస్సు స్టాప్ నుండి బయలుదేరే ముందు, నేను టికెట్టు కొరకు రెండు రూపాయలను జేబు నుండి తీసి, పై జేబులో ఉంచుకొన్నాను... కదా!"

"సోదరా! నీవేమి చింతించకు! దొంగ తప్పించుకుని ఎక్కడకు పోలేదు! కండక్టర్ అతన్ని ఓదార్చాడు. ఎవరైతే డబ్బు పోగొట్టుకున్నాడో; ఆ వ్యక్తి ఒక ఆఫీసులో గుమాస్తా! కాటన్ బుష్‌షర్ట్, మామూలు ప్యాంట్ కలిగి, వయస్సు 30 నుండి 35 సం॥ల మధ్య ఉండవచ్చు. అటువంటి పరిశ్రమించు, తెల్లని వస్త్రాలు ధరించిన వ్యక్తి 500 రూపాయలు పోగొట్టుకున్నాడంటే... అర్థం అతనొక నెలజీతం నష్టపోయినట్లే... నిజంగానే ఈ మొత్తం అతని నెలజీతమై ఉండవచ్చు. దురదృష్ట వంతుడు... అతడు ఎంతో పశ్చాత్తాపంలో మునిగి ఉన్నాడు. అతడు 'విధూన్' బస్సుస్టాప్‌లోనే బస్సెక్కాడు! ఏదో ముఖ్య పని మీద తొందరగా వెళ్ళవలసి వచ్చి ఉంటుంది. అందువల్ల కొంత తొందరలో ఉన్నాడు.

కొద్దిసేపటికి బస్సు 'నౌబస్తా' పోలీసుస్టేషన్ వద్ద ఆగింది. డ్రైవర్ దిగి స్టేషన్ లోపలికి వెళ్ళాడు. ప్రయాణీకులంతా ఎంతో ఏం జరుగుతుందోననే ఉత్సుకతతో బస్సు కిటికీల అద్దాల నుండి చూస్తున్నారు.

డ్రైవర్‌తోపాటు ఇరువురు సిపాయిలు, ఒక ఇన్‌స్పెక్టర్ స్టేషన్ నుండి బైటకు వచ్చారు. కండక్టర్ గుమ్మం వద్ద నిలుచుని ఒక్కొక్కరిని పోలీసుల వద్దకు పంపాడు. ప్రతివ్యక్తిని పోలీసులు చాలా నిశితంగా సోదా చేశారు. డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి పోలీసుల చెరలో జరిగిన దొంగతనం గురించి వివరంగా చెప్పాడు.

ఆడవారు తమను సోదా చేయుటను తిరస్కరించారు! అందుచేత ముందుగా మగవారిని సోదా చేసిన తరువాత ఒక మహిళ ద్వారా బస్సులోని మహిళలను సోదా చేయాలని ఇన్‌స్పెక్టర్ నిర్ణయించుకున్నాడు. సామానుతో పాటు బస్సు మొత్తాన్ని కూడా సోదా చేయించారు! ఎక్కడైనా బస్సులో డబ్బుని దాచారేమోనని ప్రతిచోటా వెదికారు!

ఒక్కొక్కరిని సోదా చేయు క్రమంలో అందరి తరువాత బాబా వంతు వచ్చింది. సోదా చేసే సమయంలో బాబా వద్ద బయటపడిన సొమ్ముని గమనించిన వ్యక్తి... అదే అదే నా డబ్బు అంటూ అరవటం మొదలుపెట్టాడు. పోలీసులు బాబా చొక్కా మెడపట్టుకొని, ముఖం మీద కొడుతూ – "ఓ ముసలోడా నీకు సిగ్గువేయలేదా దొంగతనం చేయటానికి! చూడ్డానికి దేవతగా కన్పిస్తూ, పని మాత్రం దెయ్యంలాగా ఉన్నది" అని అన్నారు.

"చూడటానికి ముసలాడే కానీ చేసిన పని మాత్రం పాపిష్టిది" అని ఒక మహిళ తన బాధను వెళ్ళగ్రక్కింది.

"భగవంతుని మీద ఆన! ఈ రూపాయలు నావే! నేను ఈ రోజే మాధోబాగ్ బజారులో మేకలను అమ్మాను. దాని తాలూకే ఈ డబ్బు"

"ఎక్కువగా వాగబోకు! ఓ ముసలోడా! నీవు నీ ఈ పొడుగైన గడ్డానికైనా మర్యాదనివ్వు..." అంటూ పోలీసులు బాబాని కోపంతో ఈడ్చారు! ఆయన తలపాగా జారి కాళ్ళమీద పడింది!

అటు–ఇటు చేరిన గుంపు రకరకాలుగా మాట్లాడుతూ, తమకు తోచిన విధముగా ఆయనను హేళన చేయసాగారు. చూడండీ! ఇటువంటి ముసలివ్యక్తి కూడా ఈ విధంగా జేబుదొంగ అవగలడని నమ్మలేము. అరే భాయి! ఈ రోజుల్లో చూడ్డానికి మంచివాడిగా కనిపిస్తూ, మోసానికి ఒడిగడతారు! అయ్యో–దేముడా! ఇటువంటి వారే స్మశాన పిశాచులుగా ఉంటారు.

ఎవరో అంటున్నారు... "అరే భాయి! ఇది కలియుగం అవును కలియుగమే" ఈ విధంగానే అక్కడ చేరిన వారంతా అంటూ వ్యంగ్యమాటలను గాలిలో సంధించసాగారు. మరి కొంతమంది ఇంత ముసలితనంలోనే ఇంత చేతివాటమంటే, కుర్రతనంలో ఇంకెంతగా జేబులు కొట్టేవాడో" అక్కడకు చేరిన

**కంటికి కనిపించనిదంతా అబద్ధం కాదు**

ప్రతివ్యక్తి బాబాని దొంగగా పూర్తిగా నిర్ధారించుకున్నారు. కానీ ఆయన ఇప్పటికి ఆ ధనం తనదేనని తాను ఎవరి సొమ్ము దొంగలించలేదని ఎంతో నమ్మకంగా అంటున్నాడు. ఆ ముసలి ముఖం మీద నిస్సహాయత అలుముకొంది! ఆయన అవమాన భారంతో, నిందలపాలై బాధపడసాగాడు.

ఇన్‌స్పెక్టర్ బాబా పర్సు తీసి అందులోని డబ్బు యజమాని కిచ్చాడు. ఆ వ్యక్తి పోలీసులకు, బస్ కండక్టర్‌కు ధన్యవాదాలు చెప్పి 5 రూపాయల రెండు నోట్లు తీసి పోలీసులకు 'టీ' త్రాగుటకిచ్చాడు.

బాబాని పోలీసులు ఎంతమాత్రం దయలేకుండా పోలీసు స్టేషన్‌కు లాక్కుంటూపోయారు! ఆయన తన సాక్ష్య నిరూపణ కొరకు ఆకాశం వైపుకు వ్రేలెత్తి చూపుతూ, దిక్కుతోచక ఇలా పిలవసాగాడు. "హే... ప్రభూ! భగవాన్! తమరే నాకు న్యాయం చేయండి!"

"నడు-నడు! గొప్పగా నాటకమాడబోకు! లోపలకు నడు! నీ వెనుకటి రికార్డులు కూడా చూడవలసి ఉంది. అంటూ పోలీసులు ఆయనను నెట్టుకుంటూ స్టేషన్‌లోపలికి తీసుకొని పోబోతున్నారు!

డబ్బు దొంగిలించబడిందని చెప్పిన వ్యక్తి కొద్ది దూరంలోనే ఉన్న ఒక టాంగానెక్కి కూర్చున్నాడు... టాంగా బయలుదేరి పోసాగింది. అక్కడకు చేరిన వారంతా "ఎలాగైతేనేమి డబ్బు పోగొట్టుకున్న వ్యక్తికి సరైన న్యాయం జరిగి అతని సొమ్ము అతనికి దక్కిందని" అనుకునేంత సమయంలో ఒక విచిత్ర సంఘటన జరిగింది! టాంగా కొద్దిదూరం పోయేంతలో, ఎదురుగా ఎంతో వేగంతో వస్తున్న మరొక టాంగాని ఢీకొని, లోనున్నవారంతా క్రిందకు పడిపోయారు. దెబ్బలు తగిలిన వారంతా కేకలు వేస్తూ లేవటానికి ప్రయత్నిస్తున్నారు. అందరి దృష్టి వారి మీద పడింది. ప్రమాదం అకస్మాత్తుగా, అనుకోకుండా జరగటంతో, అందరి ముఖాలకు దెబ్బలు తగిలి అరవసాగారు.

అన్నింటికన్నా విచిత్ర విషయం క్రిందపడి, దొర్లినవారికి పెద్దగా దెబ్బలు తగలలేదు. కాని ఇంతకు క్రితం డబ్బులందు కొని నవ్వుతూ సంతోషిస్తూ టాంగా ఎక్కిన వ్యక్తికి మాత్రం రెండవ టాంగాకున్న కర్ర అతని గుండెలో దిగబడింది. అతని హృదయం నుండి కారిన రక్తంతో అతని దుస్తులన్నీ తడిసి పోయాయి. చూస్తున్నవారంతా పరుగు-పరుగున అక్కడకు చేరి చూడగా, ఆ వ్యక్తి పొర్లుతూ అటూ ఇటూ కొట్టుకుంటూ 'బాబాజీని వెంటనే తీసుకురండని తొందరపడుతూ పిలవ సాగాడు.

వెంటనే అందరూ బాబాని తీసుకొని రావటానికి పోలీసు స్టేషన్‌కు పరుగులు తీశారు. కొద్దిసేపట్లోనే ఆయనను తీసుకొని వచ్చారు. బాబాని చూస్తూనే అతడు నోటి నుండి కారుతున్న రక్తాన్ని బయటకు ఉమ్మివేసి అతికష్టంతో ప్రాణాలను ఉగ్గ బట్టుకొని ఇలా అన్నాడు "బాబాజీ ఈ అందరి ఎదుటనే, నేను మిమ్ములను క్షమించమని వేడుకుంటున్నాను. నన్ను క్షమించండి! నేను తీసుకొన్న ఈ ధనం మీదే! నేను చాలా పెద్ద తప్పు మీ పట్ల ఒనరించాను. మీ మీద తప్పుడు అభాండం వేసి మిమ్మల్ని అవమానానికి గురిచేశాను. నన్ను క్షమించండి. మీరు టెక్కెట్టు తీసుకొనుట కొరకు మీ పర్సును తెరచినప్పుడు నేను ఆ వంద రూపాయల నోట్లను అయిదింటిని చూశాను. వాటి మీదున్న సిరాగుర్తులను చూశాను. వాటిని నేను పొందాలనే దుర్బుద్ధితో నా సొమ్ముపోయిందని నాటక మాడాను. అందుకు తగిన దండన నాకు భగవంతుడిచ్చాడు" అంటూ ఆ వ్యక్తి తల ఒక ప్రక్కకు ఒరిగిపోయి, చనిపోయాడు! అది చూసిన 'బాబా' కంటి నుండి రెండు అశ్రుధారలు ముత్యాల లాగా జారిపడ్డాయి.

భగవంతుని ధర్మ 'దండం' ఎంతటి ప్రభావం చూపుతుం దంటే కనురెప్పపాటులో జరిగిన ఈ సంఘటనను చూసిన వారంతా, ఆయన న్యాయనిర్ణయాన్ని ఒప్పుకోకుండా ఉండజాలరు. జరిగిన ఈ సంఘటనను తలచుకుంటూ ఉంటే, ఈనాడు కూడా హృదయం పూర్తి నమ్మకంతో నిండిపోతుంది. ఎందుకనగా **ఎటువంటి బలహీన వ్యక్తి అయినా భగవంతుని దర్బారులో ఎన్నడూ నిస్సహాయుడు కాదనే** సత్యం బయట పడుతుంది. భగవానుడు అందరిలో ఉన్నాడు. ఆయన 'ధర్మ దండం'లో 'అధర్మాన్ని' అణచగల గొప్పశక్తి దాగి ఉంటుంది. ఈ సత్యాన్ని ప్రతివారు తెలుసుకోవాలి.

*- అఖండజ్యోతి, ఆగస్టు 2001*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**అపజయమే విజయానికి దారి**

# యోగానుభూతులకు రాజమార్గం - ఆత్మనియంత్రణ

సంకల్పశక్తి వల్ల జరిగే అద్భుతాల్లో ఒకటేంటంటే, వ్యక్తి తన శరీరాన్ని కోరుకున్న విధంగా నియంత్రించుకుని, తన అవయవాలను కోరుకున్న విధంగా ప్రయోగించగలడు.

కానీ చాలావరకు ఇలా జరగదు. చైతన్య మస్తిష్కానికి శరీరం మీద ఆధిపత్యం పరిమితంగానే ఉంటుంది. కాళ్ళు చేతుల కదలికలు దాని ఆదేశం మేరనే జరుగుతాయి. సంపాదన, భోజనం మొదలుకొని రోజు వారి కార్యకలాపాలన్నీ దాని ప్రణాళిక ప్రకారమే జరుగుతాయి. అయినప్పటికీ, ఈ ఆలోచించే మస్తిష్కం యొక్క నియంత్రణ అవయవాల ఆంతరిక పరిస్థితిపై ఉండదని చెప్పవచ్చు. అవన్నీ అచేతన మెదడు యొక్క ఆదేశాలను పాటిస్తాయి. రక్త ప్రసరణ, ఊపిరి, కనురెప్పలు కొట్టుకోవడం, సంకోచ వ్యాకోచాలు మొదలైన వాటి మీద చైతన్య మస్తిష్కం యొక్క ప్రభావమేమీ ఉండదు. ఇటువంటి స్వసంచాలిత కార్యకలాపాలలో వేటినీ ఆపలేదు, వేగమును పెంచలేదు. జీర్ణప్రక్రియ, చెమట, మలవిసర్జన మొదలైన పనులు ఎవరి అనుమతి కోసము ప్రతీక్షించవు. పైగా వాటి ఒత్తిడికి అనుగుణంగా, వాటి అవసరాలను బట్టి ఏర్పాట్లు చేసే బాధ్యత చైతన్యానిది. మలమూత్రాలు, దగ్గు, తుమ్ములు, ఎక్కిళ్ళు మొదలైనవి వచ్చినప్పుడు, వాటిని ఆపడం కుదరదు, పైగా వాటికి అనుగుణ్యమైన ఆచరణ అవయవాలే చేయాలి.

మనిషి తన శరీరానికి అధిపతి, అన్న విషయంలో ఎంత సత్యమున్నది? పైగా శరీర అవసరాలను తీర్చే బాధ్యత ఆలోచనావ్యవస్థపై బలవంతంగానైనా ఆరోపించబడుతుంది. కడుపుకు ఆకలైనా, నిద్ర ముంచుకొచ్చినా దానికి తగిన వ్యవస్థ ఏర్పాటు మెదడు బలవంతంగానైనా చేయాలి. అలాంటప్పుడు దానిని శరీరానికి నౌకరని కూడా అనవచ్చు కదా!

ప్రత్యక్ష కర్మలు మాత్రమే చైతన్యం చేతిలో ఉంటాయి. ఈ యంత్రం యొక్క వ్యవస్థలో, దాని ఆంతరంగిక క్రియాకలాపాలలో ఎవరి ప్రమేయం ఏ మాత్రం లేదు. జీర్ణం చేసే ద్రవములు ఉత్పన్నం కాకపోతే, అజీర్తితో బాధపడే మనిషి మందు మాకు వెతుక్కోక మరేం చేయగలడు? రక్తపోటు, మధుమేహం, అనిద్ర, ఒత్తిడి మొదలైనవాటిని ఎవరూ అడిగి మరీ తెచ్చుకోరుగా! ఇష్టం లేని అతిథుల్లాగా అవే వచ్చి పడతాయి. అయితే, అవన్నీ బయట నుండి రావు, అన్నీ లోపలే పుడతాయి. మన పొలంలోనే ఇష్టం లేని పంట పండించే గొప్పతనం ఈ మధ్య కాలంలోనే చాలా చూస్తున్నాం. పొలం మనదే అయినా, యజమానిగా చలామణీ అవుతున్న వారి ఇష్టానికి విరుద్ధంగా అందులో కలుపు పెరగడానికి, పురుగు పట్టడానికి అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

యోగాభ్యాసానికి ప్రధానమైన ఉద్దేశ్యం ఆత్మనియంత్రణ అని భావిస్తుంటారు. దీంట్లో మూడు మార్గాలున్నాయి. ఒకదానిని స్వభావం, అభ్యాసం, అలవాటు అంటుంటారు. దీనినే సభ్యత, సంస్కృతి అంటారు. మర్యాద, ఔదార్యం, సక్రమ ఆచరణ మొదలైన సద్గుణాలన్నీ ఆత్మనియంత్రణ పరిధిలోకే వస్తాయి. ఈవిధమైన క్రమశిక్షణను నేర్చుకోని వారు బద్ధకస్తులు, పని ఎగ్గొట్టేవాళ్ళు అవుతారు; అటువంటి వారిని చూస్తే ఏవగింపు కలుగుతుంది, పైగా వారి మోసాలను, కుతంత్రా లను సహించాలి. ఆత్మనియంత్రణ కలిగిన వ్యక్తులు ఇటువంటి గుణాలకు దూరంగా ఉంటారు, గౌరవనీయులైన పౌరులుగా లెక్కించబడతారు.

ఆత్మ నియంత్రణకు వేరే మార్గం ఉన్నది. అదే ఆలోచనల నియంత్రణ. చెప్పుకోటానికి మస్తిష్కంలోని పదార్థాలన్నీ మెదడు అనే పెట్టెలోనే గుట్టుగా పడుంటాయి, కానీ వాటిలో రేకెత్తే ఆలోచనలు మాత్రం అదుపులేని లేళ్ళలాగా పరుగులెత్తుతాయి, కోతుల్లా గంతులేస్తూ ఉంటాయి. ఎన్నో ఆలోచనలు షికార్లు కొడుతూంటాయి. వాటిలో చాలా వ్యంగ్యమైనవి, అసంభవమైనవి, నిరంకుశమైనవి ఉంటాయి. వాటివల్ల మస్తిష్కీయ శక్తి చాలా ఖర్చువుతుంది, చాలాసార్లు ఉద్వేగం, ఉన్మాదం కూడా తలెత్తుతుంటాయి. ఇటువంటి పరిస్థితి ఉన్నవాళ్ళు ఏ విషయంలోనూ సవ్యముగా ఆలోచించలేరు. ఇక ముఖ్యమైన పనులు మొదలుపెట్టడం, ముగించడం చేయగలరని నమ్మడం ఎలా?

ఆలోచనలను అదుపు చేసుకోవడాన్ని మనోనిగ్రహం అంటారు. మనసును వశపరుచుకోవడం వల్ల కలిగే లాభాల విస్తారమైన మాహాత్మ్యాన్ని ఆధ్యాత్మ శాస్త్రాలలో తెలుపబడ్డాయి. మనస్సును నియంత్రించేందుకు కావలసిన శిక్షణ, వాతావరణం తయారు చేసే ప్రయత్నం చేస్తూ ఉండాలని మనోవిజ్ఞాన శాస్త్రం కూడా తెలుపుతోంది. 'బ్రెయిన్ వాషింగ్' పేరుతో మెదడును

**ఒక వైఫల్యం ఎదురయితే నిరాశ చెందవలసిన అవసరం లేదు**

అదుపుచేసే వైజ్ఞానిక ప్రయత్నం కూడా కొనసాగుతోంది. సాహిత్యం, కళలు మొదలైనవాటి శిక్షణ, ప్రచారం యొక్క ఎన్నో చికిత్సలు ఈ ప్రయోజనానికే వాడతారు. సభ్యత యొక్క వికాసంలో విద్యకున్న ప్రాధాన్యత ఏమిటో అందరికీ తెలుసు. విద్య అంటే మరేదో కాదు, ఆలోచన క్షేత్రాన్ని విస్తరింపజేసే విధానం, వ్యవస్థ మాత్రమే.

ఆత్మ నియంత్రణ యొక్క మూడవ క్షేత్రం – అచైతన్యపు లోతుల్లోకి చైతన్యం వెళ్ళగలగడం, పరిస్థితిని అర్థం చేసుకుని అవసరాన్ని బట్టి కలగజేసుకోవడం, మార్పులు చేయగల నైపుణ్యం. దీనినే హఠయోగం అంటారు. హఠయోగం అంటే ఆంతరిక శరీర క్రియాకలాపాలలో అవసరాన్ని బట్టి మార్పులు చేర్పులు చేయడం.

సాధారణంగా ప్రకృతి ప్రేరేపించిన విధానంలో శరీరం సంచాలన సుజావుగానే సాగుతుంది. కానీ ఒక్కోసారి వికృతుల వల్ల ఏర్పడిన పరిస్థితులను చికిత్స ద్వారా కానీ, శల్యక్రియ ద్వారా కానీ నయం చేయలేం. అలాంటప్పుడు తగిన మార్పు కోసం అచేతనంతో ముడిపడి ఉన్న కేంద్రములను కదిలించ వలసి వస్తుంది కానీ ఈ క్షేత్రంలో మార్పులు చేయడం అందరి తరం కాదు. యోగాభ్యాసం ద్వారా ఈ స్థాయి సామర్థ్యం సాధించినవారి వల్లనే ఇది సాధ్యం అవుతుంది.

దీర్ఘాయువు కోసం జీవకోశాలకు విశ్రాంతినివ్వడం అవసరం. హృదయం, మెదడుల పనులను కొంత సేపు ఆపగలిగితేనే ఈ పని కుదురుతుంది. ఈ విరామం సాధారణంగా మనిషి వల్ల కాదు, కానీ సమాధిని అభ్యసించడం ద్వారా అర్ధ మృత్యువుతో సమానమైన స్థితికి చేరవచ్చు. సమాధి సాధన ద్వారా యోగులు పాత శరీరాలలోనే ఉంటూ మళ్ళీ మళ్ళీ వాటిని కొత్తవిగా చేసేసుకుంటారు. ఒకే జన్మలో ఎన్నో జన్మల జీవనయాత్రను కొనసాగించగలరు.

సమాధిస్థితిలో బాహ్య మస్తిష్కం యొక్క ప్రభావం అచేతనం మీద నుంచి తొలగిపోతుంది, అప్పుడు మహా చైతన్యంతో సంబంధం ఏర్పర్చుకోవడం సులువవుతుంది. ఇంద్రియశక్తితో సాధ్యం కాని ఎన్నో విషయాల గురించి తెలుసు కోవడం, చూడడం, వినడం, అర్థంచేసుకోవడం కుదురుతుంది. ఈ స్థితినే దివ్యదృష్టి అంటారు.

అతీంద్రియ సామర్థ్యాల క్షేత్రం అచేతనం. దానికి వీలుంటే మాత్రం తన శక్తినంతా వాటిని వెలికితీయడానికి వినియోగిస్తుంది, కానీ దాని శక్తి చాలామటుకు అవయవాల ఆంతరిక వ్యవస్థను సుస్థిరపరచడంలో ఖర్చైపోతుంది. అప్పుడప్పుడు ఈ వ్యవస్థ నుండి దానికి వెసులుబాటు కల్పించి, అంతకన్నా పనికొచ్చే గొప్ప కార్యాలకు వినియోగపడేలా సారధ్యం వహించే విశ్రాంత స్థితిని సమాధి అంటారు. ఆత్మ నియంత్రణలో ఇది సర్వోచ్ఛస్థితి.

అచేతనంపై ఆధిపత్యం చలాయించడానికి కావలసిన ప్రచండ సంకల్పశక్తిని ఆర్జించడానికి ఎన్నో రకాల సహన దారుఢ్యాలను అలవాటు చేసుకోవాలి. తపశ్చర్య విధానాల్లో ఇటువంటి పనులు ఎన్నో ఉన్నాయి. అందులో భాగంగా దైనిక అభ్యాసాలలో అవరోధాలు ఉత్పన్నం చేయడం లాంటి యుద్ధాలెన్నింటితోనో స్వతహాగా ఘర్షణ పడవలసి ఉంటుంది. హఠయోగులు ఇదే చేస్తూ చివరికి సమాధిస్థితికి చేరుకుంటారు.

సమాధిలో చరమస్థితిలో హృదయం, మెదడు తమ శరీరగత క్రియాకలాపాలని బాగా తగ్గించుకుని కనిష్ఠ స్థాయికి తెచ్చుకుంటాయి. కానీ అందరు ఈ స్థితికి చేరాలనే నియమేమీ లేదు. తీవ్ర భావ ధ్యానంలాంటి ఉపాయాలతో సామాన్యులు కూడా అంతఃక్షేత్రాన్ని కొంతవరకు చేజిక్కించుకుని, అంతటితోనే ఆంశిక సమాధి లాభాలు పొందవచ్చు.

*– అఖండజ్యోతి, జనవరి 1984*

*అనువాదం: శ్రీమతి ఎం.వి. ప్రసాద్ & జయలక్ష్మి*

## స్నేహం, సేవ

*"ఒక మహనీయుడు వశిష్ఠ మహర్షికి నమస్కరించి, 'మహాత్మా! నేను ధర్మనియమాలను అనుసరించి నడచు కొనే పుణ్యాత్ముడిని. పూజ, ఉపాసనల వంటి కర్మ కాండలలో ఏ మాత్రం వెనుక ఉండను. అయినా ఏ విధమైన ఆత్మసంతోషాన్ని, సమాజంలో గౌరవాన్ని పొందలేకపోతున్నాను ఎందువలన' అని ప్రశ్నించాడు. దానికి వశిష్ఠుడు 'వత్సా! సదాచారం, సాధన గొప్పవే. కానీ సేవ, స్నేహం అనే అమూల్యగుణాలు లోపిస్తే అవి రెండూ అసంపూర్ణంగానే ఉండిపోతాయి. కాబట్టి నీవు సేవ, స్నేహం అనే రెండు సాధనలను స్వీకరించి పూర్ణ ఫలితాన్ని పొందగలవు' అని పలికాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**జీవితంలో ఒక తలుపు మూసుకుపోతే మరొక తలుపు తెరిచే ఉంటుంది**

# మద్యపానమనే దుష్ప్రవృత్తి సమాజమును పతనం కావిస్తుంది

స్వతంత్ర భారత రాజ్యాంగములో 47వ అధ్యాయము (ప్రకరణము)లో దేశమునకు నీతినిర్దేశమును కావించే సిద్ధాంతములో "రాజ్యాంగము తన ప్రజల యొక్క పోషణస్థితిని మరియు జీవనస్థాయిని పెంచుట మరియు దేశ ప్రజల ఆరోగ్యమును చక్కబరచుట అన్నదానిని తన యొక్క ఒక ప్రాథమిక కర్తవ్యము అని భావిస్తుంది. ప్రత్యేకించి ఆరోగ్యము కొరకు ఔషధీయ ప్రయోజనమును కలిగించని మత్తు పానీయము(పదార్థము)లను నిరోధించే ప్రయత్నము చేస్తుంది" అని చెప్పబడి ఉన్నది. ఈ లిఖిత రాజ్యాంగ చట్టము మరియు పలు ప్రదేశములలో మత్తు పదార్థముల నిర్మూలనాచట్టము ఉన్నప్పటికీ మత్తుపదార్థ సేవనము వేగంగా ప్రబలిపోతున్నది.

విస్తృతస్థాయిలో పానము చేయబడుతున్న పొగాకు వంటి వ్యసనము తరువాత మద్యపానము అనేది ఎటువంటి మత్తును కలుగజేస్తుందంటే అది యావత్ప్రపంచమును మత్తులోకి జార్చి వేస్తుంది. అందులోను ప్రగతిశీలురని చెప్పబడుతున్న నేటి మానవులు, అలాగే మురికివాడల్లో ఆవాసముండే నిరుపేదలు అన్న తేడా లేకుండా అందరు అడ్డు అదుపు లేకుండా విపరీతముగా ఈ మత్తులో పడి జోగుతున్నారు. మత్తు, ఆనందము వంటివాటిని అందిపుచ్చుకోవటానికిగాను వీటిని సేవనము చేయుట ఆరంభిస్తారు. నెమ్మదినెమ్మదిగా అది ఆ మనుష్యులను తన మత్తుతో చిత్తుచేసి వారిని లోబరచు కుంటుంది. ప్రతి సంవత్సరము సారాయి వంటి మత్తు పానీయములు సగటున కోట్లాది లీటర్లు చట్ట బద్ధముగా తయారుచేయబడుతున్నాయి అని గణాంకములు వెల్లడి చేస్తున్నాయి. లక్షల లీటర్ల మత్తుపానీయములను ఎగుమతి కూడా చేస్తున్నారు. ఇక్కడి త్రాగుబోతుల అవసరాలను తీర్చటానికి లక్షలాది రూపాయల సరుకు దిగుమతి చేసుకొన బడుతున్నది. చట్టబద్ధమైన మత్తుపానీయముల మీద, అలాగే చట్ట విరుద్ధమైనదానిని నియంత్రించటానికి ప్రభుత్వ ఖజాన నుండి సగటున కోట్ల రూపాయలు ఖర్చుచేయబడుతున్నవి. ఈవిధముగా దేశములో చట్టబద్ధముగాను, చట్ట విరుద్ధము గాను అసామాజిక శక్తుల ద్వారా కోట్లాదిరూపాయల మత్తు పానీయముల క్రయవిక్రయములు, ఎగుమతి-దిగుమతులు సాగుతున్నవి. వాటి సరైన లెక్కను వెలుగులోకి తేవడము అసాధ్యము. ఒకవేళ ప్రభుత్వాధికారులు గణాంకములను వెల్లడించినా అవి కేవలము చట్టబద్ధముగా ఆమోదయోగ్యమైన రీతిలో తయారుచేసి ఎగుమతి, దిగుమతులు, క్రయ-విక్రయాలు చేసిన వాటి లెక్కలే తప్ప, చట్టవిరుద్ధముగా సాగించినవాటి గణాంకాలు కాదు.

మత్తుపానీయ సేవనము వలన ఏ రాష్ట్రములో నైనా సరే శ్రామికుల పనివేళలకు భంగము వాటిల్లుతున్నది. అంతే కాకుండా తత్కారణముగా జరిగే ప్రమాదాలు, అలాగే మరణించినవారి కుటుంబాలకు చేపట్టే సహాయకచర్యల నిమిత్తము కోట్లాది రూపాయలను వెచ్చించుట ద్వారా ప్రభుత్వము భారీగా ధనమును నష్టపోతున్నది. దేశములో అధిక సంఖ్యాకులు కేవలము 10-15% భాగము మత్తు పానీయములను సేవించుట వలన ప్రభుత్వమునకు కోట్లాది రూపాయలు పన్నుల రూపములో ఆదాయము సమకూరు తున్నది. త్రాగుబోతులు ఆ వ్యసనము బారినపడి కోట్లాది రూపాయలను కోల్పోతున్నారు. భారతదేశములో ఎంతమంది మత్తుపానీయాలకు దాసులై, వ్యసనపరులై ఉన్నారు అని సమీక్షిస్తే కనుక కోట్ల సంఖ్యలోనే ఉన్నారు అని గణాంకాలు తేటతెల్లము చేస్తున్నాయి. దీనిలో లక్షలమంది నిత్యము స్పృహ తప్పే స్థాయిలో త్రాగుతున్నారు. తత్ఫలితముగా వారంతా అసాంఘికకార్యకలాపాలు చెయ్యడం, దుష్కృత్యాలు ఆచరించడము చేస్తుంటే కొందరైతే ఏకంగా కారాగారములోకి చేరుకుంటున్నారు.

కోట్లాదిమంది చట్టబద్ధముగాను, చట్టవిరుద్ధముగాను నిత్యము త్రాగుతున్నారు. వారిలో లక్షలాదిమంది మితిమీరిన త్రాగుబోతులు. ఇక వీరివలన దేశ భవిష్యత్తు కేవలము నిరాశా జనకముగానే గోచరిస్తున్నది. ఈ వ్యక్తులు ఒకవేళ సగటున ప్రతినెలా 1000 రూపాయలు ఇప్పుడు ఈ వ్యసనమునకు

**పరాజయం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్తపడాలి**

వెచ్చిస్తుంటే కనుక కోట్లాదిరూపాయల దేశ సంపద ప్రతి మాసము ఖర్చవుతున్నది. ఇంతేకాకుండా ప్రభుత్వము మద్యపాన తయారీని నిరోధించటానికి, రక్షణవ్యవస్థను నిర్వహించటానికి, శిక్షణావ్యవస్థను సంబాళించటానికి, త్రాగుబోతుల ఆరోగ్యపరిరక్షణకు, వారి కుటుంబ పోషణ నిమిత్తము కోట్లాదిరూపాయల డబ్బును ప్రవహింపజేస్తున్నది. పై రీతిగా చూసినప్పుడు ప్రభుత్వము రెండురకములుగాను కోట్లాది రూపాయల లాభనష్టములను చవిచూస్తున్నది.

వైజ్ఞానికదృష్టితో ఈ వ్యసనమును గురించి వివేచన చేసినప్పుడు రోమాంచకమైన తథ్యములు ఆవిష్కృతమౌతాయి. మత్తుపదార్థములు లేక పానీయముల గురించి ఆయుర్వేద శాస్త్రము ఈవిధంగా నిర్వచించినది.

**'బుద్ధి లుమ్పతి యద్ద్రవ్యం మదకారి తదుచ్యతే"**

అనగా బుద్ధిని నశింజేసి మదోన్మత్తతను కలిగించేదే మత్తు పదార్థము!

మద్యపాన ప్రభావాలను గురించి విశ్లేషించి, సమీక్షించే అంతర్జాతీయ ఆరోగ్యపరిరక్షణ సమితి(వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నివేదిక ఇలా తెలియజేస్తున్నది. ఒకవేళ మద్యము ఉన్న సీసాలో ఒక మాంసము ముక్కను వేస్తే కనుక అది దానిలో కరిగిపోయి కొద్ది క్షణములలోనే కంటికి కనిపించని చిన్న సూక్ష్మాణువులుగా విచ్ఛినమై పోతుంది. అదేవిధముగా మద్యపానీయము రక్తములో కరిగిపోతే కనుక రక్తములో 0-2 నుండి 0-5% వరకు ఆమ్లరసము చేరుతుంది. అటువంటప్పుడు త్రాగుబోతుకు తక్షణమే మరణము సంభవిస్తుంది. అయితే ఒక ఔన్స్ త్రాగుట వలన మనిషిలో 200 కేలరీల శక్తి లభిస్తుంది, ఆకలి ఇనుమడిస్తుంది, ఉత్తేజనము కలుగుతుంది అని కొందరు వాదిస్తుంటారు. అయితే ఇది వితండవాదము మాత్రమే అవుతుంది తప్ప సత్యము కాజాలదు.

శరీరములోకి ప్రవేశించిన మత్తుపానీయము నుండి 2 నుండి 10% చెమట రూపములోనూ, ఊపిరితిత్తులు, మూత్ర మార్గము నుండి బహిర్గతమౌతుంది. మిగిలిన 90% బరువును కాలేయము స్వీకరిస్తుంది. కాలేయమునకే తీవ్రనష్టము వాటిల్లుతుంది. కాలేయమే శరీరము మొత్తానికి జీర్ణవ్యవస్థను సంబాళిస్తుంది. రక్తములోనున్న 0.03% మత్తుపానీయము మనిషి యొక్క కార్యనిర్వహణ సామర్థ్యమును దెబ్బతీస్తుంది. 0.05‘% మనిషి విశృంఖలముగా ప్రవర్తించే విధముగా వివశుడిని కావిస్తుంది. త్రాగుడు వలన రెండురకాల భావాలు చెలరేగుతాయి. 1) అతి త్రాగుడు చేత తక్షణము సంభవించే కీడు, హాని 2) కొద్ది మోతాదులో నెమ్మదినెమ్మదిగా నిరంతరము సేవించుట వలన కలిగే దుష్పరిణామములు. వీటివలన ఒకేసారిగా అతిగా త్రాగుట అన్నది 7 రెట్లు ఎక్కువ ప్రమాదములకు దారితీస్తుంది, శరీరము మొత్తము విషమయము అగుట అన్నది 30 రెట్లు, మృత్యువాత పడటము అన్నది 9 రెట్లుగా పెరుగుతాయి. (సేకరణ: ఎన్సైక్లోపీడియా బ్రిటానికా 980 - మైక్రోపీడియా 1-644) అతిగా త్రాగుట వలన మస్తిష్కములోని నాడులకు హాని కలిగిన కారణము చేత అనేక త్రాగుబోతు తగుపాళ్ళలో సమతులాహారమును స్వీకరించడు. అపరిశుభ్రత, పేదరికము, పోషణ లేకపోవుట చేత శరీరము నెమ్మదినెమ్మదిగా నీరసించి శుష్కించి పోతూంటుంది. కాలేయమునకు గొప్ప హాని కలుగుతుంది. నిత్యము కొద్ది మోతాదులో త్రాగుట వలన, ఆహారలోపము కలుగుట చేత క్రొవ్వుకణములు అక్కడ ప్రోది చెందుతుంటాయి. నెమ్మది నెమ్మదిగా త్రాగుబోతును తన పంజాలోకి తీసుకుని మృత్యు ముఖములోకి నెట్టివేస్తుంది.

మితిమీరిన త్రాగుడు వలన సగటు జీవన పరిమాణము 12 నుండి 20 సంవత్సరములకు కుదించుకుపోతుంది. బెరిబెరి, పెలెగ్రా, స్కర్వి, బలహీనత, రక్తహీనత అన్నవి వ్యసనపరుడిని నిరంతరము పట్టిపీడిస్తుంటాయి. మనోసామర్థ్యము దెబ్బ తింటుంది. శారీరక ఆరోగ్యము నిరంతరము క్షీణించి పోతూంటుంది.

త్రాగుబోతులలో ఆత్మహత్య వైపు అడుగులు వేసేవారు $2^1/_2$ రెట్లు ఎక్కువగా ఉంటారు. ప్రమాదాలు 8 రెట్లు ఎక్కువగా జరుగుతాయి. 13-29% మంది త్రాగుబోతులు పిచ్చివారి వలె వ్యవహరించిన కారణముగా 2 నెలలకు మించి పిచ్చాసుపత్రులలో బంధించి ఉంచుతారు. వీరిలో నేరప్రవృత్తి 43% పెరుగుతుంది. ఇలాంటివారి కుటుంబాలలో విడాకులు తీసుకునేవారి సంఖ్య 8 రెట్లు ఎక్కువగా ఉంటుంది.

**దేనికీ పనికిరాని వ్యక్తులంటూ ఎవరూ ఉండరు**

మత్తుపానీయ సేవనము వలన జరిగే హాని, ధననష్టము, ఆరోగ్యక్షీణత, జీవనశక్తి క్షయము, చెలరేగే మానసిక అశాంతి, సామాజిక జీవనము గతితప్పుట అన్న తిప్పలు తలెత్తుతాయని సుస్పష్టముగా చెబుతూ ఈ వ్యసనము నుండి విముక్తులగుట వలన సమృద్ధి, ఉల్లాసమనే ద్వివిధ లాభములు చేకూరుతా యని ప్రజల మనస్సులకు హత్తుకునేలా చెప్పి, అవి అమలు పరచటానికి తగిన వాతావరణమును ఏర్పరచవలెను. కుటుంబ పాలన-పోషణ, జీవితావసరములను తీర్చే వస్తుసమీకరణ, మానసికస్థాయిని పెంచే ప్రవృత్తులలో వెచ్చించబడవలసిన డబ్బు ఈ అభాగ్యుల కారణముగా శరీరమును బలహీనపరచే, మనస్సును కలుషితము కావించే, సమాజమును అల్ల కల్లోలముగా చేసే దిశలో ఖర్చుచేయబడుతున్నది. రాక్షసమైన ఈ దుర్వ్యసనము నుండి స్వయముగా తనను తాను రక్షించుకుని, ఇతరులను కాపాడేందుకు ఏ విస్తృతస్థాయి జనమానస జాగృతి ఆవశ్యకమో అది కేవలము చట్టపరమైన నియంత్రణ వల్లనే సాధ్యము కాదు. బలవంతముగా వ్యసన నిర్మూలము కావించాలని చూసినా జరుగదు. జనుల మనస్సులలో 'ఇది మానివేయుట మంచిది' అన్న వికాసము జరిగినప్పుడే ఫలితము లభిస్తుంది. ఈ ఆలోచనావిప్లవములో స్వీయ ఉత్సాహముతో ప్రయత్నపూర్వకముగా భాగస్వాములగుట అన్నది ప్రతి పౌరుని ప్రథమ కర్తవ్యము.

*- అఖండజ్యోతి, మార్చి 1981*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## సంస్కారబలం

*సంత్ ఇబ్రహీం భగవానుని భక్తి కొరకు ఇల్లు వదిలి, భిక్షాటనతో జీవిస్తూ సాధనలో ఉండేవాడు. ఒక రైతు ఇంటి నుండి భిక్ష కొరకు వేచి ఉంటే, ఆ రైతు ఇలా అన్నాడు. "మీరు యువకులుగా ఉన్నందున కష్టపడి జీవిస్తూ, మిగిలిన సమయంలో సాధన చేసుకోండి. అంతేగాని సామర్థ్యముండి కూడా భిక్షాటన చేయటం మంచిది కాదు.*

*ఇబ్రహీంకు రైతు పలికిన విషయం అర్థమై, అటువంటి సదుపదేశమిచ్చిన వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇలా అన్నాడు "సరే అలాగైతే తమరే నాకు ఏదైనా పని ఇస్తే, అది చేసుకుంటూ నిశ్చింతగా పరమాత్మ భజన చేసుకొంటాను" రైతుకు ఒక మామిడితోట ఉంది. దాని కాపలాపనిని ఈయనకిచ్చాడు. దాంతోపాటే ఆయన జీవన భృతిని కూడా ఏర్పాటు చేసాడు. ఇరువురుకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంది. చాలా రోజులు తరువాత మామిడి తోట పంటకు వచ్చిన, తరువాత రైతు వచ్చి ఒక పండిన మామిడి కాయను తెమ్మని చెప్పాడు. ఇబ్రహీం పెద్ద పండ్లును తెచ్చి ఇచ్చాడు. అవి అన్నీ పులుపుగా ఉన్నాయి. కోపగించిన రైతు ఇలా అన్నాడు "ఇన్ని రోజుల నుండి ఇక్కడుంటున్నావు ఇందులో ఏది పులుపో, ఏది తియ్యటి పండ్ల చెట్టో నీకు తెలియదా" అని అన్నాడు.*

*ఇబ్రహీం ఎంతో వినయంగా "నేను ఎన్నడూ ఏ చెట్టుకాయను రుచి చూడలేదు... మీ అనుమతి లేకుండా దొంగతనంగా ఎలా తినగలను? అని అన్నాడు. అప్పుడా రైతు ఇబ్రహీం యొక్క నిజాయితీని, బాధ్యతను గుర్తించి ఎంతో ఆనందించాడు. రైతు ఆయనతో "తమరు ఇక నుండి పూర్తి సమయం భక్తి, భజన చేసుకోండి. మీ జీవనభృతి లభిస్తూనే ఉండగలదు, మరొక వ్యక్తిని కాపలా కొరకు ఏర్పాటు చేస్తాను."*

*ఇబ్రహీం రెండవరోజు ఉదయం కాకముందే ఎక్కడకో పోబోయే ముందు ఒక ఉత్తరం వ్రాసి పెట్టివెళ్ళాడు. అందులో "మీరు ప్రారంభంలో కష్టపడకుండా తినకూడదని చెప్పారు. తమరి ఈ ఉపదేశ పాఠంతోనే నాలో శ్రద్ధ పెరిగింది. మరి ఇప్పుడు వ్యతిరేకంగా తమరు ఉపదేశం ఇస్తున్నారు. ఊరకనే తినమంటే ఎలా సాధ్యం? తమరి ఈ మార్పు చెందిన పాఠం చూసి ఇక వెళ్ళటమే ఉత్తమమనిపించింది. సంస్కారాల బలంతో సరైన మార్గంలో నడచేవారు ఎన్నడూ పొరబడరు.*

*- అఖండజ్యోతి, ఆగస్టు 2001*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

---

**మీపై మీరు నమ్మకం పెంచుకోవాలి**

కుటుంబ నిర్మాణం

# సుఖమయ దాంపత్యజీవనం ఎలా సాధ్యం?

మన భారతీయ సంస్కృతిలో దాంపత్యజీవనానికి చాలా మహత్వపూర్ణ స్థానమున్నది. ఈ జీవితము ద్వారానే సమాజము పుష్పించి, వికసిస్తుంది. దేశానికి భావితరాలవారు లభిస్తారు. జనజీవితానికి పోషణ లభిస్తుంది. అందుచేత దాంపత్యజీవనం మధురంగా ఉండడం చాలా అవసరం. కానీ చూస్తుంటే అందులో మాధుర్యం తక్కువగాను, కాలుష్యం, కాఠిన్యం ఎక్కువ గాను కనిపిస్తున్నాయి. దాని కారణంగా ఇళ్ళల్లో గొడవలు, కొట్లాటలు, భార్యాభర్తల మధ్య వేరుపడే స్వభావం పెరుగు తున్నది. కుటుంబం ఇలా చిందరవందరైపోతే పిల్లలు అనాథ లౌతారు. దాంపత్య జీవితంలో మాధుర్యాన్ని నింపేందుకు చిన్నిచిన్న విషయాలను గుర్తుంచుకొని పాటిస్తే మాధుర్యం పెరగడమే కాక జీవితం ఆనందంగా గడుస్తుంది.

దాంపత్యజీవితంలో ప్రతివ్యక్తికి తనదైన జీవితం ఒకటి ఉంటుంది. వారు తమ అలవాట్లు, అభిరుచులు, వ్యవహారాలు, దృష్టికోణము వంటి కొన్ని అంశాలలో కొద్దికాలం పాటు మార్పు తెచ్చుకోవచ్చునేమో కానీ శాశ్వతంగా మార్చగలగడం మాత్రం చాలా కష్టం. ఈ కారణంగానే కొద్దిరోజుల పాటు మాత్రమే ఈ జీవితాన్ని అవతలివారు భరించగలుగుతారు. కాలం గడిచేకొద్దీ నిభాయించలేక మనస్సు విరిగి పోతుంటుంది. అందుచేత తప్పనిసరిగా చేయాల్సింది ఏమంటే కలిసి ఉంటూ కూడా ఒకరికొకరు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. దానివల్ల ఒకరినొకరు అర్థం చేసుకో గలుగుతారు. గడిచిన కాలం గురించి మాట్లాడుకుంటారు. ఆత్మమంథన, చింతన చేసుకొని తమకు నచ్చినట్లు జీవిం చేందుకు సరిదిద్దుకుంటారు.

ఒకరికొకరు సమయాన్ని కేటాయించుకుంటే దాంపత్య జీవితంలో నూతనత్వం వస్తుంది. ఒకరిని గురించి మరొకరు ఒక క్రొత్త విధానంలో తెలుసుకొని, అర్థం చేసుకొని జీవించేందుకు స్థిరపడతారు. సమయం కేటాయించడం అంటే ఒక మూసలో గడుస్తున్న జీవితం నుండి ప్రక్కకు తొలిగి జీవించడం లేదా ఔటింగ్ పేరుతో కాసేపు బైట తిరిగిరావడం. ఒకేరకమైన జీవితాన్ని గడపడం వల్ల వ్యక్తిలో అసంతృప్తి పెరిగిపోతుంటుంది. అతను అందులో క్రొత్తదనాన్ని నింపాలను కుంటాడు. అందులో భాగంగానే భారతీయసంస్కృతిలో ఆడ పిల్లలు పుట్టింటికి వెళ్ళడం, మగపిల్లలు అత్తారింటికి వెళ్ళడం లాంటి ఆచారాలు ఏర్పరిచారు. అలా మధ్యలో కొద్దిరోజులు బైట తిరిగి వస్తూ ఉంటే బంధాల్లో తాజాదనం, నూతనత్వం వెల్లివిరుస్తుంది.

దాంపత్యజీవితంలో నిజాయితి చాలా అవసరం. దీని వల్ల విశ్వాసం ఉత్పన్నమౌతుంది. మాటల్లో నిజాయితి, పనుల్లో నిజాయితి, చేసిన వాగ్దానాలు నిలబెట్టుకోవడం వంటి పనుల ద్వారా బంధాలు గట్టిపడతాయి. దీని వల్ల వ్యక్తిత్వం కూడా వికసిస్తుంది, శక్తివంతంగా కూడా మారుతుంది. దంపతులు ఒకరికొకరు చక్కగా అర్థం చేసుకోవాలి అంటే ఒకరి భయాలను, అనుమానాలను మరొకరితో స్వేచ్ఛగా పంచుకోగలగాలి. మనస్సు విప్పి మాట్లాడుకుంటే ఎటువంటి సమస్యలైనా చాలా త్వరగా పరిష్కరింపబడతాయి. ఎందుకంటే చాలా విషయాల్లో అభిప్రాయబేధాలు వస్తుంటాయి. అవి వచ్చినా, రాకపోయినా మనోభేదాలు మాత్రం రాకూడదు.

కానీ మనుషులకున్న అలవాటేమిటంటే ప్రపంచంపై ఎన్నో ఆరోపణలు చేస్తూ సమయానుకూలంగా వాటిని తమకు తగిన విధంగా మార్చుకుంటారు. ఇది వ్యక్తిత్వంలోని లోపమే. సాధారణంగా మనం ఎదుటివారి లోపాలను మాత్రమే చూస్తాము కానీ వారి మంచి గుణాలను చూడము. అలాంటి ఆరోపణలన్నింటినీ మనలోనే ఉంచుకోవడం మంచిది. లేకపోతే మనలోను అసంతృప్తి, విసుగుస్వభావం పెరిగిపోతుంది. ప్రతిరోజు చేసే ఆరోపణల వల్ల జీవితంలో సంతోషానికి చోటుండదు. అందువల్ల ఆ అలవాటును మార్చుకోవాలి.

తరచుగా పిల్లల మాటలు పట్టుకొని దంపతులు గొడవలు పడుతుంటారు. ఇలా గొడవపడేవారిని అపరిపక్వ మానసికస్థితి ఉన్నవారిగా మనోవైజ్ఞానికులు గుర్తించారు. సామాన్యంగా పిల్లలకు తాము అనే ఏ మాటల వల్ల పెద్దవారి మధ్య గొడవలు వస్తాయో, వేటి వల్ల గొడవలు రావో తెలుసుకోలేరు. అందువల్ల పెద్దలు పిల్లల మాటలను వారి దృష్టితోనే విని, పరిపక్వమైన దృష్టితో పరిష్కరించాలి. చిన్నపిల్లల మాటలు పట్టుకొని బంధా లలో చేదుని నింపుకోకూడదు.

**క్రిందపడిన వారిని పైకిలేపే ప్రయత్నం చేయాలి**

జీవితం పట్ల వ్యతిరేక దృష్టికోణం, ఆలోచనలు పెంచు కుంటూ పోతే చక్కని జీవితాన్ని చేతులారా పాడుచేసుకున్న వారమవుతాము. సకారాత్మక దృష్టికోణం అలవరుచుకోవడం వల్ల తెగిపోయిన బంధాలు కూడా దగ్గరై, మాధుర్యంతో నింప బడతాయి. అందుచేత సకారాత్మక దృష్టితోనే దాంపత్యజీవితాన్ని గడపడం నేర్చుకోవాలి. పొరపాటునో, తెలియకనో వ్యతిరేక ఆలోచనలు ఉన్నా వెంటనే మార్చుకోవాలి. ఎందుకంటే దాంపత్యజీవితానికి ఆహారము, నీరు అందించే బాధ్యత సకారాత్మక ఆలోచనలకి మాత్రమే ఉంది, వ్యతిరేక ఆలోచనలు ఆ జీవితాన్ని శూన్యంగా మార్చి అంతం చేస్తాయి.

జీవితంలో మంచి, చెడు పరిస్థితులు రెండూ వస్తాయి. మంచి క్షణాలు వచ్చినప్పుడు వాటిని సంపూర్ణంగా ఆస్వాదించాలి, హాయిగా ఉండాలి. చెడు పరిస్థితి ఎదురైనప్పుడు ధైర్యం కోల్పో కుండా ఇద్దరు కలిసి ఆ పరిస్థితిని అధిగమించాలి. ఫలానా రోజు మాత్రమే సంతోషించాలి అని ఎదురుచూడకుండా చిన్న చిన్న విజయాలను కూడా సంపూర్ణంగా ఆనందించగలగాలి.

దాంపత్యజీవితమనే నావ విశ్వాసం ఆధారంగానే సాగు తుంది. ఆ విశ్వాసానికి చిల్లు పడకుండానే ఉండాలి. లేదంటే బంధాలను నిలుపుకోవడం చాలా కష్టమౌతుంది. కనుక దాంపత్యమనే నావ అటూ, ఇటూ ఊగే స్థితిని ఉత్పన్నం చేసే పనులేవీ చేయవద్దు. దంపతుల మధ్య ఉండే ప్రేమ, విశ్వాసము ఇంకా బలపడుతుంది. ఇరువురి ఆలోచనలు ఒకటి కాకపోయినా నమ్మకం దాంపత్యజీవితాన్ని గట్టి బంధంతో బంధిస్తుంది. అందువల్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యమని విశేషజ్ఞుల అభిప్రాయం కూడా. వారిరువురి మధ్య వచ్చే ఎడబాటు వల్ల వారిరువురే కాక మిగిలిన వారి విశ్వాసం కూడా మటుమాయ మవుతుంది.

దాంపత్యజీవితాన్ని సుఖంగా. మధురంగా ఉండేలాగా చేయాలంటే ముందు బయటి పనులలో ఒకరికొకరు సహకరించుకోవాలి తప్ప లోపాలను ఎత్తి చూపుకోకూడదు. ఎదుటివారి నుండి ఎక్కువగా ఏదో పొందాలని ఆశించ కూడదు. తప్పులను క్షమించాలి. సహనంగా ఉంటూ సకారాత్మక ఆలోచనల వైపే దృష్టిని ఉంచాలి. ఇవి చాలా చిన్న విషయాలే కానీ ఆచరిస్తే మనకు అనుకూలమైన మార్పును పొందేందుకు దోహదపడతాయి.

*– అఖండజ్యోతి, డిసెంబర్ 2015*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## వీరసావర్కర్

*వీర సావర్కర్ భారతమాతను దాస్య శృంఖలాల నుండి విడిపించాలని నిశ్చయించుకొన్నాడు. అందుకోసం ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. తుదకు ఈయన మీద అనేక కేసులు బనాయించబడ్డాయి. ఉరిశిక్ష కూడా విధించబడింది. ఆ సమయానికి ఈయన ఇంగ్లండ్‌లో ఉండటం వలన ఉరిశిక్ష భారతదేశంలోనే అమలు జరగాలని, దానితో భారతదేశ ప్రజలు బుద్ధి తెచ్చుకుంటారని బ్రిటిష్‌వారు భావించారు. వీరసావర్కర్‌ను ఓడలో తీసుకొని వస్తుండగా ఆయన తన ఉరిశిక్షను తన దేశ ప్రజలు కళ్ళారా చూచి కలత చెందుతారని, ఆ బాధ వారికి కలుగనీయరాదని ఆలోచించి నడిచే ఓడ నుండి సముద్రంలోకి దూకారు. ఈ సాహసం దేశవాసుల్ని ఉత్తేజితుల్ని చేసింది. ఈ సంఘటన వేలాది వీరసావర్కర్లను ఉద్భవింపజేసింది. తరువాత బ్రిటిష్ ప్రభుత్వం కేసులు విచారణ జరిపి, ఈయనకు అజీవన కారాగార శిక్ష విధించింది. ఈయనను ప్రమాదకరమైన వ్యక్తిగా భావించి గట్టి సంకెళ్ళతో బంధించారు. మూడు సంవత్సరాలు ఈయన ఘోరయాతనకు గురియైనాడు. స్వాతంత్ర్యానంతరం విడుదలై వచ్చిన వీరసావర్కార్‌ను చూసి ప్రజలు పట్టరాని ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. ఈయన రెట్టింపు ఉత్సాహంతో శేష జీవితాన్నంతను దేశ స్వాతంత్ర్యాన్ని సార్థకం చేయటానికి ధారపోశారు. ఇలాంటి బిడ్డలను కనటం వల్లనే భారతమాత ధన్యురాలై ఇప్పటికీ తన కృపావర్షాన్ని కురిపించకుండా ఊరుకోలేకపోతోంది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరి సావిత్రి*

**మన స్వార్థం కంటే ఇతరుల మేలు ముందు గుర్తుంచుకోవాలి**

# సాఫల్యమునకు అత్యవసరమైనది ఒక బలమైన టీమ్

పనిని ఒక్కరే చేయవచ్చు లేదా సమూహాము కలిసి చేయ వచ్చు. అయితే కొన్ని పనులు అందరినీ కలుపుకోకుండా చేయడానికి వీలుపడదు. వ్యక్తి ఒక్కడే అయినా ఒకే సమయంలో అనేక పనులు పూర్తిచేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఇందుకొరకు ఒక చిన్న టీమ్ యొక్క అవసరం ఉంటుంది. ఒక మంచి టీమ్ ఏ సంస్థనైనా ఉన్నత స్థితికి ఎదిగేందుకు తోడ్పడుతుంది. టీమ్‌ని తయారుచేయాలంటే టీమ్‌లీడర్ అవసరం ఎంతైనా ఉంది. లీడర్ ఆధ్వర్యంలోనే టీమ్ పని ప్రారంభిస్తుంది, మిగిలినవారు సహాయకులు అవుతారు.

టీమ్‌ని తయారుచేయడంలో లీడర్‌ది ప్రధాన పాత్రే అయినా కార్యసఫలత యొక్క కీర్తి మాత్రం మొత్తం టీమ్‌కి దక్కుతుంది. ఎందుకంటే వారంతా కలిసి చేస్తేనే పని పూర్తవుతుంది. అంతే కాదు ఆ పని చేసే వ్యక్తులకు పని మీద ఉండే సమర్పణాభావం వల్లనే విజయం లభిస్తుంది.

ఏ సంస్థకైనా పనిలో విజయం సాధించేందుకు టీమ్‌ని తయారుచేసుకోవడమే ముఖ్యమైన పని. ఆ తరువాతనే క్రింది స్థాయి ఉద్యోగుల నియమాకం జరుగుతుంది. ఎంపిక చేసిన టీమ్‌లో వివిధ పదవులు, హోదా కలిగినవారు సభ్యులుగా ఉండవచ్చు. సభ్యులు ఎవరైనా, పని వేరైనా వారి పాత్ర మాత్రం టీమ్‌కు చాలా విలువైనది. తమ పనిని ఎవరు అశ్రద్ధ చేసినా, నిర్లక్ష్యం చూపించినా ఆ ప్రభావం మొత్తం టీమ్‌మీద పడుతుంది. అందువల్ల వారికి ఎప్పటికప్పుడు ప్రశిక్షణ ఇవ్వడం, తమ లక్ష్యాలను, ఉద్దేశ్యాలను వివరించడం చేస్తూ ఉండాలి. టీమ్‌ను ఉత్సాహపరుస్తూ వారు పనిని అంకితభావంతో చేసేలా ప్రోత్సహిస్తుండాలి. లేకపోతే పని చాలా నిమ్నస్థాయిలో జరుగు తుంది.

టీమ్‌లో పనిచేస్తున్న సమయంలో సభ్యుల మధ్య సామరస్యము, కలుపుగోలుతనము, నమ్మకము ఉండడం చాలా అవసరం. లేదంటే టీమ్‌లో గొడవలు, వారిలో వారే పోటీ పడటం వంటి సమస్యలు తలెత్తుతాయి. అది టీమ్ చేసే ప్రదర్శనపై చాలా ప్రభావం చూపిస్తుంది. బండిలో కూర్చున్నప్పుడు డ్రైవర్‌పై మనకు నమ్మకం లేకపోతే ప్రయాణాన్ని ఆస్వాదించడం అసంభవం. ఒకరిపై మరొకరికి నమ్మకం టీమ్ సభ్యులకు చాలా అవసరం. తమ కార్యకుశలతను అనుక్షణం ప్రదర్శిస్తూ, లోటుపాట్లు దిద్దుకుంటూ వారు ముందుకు సాగాలి. వారిలో సహకారమనేది లేకపోయినా, విజయం యొక్క కీర్తిని ఇతరులతో పంచుకోకుండా అంతా తమకే దక్కాలనే భావమున్నా ఇక ఆ సంస్థ అనుకున్నంత ప్రగతిని సాధించలేదు.

సభ్యుల యొక్క కార్యకుశలత మీదనే టీమ్ యొక్క విజయం ఆధారపడి ఉంటుంది. టీమ్‌లోని సభ్యులు పనులను సమర్థ వంతంగా, చాకచక్యంగా చేయడం నేర్చుకోవాలి. ఇంతేకాదు తమ దక్షతను పెంపొందించుకుంటూ ఉండాలి. అప్పుడే వారు మరి ఇతర బాధ్యతలు చేపట్టగలగడమే కాక సభ్యులు ఎవరైనా హాజరు కానప్పుడు వారి పనిని కూడా సమర్థవంతంగా పూర్తి చేయగలుగుతారు.

టీమ్ బలంగా ఉందా లేక బలహీనంగా ఉందా అనేది క్రింది విషయాల ఆధారంగా తెలుసుకోవచ్చు. బలహీనమైన టీమ్ యొక్క ప్రదర్శన తప్పులు, తడకలతో నిండి ఉంటుంది. ఆ సభ్యుల మధ్య భావసంవేదనలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. సభ్యులలో ఉత్సాహం చప్పబడితే పనులు, వాటి ఫలితాల మీద వ్యతిరేకపు ఆలోచనలు మొదలవు తాయి. అవి ఉద్యోగులలో అభద్రత పెంచి వారు సంస్థను వదిలివెళ్ళేలా చేస్తాయి. అలాకాక బలమైన టీమ్ యొక్క లీడర్ తన క్రింద పనిచేసే సభ్యులకు అప్పగించే కార్యప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని వారి సామర్థ్యానికి అనుకూలమైన పనులను అప్పగించి వారివారి బాధ్యతలను గురించి అవగాహన కల్పిస్తాడు. అవసరమనిపించినప్పుడు పనుల రీతి-నీతులలోను, కార్యప్రణాళికలోను మార్పులు చేర్పులు చేసేందుకు కూడా వెనుకాడడు.

ఒక బలమైన టీమ్ సభ్యుల మధ్య తమ పనులు, తత్ఫలితాల పట్ల ఒక సకారాత్మక దృష్టికోణము, భరోసా అనేది ఉంటుంది. వారు తమ కొరకు ఏమైనా చేస్తారు. అటువంటి బలమైన టీమ్‌లోని సభ్యులలో ఎవరైనా బలహీనపడితే మిగిలిన వారు వారిని సమర్థించుకోగలుగుతారు. వారి బలహీనతను

**మధురమైన మాటలతో కలహం దరిచేరదు**

దూరం చేసేందుకై అవసరమైన ప్రయత్నాలు చేస్తారు. ఒక బలమైన సమూహములో సంఖ్య తక్కువైనా వారు ఎంత కఠినమైన కార్యమునైనా పూర్తిచేసే సామర్థ్యాన్ని, సమర్థతను కలిగి ఉంటారు.

చరిత్రలో ఇటువంటి బలమైన సమూహాల విజయాలకు సంబంధించిన ఉదాహరణలెన్నో ఉన్నాయి. మహాభారత యుద్ధంలో కౌరవసేన కంటే పాండవసేన సంఖ్య తక్కువ. సంఖ్యేకాదు కౌరవసేనకున్నంత శక్తిసామర్థ్యాలు కూడా పాండవ సేనకు లేకపోయినా విజయం వారినే వరించింది. ఇందుకు కారణం వారు తాము నమ్మిన ధర్మమార్గంలో నడవడమే. దానితోపాటే వారికున్న యుద్ధనీతి కుశలతతో పాటు ఆ కార్య భారాన్ని, సహకరించే భారాన్ని ఒక యోగ్యమైన వ్యక్తికి అప్పగించడం. యుద్ధంలో సమయానుకూలంగా నీతిని మార్పు చేసుకోవడమే కాక సామ, దాన, భేద దండోపాయాలను కూడా ప్రయోగించడం జరిగింది. బలహీనతలను వీరు పూర్తిగా ఉపయోగించుకున్నారు. తమకుండే బలహీనతలను దూరం చేసుకొని వాటిని శక్తిగా మార్చుకోవడంలో కూడా వారు సఫలీకృతులైనారు.

ఇదేవిధమైన తారతమ్యం రామరావణ యుద్ధంలో కూడా కనపడుతుంది. ఒక ప్రక్క కోతులు, ఎలుగుబంట్లతో కూడిన రాముని యొక్క వానరసేన, మరొక ప్రక్క అమిత పరాక్రమ వంతులైన రావణుని రాక్షససేన. వానరసేన వద్ద ఎటువంటి ఆయుధాలు లేవు. వారు చెట్లు, గదలతోనే యుద్ధం చేశారు. అయినప్పటికీ విజయం సాధించారు. యుద్ధం చేయాలంటే ఎవరి ముందుకు ఎవరు వెళ్ళాలి, అవతలి వారి శక్తిసామర్థ్యాలు, శక్తుల ప్రయోగాలకు ఎప్పుడు, ఎలా సమాధానం చెప్పాలి? రాబోయే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి, మున్ముందు అనుసరించవలసిన రణనీతి ఎలా ఉంటుంది? ఉత్సాహమును నిరంతరం ఎలా పెంచుకుంటుండాలి? అనే అంశాలన్నింటిని ప్రతిక్షణం గమనించుకోవలసిందే! రాముడు అత్యంత సమర్థుడు, శక్తిశాలి, ఏమైనా చేయగలడు. కానీ విజయం లభించినప్పుడు ఆ కీర్తినంతటిని వానరసేనకే అంకితం చేశాడు. మన జీవితం కూడా ఒక యుద్ధం లాంటిదే. ఇక్కడ కూడా యుద్ధభూమిలో ఉండేలాంటి పరిస్థితులే ఉంటాయి. అందువల్ల యుద్ధ సమయంలో పాటించవలసిన జాగ్రత్తలన్నీ ఇక్కడ కూడా పాటించవలసిందే! ఎలాగంటే కార్యనీతి, కార్యప్రణాళిక, కార్యనిర్ధారణతో పాటు సమర్థులైన, యోగ్యులైన వ్యక్తులను ఎంచుకొని వారికి కార్యభారం అప్పచెప్పడం, వాటిని పరిశీలించడం, అవసరమను కున్నప్పుడు ప్రదర్శించడం, తత్పరిణామాలు, ప్రభావాలను గురించి ఆలోచించడమనే అంశాలు చాలా ఉంటాయి.

ఏ టీమ్ విజయమైనా అందులో సభ్యులు, ఇతరులపైనా ఆధారపడి ఉంటుంది. అటువంటి స్థితిలో సంవేదనలు కలిగి ఉండడం చాలా అవసరం. ఎందువల్లనంటే భావముల ద్వారానే మనం ఒకరితో ఒకరం కలిసి ఉన్న అనుభూతిని పొంద గలుగుతాము. సంవేదనల వల్ల వాతావరణం కూడా చక్కగా మారుతుంది. 'మన' అనే భావం ఉప్పొంగడం వల్ల టీమ్‌లోని సభ్యులు పనులను ఏకాగ్రతతో చేయగలుగుతారు. అందువల్ల ఏ సంస్థల వారైనా తమ టీమ్‌లోని సభ్యులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. వారి యోగ్యతలను పెంచడం మీదనే దృష్టి కేంద్రీకరించాలి. వారి సామర్థ్యాలను, శక్తులను తెలుసుకొని సరైన విధంగా ఉపయోగించుకోవాలి.

*– అఖండజ్యోతి, డిసెంబర్ 2015*

*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## మలయ పవనం - తుఫాను

*మలయపవనం తుఫానుతో, 'నేను ఎక్కడికి వెళ్ళినా ప్రజలు నాకు స్వాగతం పలికి గౌరవిస్తారు. నీ ఉనికి మాత్రం బొత్తిగా కిట్టదు. నిన్ను చూచి భయపడి తలుపులు వేసికొంటారు. మన లక్ష్యం లోకమంగళమే అయినా ఈ భేదం ఎందుకు' అని ప్రశ్నించింది. దానికి తుఫాను, 'సోదరీ నీ ఉపయోగం నీది. నా ఉపయోగం నాది. ఎక్కడ చూసినా కలుషిత వాయువు, చెత్తాచెదారం, మురుగు పేరుకుపోతూ ఉన్నాయి. ఒక్కొక్క చోట ప్రాణవాయువు తగ్గిపోతోంది. వాటి నివారణ నీ వలన సాధ్యంకాదు. అందుకే ఒక్కొక్కసారి నాకు విజృంభించక తప్పటం లేదు. నీవు ప్రజలకు సాంత్వన మిస్తావు. నేను నిస్పృహను కలుగజేసే వికారాలను నివారి స్తాను. లోకకళ్యాణానికి ఈ రెండూ అవసరమే! నీ సౌజన్యం, నా పరాక్రమం వేటి స్థాయిలో అవి సమాజానికి కావాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి


*అనువాదం: శ్రీమతి నేమాని గౌరి సావిత్రి*

**మాటలు తేనెవలె తియ్యగా ఉండాలి**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే-3

***ఆధ్యాత్మికత కూడ రొక్కబేరంవలె శక్తివంతమైనది. మార్కెట్‌లోకి వెళ్ళి డబ్బులివ్వంగానే మనకు కావలసిన వస్తువు మన చేతిలోకి వస్తుంది, దాన్నే రొక్కబేరం అంటారు అని పూజ్యగురుదేవులు ప్రవచించినట్లు గత సంచికలో చదివి ఉన్నారు. ఆధ్యాత్మికతను జీవితంలో అమలుచేయగలిగితే ఫలితం శీఘ్రంగా హస్తగతమౌతుంది. అంతేకాదు ఆధ్యాత్మికమార్గం కల్పవృక్షం వంటిది. మానవుడు సరియైన దృష్టికోణాన్ని అలవరచుకొనగలిగితే కల్పవృక్షంవలె సృష్టిలోని సమస్త సంపదలకు అతడు యజమాని కాగలడు. నిజమైన ఆధ్యాత్మికతను అనుసరించగలిగిన మనిషిని "ఆప్తకాముడు" అంటారు. గొప్పగొప్ప కోరికలేమీ కోరుకొనకుండా కేవలం తన జీవనయానానికి అవసరమయ్యేటంత ధనాన్ని మాత్రమే సంపాదించుకునే వ్యక్తిని ఆప్తకాముడు అంటారు- అని కూడా పూజ్యగురుదేవులు తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం.***



### సిద్ధి అని దేనిని అంటారు?

ఆప్తకాములు మాత్రమే ఇతరుల కోర్కెలను నెరవేర్చగలరు. మేము మా అవసరాలను తీర్చుకొనడమే కాక; మీ అవసరాలను కూడా తీర్చ గల సమర్థులం. దీనినే మేము సిద్ధి అంటాము. గారడీ వేరు, సిద్ధి వేరు. గారడీ చేయడాన్ని మేము ఖండి స్తాము. గారడీ చూపించడమే ఆధ్యాత్మికతకు చిహ్నంగా తలచేవారిని మేము అల్పులుగా భావిస్తాము. "తలలోనుంచీ పాముని తియ్యండి, అఱచేతిలో ఏలకులను సృష్టించండి" అని అడిగేవారు పసిపిల్లలవంటి మనస్తత్వం కలిగినవారుగా, చాలా హీనులుగా భావించాలి. మీరు నానుండి అలాంటి చమత్కారాలను ఆశిస్తే, మిమ్మల్ని శిష్యులుగా స్వీకరించలేము సరిగదా అటువంటి ఆధ్యాత్మికతను కూడా ధిక్కరిస్తున్నాము. మూర్ఖులు, ధూర్తులు అయినటువంటి ప్రజలు ఈ గారడీలు, అద్భుతాలను ఆధ్యాత్మికత అనుకొని భ్రమపడుతున్నారు. గుడ్డివారికి కుష్ఠువాడు జతకలసినట్లుగా ఉంటుంది ఈ మూర్ఖుల కలయిక.

### గాయత్రీమంత్రానికి ఉన్న ఐదు సిద్ధులు

గాయత్రీమంత్రం ద్వారా పొందగలిగే ఐదు సిద్ధులు మాకు లభించినవి. గాయత్రికి ఐదు ముఖాలు, ఐదు కోశాలు, ఐదుగురు దేవతలు ఉంటారు. వీరందరి ద్వారా వచ్చే సిద్ధులను పొందిన మేము "ఆప్తకాములం" కాగలిగాం. మేము శ్రమపడి సంపాదించుకున్న మా తెలివిని, సంపాదనను మేము ప్రజాహితం కోసమే ఉపయోగపడే విధంగా వెచ్చించాము కానీ అనుభవించటానికో, దాచుకోవటానికో సంపాదించలేదు. సంపాదన వల్ల మాకు దానిని జాగ్రత్తపరచ వలసిన బాధ కాని, బాధ్యతలు కాని, మరే ఇతర క్లేశములు గానీ కలుగలేదు. మేము బుద్ధినీ, తెలివినీ, శ్రమనూ, తద్వారా తపస్సునూ సంపాదించు కున్నాము.

కానీ మేము సంపాదించిన ప్రతి ఒక్క పైసాను, ప్రతి ఒక్క వస్తువును అత్యంత శ్రేష్ఠమైన రీతిలో ఉపయోగించడానికే శ్రమించాము కానీ అనుభవించడానికి వాడలేదు. మా యొక్క యావత్ సంపద ఉపయోగించడానికే కాని, అనుభవించటానికి కాదు. మా శరీర సుఖం కోసం, మా సంతోషం కోసం, మా పిల్లల సుఖసౌకర్యాల కోసం ఉపయోగిస్తే అది అనుభవించడ మవుతుంది. కానీ మేము ఎన్నడూ అలా అనుభవించలేదు. ఎవరికి ఏది అవసరమో వారికి దానిని అందించడమే మా కర్తవ్యంగా భావించాము.

### అనుభవించడానికి కాదు, ఉపయోగించడానికి సంపాదించండి

"నేను సంపాదించినదంతా నా ముగ్గురు బిడ్డలకు

**తియ్యగా మాట్లాడేవారికి ప్రతి విషయంలో విజయం లభిస్తుంది**

సమానంగా వ్రాసిచ్చాను. ఈరోజు ఒక పెద్ద పని పూర్తిచేశాను" – అని మీరు సంతోషపడితే అది చాలా ఘోరమైన తప్పిదం. మేము శ్రమించి సంపాదించుకున్న ఈ సంపదలన్నీ మేము అనుభవించిన తర్వాత మా పిల్లలకు తప్ప మరెవ్వరికీ ఇవ్వము అని చాలామంది తాపత్రయపడుతుంటారు. మనం సంపాదించి నదంతా మన నెత్తిన ఉంచుకున్న మూటవలె భారమై కూర్చుం టుంది. పామువలె పడగవిప్పి మనమీదనే ఆడుతుంది. శ్రమించి సంపాదించుకొనగలిగిన అర్హత ఉన్న మన సంతానానికి మనం ధన సంపదలను వారసత్వంగా ఇస్తున్నాము అంటే అది వారిని నాశనం చేయటమే అని తెలుసుకోవాలి.

ఈనాడు ప్రపంచంలో ఎంతమంది దుర్మార్గులు, మోసగాండ్రు విచ్చలవిడిగా బ్రతుకుతున్నారో దానికి కారణం వారి తల్లిదండ్రులే. ఆ తల్లిదండ్రులు డబ్బు సంపాదించి, కూడ బెట్టి, దాచిపెట్టి తమ సంతానానికి అప్పగించటం వల్లనే వారంతా పనిదొంగలుగా, దోషులుగా, దుర్మార్గులుగా తయారవుతున్నారు. వాళ్ళే కనుక శ్రమించి, చెమటోడ్చి, పని చేసుకొని డబ్బు సంపాదించుకుంటే వాళ్ళకు ఆ సంపాదనలోని ప్రతి ఒక్క పైసాకు విలువ తెలుస్తుంది. అప్పుడు వాళ్ళు తాగు బోతులుగా, జూదరులుగా, దుర్మార్గులుగా తయారయ్యేందుకు అవకాశం ఉండేది కాదు. కాబట్టి కొడుకు మోసగాడుగా, దుర్మార్గుడుగా తయారయ్యాడంటే అందుకు వాడి తండ్రే కారణం.

"పిల్లవాడిని కష్టపడి పని చెయ్యమని చెప్పకుండా, వాడికి ఏమాత్రం బాధ కలుగకుండా నేనే జీవితాంతం శ్రమపడి ధనరాశులు జమచేసి ఇస్తాను, వాడు ఏడుతరాల పాటు కాలుమీద కాలు వేసుకొని కూర్చుని తినే విధంగా" అని ఆలోచించే తండ్రులే ఈ సమాజాన్ని నాశనం చేస్తున్నారు. దీనినే అనుభవించటం అని అంటారు. ఇక అనుభవించడం కాకుండా ఉపయోగించడమంటే ఏమిటో తెలుసుకుందాం. ప్రజలకు ఎక్కడ ఏ అవసరమున్నదో అక్కడ ఆ అవసరాల కనుగుణంగా మన బుద్ధిని, జ్ఞానాన్ని సంపాదనను, శ్రమను ఉపయోగించగలిగితే అప్పుడు మనకున్న ఆ సంపద సద్వినియో గమైనట్లుగా భావించాలి. మేము సంపాదించుకున్న ధనం, జ్ఞానం, శ్రమ అన్నీ కూడా అవి చేరవలసిన చోటుకు చేరుకున్నాయి కాబట్టి మేము తృప్తితో, సంతోషంతో జీవించగలుగుతున్నాం. మేము సంపాదించుకున్నదేదైనా ఉంటే అది సిద్ధికోసమో, స్వర్గం కోసమో కాదు. "నత్వహం కామయే రాజ్యం న సౌఖ్యం న పునర్భవమ్!"

## మా తపస్సును లోకకళ్యాణం కోసమే వినియోగించాము

మేము సాటి మానవుల కన్నీరు తుడవటం కోసమే మా తపశ్శక్తినంతా ధారపోశాము. ప్రస్తుతం మా వద్ద ఏలాంటి శక్తి లేదు. రిక్తహస్తాలతో భగవంతుని సన్నిధికి చేరుకుంటున్నాము. ఐనా మా హృదయం ఆనందంతో నిండి ఉన్నది. శాంతి, సంతోషం, ఉల్లాసములతో నిండిన మనస్సు మాకు ఎంతో సంతృప్తిని కలిగిస్తున్నది. చేసిన తపస్సుకు సిద్ధిని పొంది కూడా ఎవ్వరికీ ఏలాంటి సహాయం చేయకుండా ఉన్నట్లైతే ఇంతటి ఆనందం కలిగి ఉండేది కాదేమో!

## భక్తుడైనవాడు కరుణామయుడు అయితీరుతాడు

మీ హృదయంలో భక్తి అనేది ఉత్పన్నమైతే దానితోపాటే "దయ–కరుణ" అనేవి కూడా అవశ్యం మీలో వచ్చి చేరతాయి. కరుణ నిండిన హృదయంలో బండరాయి వంటి మనస్సుకు చోటుండదు. బండరాతి వంటి కఠినహృదయం కలిగి, ఇతరుల దుఃఖాన్ని చూసి స్పందించని వాడెవడుంటాడో వాడు సంపన్నుడు కాగలడు. ప్రచారం కోసమో, పేరు ప్రఖ్యాతులు పొందటానికో కొంత డబ్బును విరాళంగా ఇచ్చే వ్యక్తులు కూడా "దయా హృదయం" కలిగి ఉంటారని చెప్పలేము. దయ, కరుణలు అవసరమైన చోట, బాధా నివారణకు తప్పనిసరిగా ధనము అవసరమైనప్పుడు, యావత్ దేశము–మానవ సమాజము హాహాకారాలు చేస్తున్నప్పుడు కూడా నీవు సహాయం చేయలేనంత కఠినమైన రాతి హృదయమా నీది?

## దృష్టికోణాన్ని సంస్కరించుకోనడం ద్వారా ఆప్తకాములం కాగలము

భక్తి మీ జీవితంలోకి ప్రవేశించినదీ అంటే ఇక మీ వద్ద సంపద పోగుపడదు. దానిని మీరు ఇతరులకు పంచితీరుతారు. మీరు మీ శ్రమను, సమయాన్ని, బుద్ధిని, జ్ఞానాన్ని అందరికీ పంచి వేసి రిక్తహస్తాలతో మిగిలిపోతారు. ఇటువంటి దృష్టి కోణాన్ని ఏర్పరుచుకున్నవారే ఆప్తకాములు కాగలరు. వస్తు సంపదను సంపాదించవలసిందే. కానీ వాటిని అనుభవించ దానికి తాపత్రయపడనివారినే "ఆప్తకాములు" అంటారు.

అందుచేత మేము మా మహత్వాకాంక్షలను ఆధ్యాత్మికత వైపు మార్చుకొన్నాము. మన ఇంట్లో రేడియో వింటున్నాము. సిలోన్‌స్టేషన్‌లో పిచ్చిపిచ్చి సినిమా పాటలు వస్తున్నాయి. ఏం

**ఇతరులకు తప్పుడు సలహాలు ఇవ్వకండి**

చేస్తాం? వెంటనే స్టేషన్‌ను వివిధభారతికి మార్చేసుకుంటాము. అక్కడ వేంకటేశ్వర సుప్రభాతం వస్తుంటుంది. వింటాము. ఇదే పద్ధతిని జీవితంలో కూడా అమలుపరచుకోవాలి.

## మీ మహత్త్వాకాంక్షలను మార్చివేసుకోండి

మన భౌతిక మహత్త్వాకాంక్షలన్నీ అధికమైన సంపదలను సంపాదించటానికే ఉంటాయి. అయితే అవి నెరవేరడమనేది పూర్తిగా మన చేతిలో ఉండదు. పరిస్థితుల మీద, ఇతరుల మీద ఆధారపడి ఉంటాయి. ఆఫీసులో మీ పై అధికారి (బాస్) మీకు పదోన్నతి ఇవ్వాలి. పదోన్నతి వస్తే జీతం పెరుగుతుంది, ఆదాయం పెరుగుతుంది. కాబట్టి మన కోర్కెలు నెరవేరడమనేది ఇతరుల ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. వాళ్ళకు ఇష్టమై, మనకు మంచి గ్రేడ్ ఇస్తే పదోన్నతి వస్తుంది. లేకపోతే లేదు.

## ఆధ్యాత్మిక మహత్త్వాకాంక్షలు ఏమిటి?

కానీ మన ఇష్టం మీద, మన శక్తి మీద, మన ప్రయత్నం మీద ఆధారపడి నెరవేర్చుకొనగలిగే పద్ధతి ఒకటి ఉన్నది. అదియే ఆధ్యాత్మికత! ఆధ్యాత్మికతకు చెందిన మహత్త్వకాంక్షలను నెరవేర్చుకొనడమనేది మన చేతిలోనే ఉంది. దానిని మనం సంపూర్ణంగా నెరవేర్చుకొనగలము. మనం నిజాయితీగా ఉంటాము. సత్యాన్ని మాట్లాడతాము. అబద్ధాలు చెప్పినా, ప్రగల్భాలు మాట్లాడినా వెంటనే పట్టుబడిపోతాము. మంచి జీవనవిధానాన్ని అవలంబించటం చాలా తేలిక. ఆత్మ నియంత్రణను పాటిస్తూ ఇతరులకు సేవా సహాయాలను అందిస్తూ జీవనం సాగించవలెననే ఉన్నతమైన ఆదర్శాలను పాటించడం చాలా మంచిది.

## మంచి ప్రవర్తన (నడవడిక)ను అలవరచుకొనడం చాలా తేలిక, ప్రయత్నించండి

మంచి నడవడికను అలవరచుకొనడం ఎంతో సులభం. ఎవరి బిడ్డల నైనా మీ బిడ్డవలె లాలించడం, ఎవరి తల్లినైనా సరే మీ తల్లిగా భావించడం మంచి అలవాటు. మీ మనస్సుకు నచ్చినట్లుగా ఉంటూ, ప్రశాంతంగా జీవించండి. ఇందులో మీకు వచ్చిన కష్టమేమీ లేదు. కబీరు ఒక ముస్లిమ్ దంపతుల ఒడిలో పెరిగాడు, కానీ హిందూమతం ఆయనకు ఎంతటి ఉన్నతమైన స్థానాన్ని కట్టబెట్టిందో మనకందరికీ తెలుసు. ఇందులో ఏమైనా ప్రతిబంధకం ఏర్పడిందా? లేదుకదా! అదే విధంగా రైదాసు జాతిరీత్యా చెప్పులు కుట్టేవాడు. ఏ మాత్రము చదువు లేనివాడు. కానీ అతను సంకల్పించుకుంటే గంగానది తానే స్వయంగా కదలివచ్చి ఆయన చెప్పులు కుట్టుకునే పాత్ర లోకి వచ్చి నిండుతుంది "మన్ చంగాతో కటేతిమే గంగా" అని చెప్పబడింది అందుకే! అనామకులైనా, అనాగరికులైనా, చదువురానివారైనా, ఎవరైనా సరే ఆధ్యాత్మికతకు సంబంధించిన తమ యొక్క ఆదర్శాలను నెరవేర్చుకొనటంలో ఎలాంటి అవరోధము ఉండదు. కఠినాతికఠినమైన పరిస్థితులలోనైనా, దుర్భరమైన పేదరికంలోనైనా, ఎటువంటి క్లిష్టస్థితిలోనైనా సరే మానవుడు సంకల్పించుకుంటే మహామానవుడు కాగలడు.

ఒంటెద్దుబండి తోలుకుని జీవనం గడిపిన రైక్యుడు కూడా మహామానవుడైనాడు. మహారాజైన జనకుడు కూడా రైక్యుడిని గొప్ప ముని, బ్రహ్మజ్ఞాని అని సెలవిచ్చాడు. కాబట్టి ఆధ్యాత్మిక మహత్త్వాకాంక్షలను నెరవేర్చుకొనటానికి మన మనస్సు బలహీన మైతే తప్ప, మరిఎటువంటి అవరోధము ఉండదు.

## మానసికస్థితిని పరిపక్వం గావించుకోండి

ఈవిధంగా మేము "ఆప్తకాములం" అవుతూ జీవనం సాగించాము. మన ఆలోచనలలో బాల్యం ఉండకూడదు. వృద్ధాప్యం ఉండకూడదు. మన యవ్వనంలో పరిపక్వత ఉండాలి. బాల్యావస్థలోని పిల్లవాడు ఎప్పుడు భవిష్యత్తును గురించి ఆలోచిస్తాడు. పెద్దయ్యాక నేను డాక్టరునవుతాను, ఇంజనీరునవుతాను అని ఊహిస్తుంటాడు. అలాగే వృద్ధాప్యం లోని మనిషి ఎక్కువగా తన బాల్యాన్ని గురించి తలపోస్తూ ఉంటాడు. "మా తాతగారు అలా ఉండేవారు. మా నాన్నగారు ఇలా చేసేవారు" అన్న ఆలోచనలే అధికంగా అతడి మనస్సులో సాగిపోతుంటాయి. ఒకసారి ఒక వ్యక్తి బర్నార్డ్‌షా వద్దకు వెళ్ళి మన ప్రాచీన భారతీయ సంస్కృతీ వైభవములను గురించి విపరీతంగా వర్ణించసాగాడు. బర్నార్డ్‌షాకు విసుగుపుట్టి మీరు ప్రాచీనకాల వైభవాన్ని గురించి చెప్పేటప్పుడు మనం కోతుల సంతానమని కూడా చెప్పుకోవాలి కదా! అని చమత్కరించాడట. కాబట్టి ఎంతసేపు గడచిన కాలాన్ని గురించి పట్టుకొని వ్రేలాడుతూ ఉంటే వర్తమానంలో పని జరగదు కదా! మారోజులలో ఫలానా వస్తువు ఎంతో చౌక అంటారు. అది చాలా పొరపాటు. రూపాయి విలువను బట్టి వస్తువు ధర మారుతుందే తప్ప తేడా ఏమి ఉండదు.

*(సశేషం)*

*– అఖండజ్యోతి, నవంబర్ 2015*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**మానవత్వం అన్నింటికన్నా గొప్ప ధర్మం**

నావారితో నా మాట

# యువక్రాంతి సంవత్సరం - దివ్యత్వ జాగరణ కార్యశాలలు



యువక్రాంతి సంవత్సరం మొదలయ్యాక, ఇప్పటి వరకు మనం ఐదు సామూహిక కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేసుకున్నాం. అవి 24 మార్చి – అశ్లీలతా నివారణ దినోత్సవం, 31 మే – వ్యసనముక్తి దినోత్సవం, 21 జూన్ – యోగ దినోత్సవం, 20 జులై – బృహద్ వృక్షారోపణం, 20 సెప్టెంబర్ – నిర్మల గంగా జల అభియానం, సామూహిక స్వచ్ఛత, నదులు, జలనిధుల విమోచన. ఇప్పుడు రాబోయే వసంత పంచమికి (1 ఫిబ్రవరి, 2017)కి ఇంకా నాలుగు నెలలే ఉంది. ఆలోపల చేయాల్సిన పనుల వివరాలు జూన్ సంచికలోనే ప్రచురించ బడినవి.

ఆ నెల నుంచి ప్రతిసారి యువక్రాంతి సంవత్సరం యొక్క విభిన్న ప్రణాళికల గురించి వివరణ ఇస్తూనే ఉన్నాం. అందుకు తగ్గట్టుగానే దేశంలోని అన్ని యువమండలాలు, దియా సమూహాలు, అనుభవమున్న మార్గదర్శకుల ద్వారా అన్ని కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఇప్పుడు దివ్యత్వ జాగరణ కార్యశాలలు (డివైన్ వర్క్‌షాప్స్) గురించి చర్చించుకుందాం. నేటి బుద్ధి జీవులవర్గం యువ సమూహాలు జీవిస్తున్న వాతావరణంలో ఎన్ని సమస్యలుంటాయో వాటన్నింటికీ సమాధానం ఈ కార్యశాలలో ఉంటుంది. యువకుల నుండి, పరిపక్వం చెందిన కార్యకర్తల వరకు ఏ ఏ విషయాలు ఉపయోగపడతాయో, అవన్నీ ఇందులో పొందుపరచబడినాయి.

ఆధ్యాత్మిక మూల్యాలను వైజ్ఞానిక భాషలో యువతకు అర్థమయ్యేలా చెప్పడం ఈ కార్యశాలల్లోని మూల విషయం. ప్రతి యువకునిలో, కార్యకర్తలో, దేశపౌరునిలోని అంతరాళాల్లో దివ్యత్వం నివసిస్తుంది. “అందరు పాడైపోయారు. ఇక ఏమీ లాభం లేదు” వంటి మాటలు నకారాత్మకమైనవి. అవును, వాతావరణం విషయుక్తమైపోయింది. గోరంత విషయాలను కూడా సామాజిక మీడియా కొండంతగా చూపిస్తుంది. ధర్మక్షేత్రం హాస్యాస్పదమైపోయింది. యువత దూరంగా ఉంటోంది. ఎక్కడా మార్గదర్శకులు కనబడరు. స్వాధ్యాయం అంటే ఏమాత్రం అభిరుచి చూపించట్లేదు. టి.వి., మీడియా, స్మార్ట్ ఫోన్, ఫేస్ బుక్, వాట్సాప్ మొదలైనవి ఎంతగా జనాలని కమ్మేసాయంటే, రచనాత్మకంగా ఏదీ ఆలోచించ లేకపోతున్నారు. స్కూలు చదువు తరువాత కాలేజీ లోకి పిల్లలు ప్రవేశిస్తారు. అక్కడి వాతావరణం అంతకు ముందే కలుషితమై ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనైనా తల్లిదండ్రులు పిల్లల్ని డాక్టరు, ఇంజనీరు, మేనేజర్ వగైరా చేయాలనుకుంటారు. ఆ పిల్లవాని అంతస్సులో కళాకారుడు, గాయకుడు, నాయకుడు, దేశ సేవకుడు, సమాజానికి రచనాత్మకంగా ఉపయోగపడే వృత్తులపై ఆసక్తి ఉన్నా అతను ఏమీ చేయలేడు.

పరామర్శించే స్నేహితులు కూడా అంతే భ్రమలో ఉంటారు. వార్తాపత్రికల్లో నిత్యం కనిపించేవాటిని చూసి ప్రభావితులవుతారు. లోకతంత్రాన్ని చేతుల్లోకి తీసుకున్నవారి ఆచరణ చూస్తే ఇంకా నిరాశ కలుగుతుంది. మన దేశానికి వెన్నెముక ప్రజాతంత్రం. కానీ ఏ మాత్రం సిగ్గు, బిడియం లేకుండా దానిని దురుపయోగం చేస్తున్న విధానాన్ని చూస్తే నిరాశ కలుగుతుంది. మార్గదర్శనం చేసే దీపస్తంభం ఎక్కడా కనిపించదు. ఇలాంటప్పుడే అంతర్ మనస్సును కుదిపేసే ఆలోచనా పరివర్తన అనే సుడిగుండాన్ని లేవనెత్తాలి. ముమ్మర మేధోమథనం తరువాత పరమపూజ్య గురుదేవులు మనకందించిన ప్రసంగాలు ఎప్పటికైనా కాలానుగుణమైనవే. కాబట్టి మనం ఆయన శరణులోకి వెళ్ళాల్సిందే.

గురువుగారి క్రాంతికారీ రచనల్లో రగిలే నిప్పులాంటి ఆలోచనల సమాహారాన్ని ఆధారంగా తీసుకోబడింది. ఇక్కడ కొన్ని ఉదాహరణలు ఇవ్వబడుతున్నాయి. మిగిలిన వివరాలు మా యువ మార్గదర్శక విశేషజ్ఞుల నుండి సేకరించగలరు.

### 1) మానవ జీవితం యొక్క గరిమ

ఈ విషయం గురించి అందరికీ విస్తారంగా తెలియదు. ఈ జన్మ ఎంత దుర్లభమైనది, ఎంత అమూల్యమైనది అనేది అందరు గమనించుకోరు. స్థూలశరీరానికి విలువ తక్కువేనేమో కానీ అందులో ఉన్నటువంటి చైతన్యం వల్ల అది ఎన్నో రెట్లు ఎక్కువ విలువైనదవుతుంది. దేవతలకు కూడా దుర్లభమైన

**ఆలోచనలు ఉన్నతంగా ఉంటే జీవితం సుఖమయమవుతుంది**

ఈ శరీరం విలువ మనిషి తెలుసుకున్ననాడు, ఏమేమి చేయగలడో అంచనా వేయలేము. నరుని శరీరం ఉన్నా మన ఆచరణ మాత్రం నరపశువు, నరపిశాచం లేదా నరపామరుని వలె ఉంటుంది. ఈ శరీరంతోనే కబీర్, రైదాస్, సమర్థ రామదాసు, శివాజీ, వివేకానందుడు, తిలక్, గోఖలే, శ్రీ అరవిందో మరియు పరమపూజ్య గురుదేవుల వంటి మహా మానవులు జన్మించారు. తమ ఆయువు ఉన్నంత కాలంలో ఎంతో పనిచేశారు. మనల్ని మనం వికసింపచేసుకుని, చిత్త శుద్ధితో ఉండడమే కావాలి. 'పరా' శక్తి గొప్పతనం, గౌరవ గరిమలు అర్థమైతే, నిద్రాణమైన శక్తిని మేల్కొల్పగలిగితే ఎంత వయసు వారైనా సరే అసంభవాన్ని కూడా సంభవం చేయగలరు. ఇక యవ్వనం అంటేనే జీవనీ శక్తి సంపదతో నిండి ఉంటుంది.

మన సాధనలను సంయమనంతో ఉపయోగించుకుని సమగ్ర వికాసాన్ని సాధించవచ్చు. ఉపాసన (ఉత్కృష్టతతో సామీప్యం), సాధన (సాధనల సద్వినియోగం) మరియు ఆరాధన (ఆర్జించిన శక్తిని ప్రపంచానికి పంచిపెట్టడం). గౌరవ ప్రపత్తులతో భగవంతుడిని సాక్షిగా భావించి, పై మూడింటి ఆధారంగా మనం సాధించినదంతా ఆయనకే తిరిగి ఇచ్చేయాలి. మరణించాక కూడా గుర్తుండిపోయేలా ఉపయోగకరమైన పనులు చేయాలి, ఇతరులకు కూడా అటువంటి ప్రేరణ కలిగేలా మసులుకోవాలి.

## 2) హ్యూమన్ ఎక్సలెన్స్ (శ్రేష్ఠత)

(బి) బర్త్ మరియు (డి) డెత్ మధ్యలో అక్షరం (సి) అంటే ఛాయిస్ (ఎంపిక) అనేది గ్రహించేలా చేయాలన్నదే ఈ కార్యశాల మర్మం. మన ఎంపిక మీదనే మన జీవితం ఆధారపడి ఉంటుంది. గురువుగారు కూడా మనిషిలో దైవత్వ వికాసానికి మన ఎంపికే ముఖ్యం అని భావించేవారు. అప్పుడే భూమిపై స్వర్గావతరణ అనేది ఊహించగలం. నేడు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం. జనాభా పెరిపోతోంది, కానీ వనరులు తరిగిపోతున్నాయి. ప్రకృతిలో అంతరించిపోయే వనరులనే మనిషి ఆశ్రయిస్తున్నాడు తప్ప తన లోపలి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవటం లేదు. ఈ ఆంతరిక ఉత్కృష్టత యొక్క గొప్పతనం అర్థం చేసుకోవాలి, దాని మీదే సమాజ ఉత్కృష్టత ఆధారపడి ఉంది. మానవీయ ఉద్దేశాలు, దృష్టికోణం, సానుభూతి, కర్తవ్యనిష్ఠ (కమిట్మెంట్) మరియు శ్రేష్ఠత, వీటన్నిటి పరాకాష్ఠ యొక్క సముదాయమే మనిషి యొక్క ఉత్కృష్టత. ఒకొక్క మెట్టు ఎక్కుతూ, అంతఃశక్తుల పునరుత్పత్తి వల్లనే యాత్ర కొనసాగి లక్ష్యాన్ని చేరుకోగలం. అప్పుడే స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, శ్రీ అరవిందో మరియు పండిత శ్రీరామశర్మ ఆచార్య వంటి ప్రముఖులు పుడతారు. యువత లోని సామర్థ్యం అనంతం. దాన్ని వెలికితీయడానికి చాణక్యుడు, గురువుగారి లాంటి మహాశక్తుల అవసరం ఎంతైనా ఉంది. మనమేమీ చేయలేనప్పుడు సరైన రోల్‌మోడల్‌ని నిశ్చయించుకుని, స్వాధ్యాయశీలత, నిరంతర సాధన ద్వారా ఉత్కృష్ట యువకుల తరాన్ని తయారుచేయగలం. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు చూపించవచ్చు.

## 3) నవయుగం తెచ్చిన తంట, 'ఒత్తిడి'

స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యశాలలు జరుగుతూనే ఉండాలి. ప్రతివ్యక్తిలో శక్తి ఉంది. కాని ఒత్తిడికి గురయితే శక్తి తరిగిపోతుంది. ఒక స్టీలు పిన్నుని వంచామనుకోండి, మళ్ళీ మళ్ళీ వంచుతూ పోతే అది విరిగిపోతుంది. అధికంగా ఆకాక్షించి, వాటిని చేరుకోలేక, సరైన ఎంపిక చేయక, పోటీఎక్కువై, అంతః శక్తులను రచనాత్మకంగా ఉపయోగించుకోకపోవడం వలన యువత నీరసించిపోతున్నది. ఇది నకారాత్మకమైన ఒత్తిడి, డిస్ట్రక్టివ్ స్ట్రెస్. కాని ఎవరైనా దీనినే సకారాత్మకంగా ఉపయోగించుకోగలిగితే, సవాళ్ళనే ప్రగతిపథంగా మార్చుకోగలిగితే, వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగిపోతే దాన్ని యూస్ట్రెస్ (eustress) అంటారు. మనలోని హార్మోన్లు, ఇమ్యూనిటీకి కారణమైన ఎంజైమ్స్‌ని రచనాత్మకంగా ఎలా నియంత్రించుకోవాలో యువతకు నేర్పించాలి. మరో విషయం గమనించుకోవాలి, ఖాళీగా కూర్చోవడం, సరైన పని దొరకక పోవడం వల్ల క్షీణించిపోవడం మొదలైనవి కూడా సమస్యలుగా మారతాయి. దీన్ని రస్టింగ్ అవుట్ (తుప్పు పట్టడం) అంటారు.

ఈ లక్షణాలన్నిటినీ జాగ్రత్తగా గమనించుకుంటే, మనిషి ఒత్తిడిని ఎదుర్కోడానికి శక్తిని వెచ్చించడం కన్నా, ఆ ఒత్తిడినే రచనాత్మకశక్తిగా మలచుకోగలడు. వత్తిడి లేకుండా ప్రపంచంలో ఉండలేం. గర్భం నుంచి పుట్టిన శిశువు ఒక్కసారిగా బయట వాతావరణానికి అలవాటుపడటానికి సాధన చేస్తాడు. ఆ శిశువు ఆంతరిక అంగాల వికాసానికి, స్వతంత్ర ఉనికిగా మారడానికి ఇది చాలా అవసరం. కాబట్టి ఒత్తిడి మనకి టానిక్ అనుకోవాలి, మన మిత్రుడు, శత్రువు కాదు.

ఒత్తిడి నియోజనకు ధ్యాన సాధన, యోగ వ్యాయామాలు, ప్రాణాయామం, సరైన పౌష్టిక (సాదా) ఆహారం, మొలకలు మొదలైనవి; పరస్పరం చర్చించే కళ, స్వాధ్యాయం, ఈశ్వరుడిని

**రబ్బరును సాగదీసే విధంగా సమయమును వీలయినంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి**

మిత్రుడిగా చేసుకునే విధానం నేర్పుతారు. మెల్లిమెల్లిగా ఒత్తిడి వల్ల వచ్చిన వికృతులు తొలిగిపోతాయి. ఈమధ్య నడుం నొప్పి, తలనొప్పి, నిద్రలేమి, జీవనీశక్తి లోపించడం వల్ల వచ్చే రోగాలు, పెప్టిక్ అల్సర్, హార్ట్ అటాక్, మెదడులో రక్తస్రావం మొదలైనవి వయసు మీరక ముందే వస్తున్నాయి. సమయం మించిపోక ముందే ఒత్తిడి నిర్వహణ అలవాటు చేసుకుంటే వార్ధక్యాన్ని గౌరవంగా ఆహ్వానించవచ్చు. లేకపోతే 40 ఏళ్ళకే ముసలితనం వచ్చేస్తోంది. జీవితాన్ని జీవించేకళగా ఈ కార్యశాల (వర్క్‌షాప్) నేర్పిస్తుంది. ఈ మధ్యకాలంలో కొత్త జీవన శైలి వల్ల వచ్చే రోగాలను దూరం చేసి, వీలైనంత శక్తివంతంగా మారుస్తుంది.

### 4) విజ్ఞానం మరియు ఆధ్యాత్మికతల సమన్వయం (సైంటిఫిక్ స్పిరిచ్యువాలిటి)

మనం ఆధ్యాత్మికతను సరైన రీతిలో అర్థం చేసుకోము. సకామభావంతో చేసే కర్మకాండలు, ఉన్మత్త సాంప్రదాయ వాదం, పూజా పునస్కారాలు మొదలైన వాటితో ముడిపెడతాం. మన మూలశక్తితో మనల్ని జోడించే విధానం మీద నమ్మకం ఆధ్యాత్మికం. **అధిః ఆత్మానాం ఇతి ఆధ్యాత్మః, ఆధ్యాత్మవిద్యా విద్యానాం (గీత)** నుండి అసలైన స్వరూపం బహిర్గతమవుతుంది. నేటి యువతకు అన్నింటికన్నా ఎక్కువ అవసరమైన విద్య ఆధ్యాత్మికమైనది. వాళ్ళు పూర్తిగా ప్రపంచంలో మునిగిపోయారు. వారి మహత్వాకాంక్షలు, కోరికలు అన్నీ విలాసాలు – భోగవైభోగాలే. సంస్కృతి యొక్క మూలమర్మాన్ని అర్థం చేసుకోలేకపోయారు. ఏదో ఇంట్లో తండ్రి చేసే రోజువారీ పూజ, యజ్ఞాలు మాత్రమే ఆధ్యాత్మికత అనుకుంటున్నారు. నిజానికి **ఆధ్యాత్మికత అంటే జీవించేకళ,** అది పూర్తిగా విజ్ఞాన సమ్మతమైనది.

ధర్మం మరియు విజ్ఞానం, ఆధ్యాత్మికత మరియు విజ్ఞానాలు పరస్పర విరోధులు కదా అనే ప్రశ్న వస్తుంది. ఒకటున్న చోట మరొకటి ఉండలేదనుకుంటారు. ప్రత్యక్షంగా కనిపించే తర్కం, తథ్యాలు, ప్రమాణాల మీద విజ్ఞానం ఆధారపడి ఉంటుంది. కాని ఆధ్యాత్మం అనుభవం, చైతన్యం యొక్క ఉన్నతమైన విజ్ఞానం. ఈ పరిచయం వింటే మన దృష్టి మారుతుంది. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు. గీతలోని ఏడవ అధ్యాయంలో చెప్పారు. పరా (చైతన్యం ప్రధానంగా ఉండే ఆధ్యాత్మికత) మరియు అపరా (భౌతిక జగత్తు) ఈ రెండూ కలిసి మొత్తం ప్రపంచం ఏర్పడింది. చైతన్యం లేకుండా జడ వస్తువులన్నీ నిర్జీవమైపోతాయి. మనం పరమేశ్వరుడిని చైతన్యస్వరూపునిగా నమ్మితే ఆయన వల్లనే అందరిలో ప్రాణం ఉన్నది. ఆధ్యాత్మికత విలువలతో కూడిన జీవితం జీవించడం, వైజ్ఞానిక సాధనల సద్వినియోగాన్ని నేర్పిస్తుంది. 'సూత్రేమణిగణా ఇవ' గీత–7.7. దారంతో అల్లబడ్డ హారంలోని మణులవలే ఆయన అన్నింటా ఉన్నారని చెప్పారు శ్రీకృష్ణుడు. "మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ". వైజ్ఞానిక ఆధ్యాత్మవాదానికి సూత్రమైన శ్లోకమిది. అన్నింటా పరమాత్ముడు నివసిస్తాడు అనేది మనకి అర్థమవుతే మనం అన్నీ సరైన పనులే చేస్తాం. నేడు విజ్ఞానం భస్మాసురుడిలా వినాశనం వైపుకు తీసుకెళ్తున్నది. పరమాణుశక్తి వల్ల ప్రమాదాలు, కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, ఉగ్రవాద సమస్యలు, ఇవన్నీ చూస్తే వెంటనే ఆధ్యాత్మికతను, విజ్ఞానాన్ని కలిపి కొత్త రచనాత్మక జోడీని తయారుచేయాలని తెలుస్తుంది.

పరమపూజ్య గురుదేవులు జీవితాంతం వైజ్ఞానిక ఆధ్యాత్మిక వాదాం వైపే వకాల్తా పుచ్చుకుని, దాని గురించే వ్రాశారు. దాని నుండి గాయత్రీ పరివార్ చెప్పే మాటలు యువత ఆకళింపు చేసుకుని ప్రగతిప్రదాత అయిన, సరియైన ధర్మ స్వరూపాన్ని అర్థం చేసుకుని, అవలంబిస్తోంది. తక్షణం మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాలను ఆధ్యాత్మికత నుంచి తొలగించాలి. విజ్ఞానం మీద ఆధ్యాత్మిక అంకుశం ఉంచాలి, అప్పుడే అది గుడ్డిగా పరిగెత్తి ప్రళయద్వారాలు తెరవదు. గత నాలుగు వందల ఏళ్ళతో పోలిస్తే, గడిచిన యాభై ఏళ్ళలో ప్రగతి చాలా వేగంగా వచ్చింది. సుఖసౌకర్యాల సాధనలు ఎన్నో ఇచ్చింది. ప్రపంచాన్ని ఒక తాటితో కట్టింది (నెట్వర్క్). కానీ ఆధ్యాత్మిక విలువలు లేకపోతే ప్రగతి వినాశకరమే అవుతుంది.

ఇటువంటి కార్యశాలలు యువత అంతర్దృష్టిని తెరుస్తాయి. ఎన్నో భ్రాంతులు దూరమవుతాయి. సంస్కృతి యొక్క మూలము, మర్మాలను తెలుసుకుంటారు. అందుకే ఈ యువ క్రాంతి సంవత్సరంలో, ఈ దివ్యత్వాజాగరణ శిబిరాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోనికి రావాలని చూస్తున్నాం. ఇది అందరికీ పనికొచ్చేది. సామాన్య ప్రజలు, రైతులు, ఆదీవాసీలు, చదువుకున్న యువత, నగరాల్లో ఆధునిక వైజ్ఞానికులు, వారిని తయారుచేసే అధ్యాపకులు, సంచాలకులు. ప్రతిచోట, ప్రతి కాలేజీలో, ప్రతి విశ్వవిద్యాలయంలో ఈ కార్యశాలలు నిర్వహించబడితే యువక్రాంతి సంవత్సరం చాలా బాగా సఫలమైనట్టే భావించవచ్చు.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2016*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

**సోమరితనం వలన జీవితం అస్తవ్యస్థమవుతుంది**

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-14)

**అశ్వమేధ యజ్ఞము:** సామాన్య అర్థములో తీసికొన్నచో "అశ్వ" శబ్దానికి గుర్రం అని అర్థము "మేధ" శబ్దానికి "వధించుట" అని అర్థాన్ని కలిగి ఉన్నాయి. కాని శాస్త్రార్థపరంగా చూచినచో "అశ్వము" శౌర్య, పరాక్రమాలకు చిహ్నం. "మేధ" అనేదిది మేధా శక్తికి, శ్రేష్టబుద్ధికి ప్రతీక. శక్తిగలవారు, మంచిబుద్ధిగలవారు సమాజ కళ్యాణ కార్యక్రమాలలో పూర్తి ఆసక్తితో పాల్గొన్నచో ఒక మంచి ఆదర్శ సమాజం ఏర్పడుతుంది. ఇది అశ్వమేధ మహాయజ్ఞం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

**యజ్ఞము-అశ్వమేధము దాని లాభాలు:** నేడు జరుపతలపెట్టిన ఉచ్ఛస్తరీయ అశ్వమేధ మహాయజ్ఞ లక్ష్యం ప్రజల ఆలోచనా సరళిని చెడు నుండి మంచి వైపుకు నడిపించి తద్వారా ఉజ్జ్వల భవిష్యత్‌ను నిర్మించుట.

యజ్ఞం యొక్క ప్రముఖ ప్రయోజనం వాయుశోధనతోపాటు, వాతావరణ నిర్మాణం చేయుట, పవిత్రవేదమంత్రాల సుస్వరంతో, ఉచ్చారణ ద్వారా విశ్వచేతనత్వంలో పవిత్రతను నిర్మించెడి దివ్య వాయు ప్రకంపనాలను ఉత్పన్నం చేయుట. అట్లే పవిత్ర హోమ ద్రవ్యమును సూక్ష్మీకరణ చెందించుట ద్వారా సూక్ష్మజగత్తును అత్యంత ప్రభావితం చెందించుట.

సంపూర్ణ మానవజాతి ఉన్నతికై ఋషులంతా ఏకస్వరంతో "అశ్వమేధం ద్వారా ప్రసన్నులైన దేవతలు మానవులపై శుభాలను వర్షింపచేసెదరు గాక, అదేవిధంగా రాష్ట్ర ప్రజల హృదయాలలోని అసురీశక్తుల నాశనం గావించుతుంది" అన్నారు.

సూర్యుని వేడితో భూమిపైని నీరు సూక్ష్మరూపం (ఆవిరి) చెంది, అంతరిక్షంలో తిరుగుతుంది. (సోమవర్షి) ఇదే సూర్యుని రేతస్సు. ఇది ప్రాణిశరీరంలో ప్రాణశక్తి రూపంలో ప్రవేశించి, ఊర్ధ్వగామిగా సహస్రారాన్ని చేరి, ప్రాణిని సంపూర్ణ ప్రాణశక్తితో నింపుతుంది. ఇదే మానవశరీరంలో ఉత్కృష్ణ స్థాయిలో జరుగుతుంది. దీనికై మనమంతా గాయత్రీ మంత్ర జపం చేయుట తప్పనిసరి.

శరీరంలో ఎచ్చోటనైనా వికారమున్నచో ప్రాణశక్తి అపమార్గం పడుతుంది. అట్లే రాష్ట్రంలో, దేశంలో ఎక్కడైనా వికారరూపంలో శత్రువులున్నచో, ప్రాణరూపియైన అశ్వాన్ని కట్టివేస్తారు. అప్పుడు అశ్వమేధయజ్ఞం సఫలం కానేరదు, సుదృఢ రాష్ట్ర నిర్మాణం జరుగదు. దీనికై వికారాలను (శత్రువులను) జయించి అన్ని నాడీ సముదాయాలలో (దేశమంతటా) నిర్విఘ్న ప్రాణసంచారము చేయించగలిగితే, సాధకునకు ఆత్మబోధ, తత్వబోధలతో కూడిన స్పష్టమైన వివేకం లభిస్తుంది. అశ్వమేధ యాజకులు తమ ఇంద్రియాలపై, ఆలోచనలపై దుష్ప్రవృత్తులపై విజయాన్ని సాధింపవలసి ఉంది.

శ్రీకృష్ణుని ప్రేరణతో యుధిష్టిరుడు వ్యాసుని మార్గదర్శనంలో మూడు అశ్వమేధాలు చేశాడట. ఆయన వారసుడైన పరీక్షిత్తు, జనమేజయుడు అదే పరంపరను కొనసాగించారు. తదుపరి యజ్ఞపరంపర నిలిచిపోవుటచే సామాజిక, రాజనీతిక, నైతిక విశృంఖలత పెరిగి పోయాయి. తదుపరి గుప్తులకాలంలో సముద్రగుప్తుని ద్వారా అశ్వమేధం ద్వారా సమతట, దుబాక్, నేపాల్, కర్తపుర, పూర్వమధ్య, పంజాబ్, మాళవ మున్నగు రాజ్యాలు ఏకమైనాయి. తదుపరి కొనసాగింపు లేదు. తిరిగి యథాస్థితి పునరావృతం అయ్యింది.

ఈనాడు ప్రపంచంలో వ్యాప్తమైయున్న అవాంఛనీయ పరిస్థితుల నివారించి నవయుగ సృజనాత్మక వ్యవస్థను స్థాపించుట అనేది తేజస్వి, మేధావంతులు, జాగృత, ప్రతిభాశాలుర వల్లనే సంభవం. మానవ ప్రతిభను సమాజ, రాష్ట్ర, విశ్వస్థాయిలో జాగృతం చేయుటకు అవసరమైన పరాక్రమం, సహనశక్తి, కేవలం భౌతిక జగత్తు నుండి లభించదు. దీనికై ఆధ్యాత్మిక జగత్తునుండి ధర్మానుష్ఠానం ద్వారా ఉత్పన్నమయ్యెడి దైవీశక్తుల వల్లనే ఇది సంభవం. **దీనికై కనీసం ఒక లక్షమంది సాధకులు నిత్యం గాయత్రీమంత్రజపం 1 నుండి 3 మాలలు జనవరి 2018 అశ్వ మేధ మహాయజ్ఞం పూర్తిఅయ్యేవరకు తప్పనిసరిగా చెయ్యాలి, నిత్యం సూర్యార్ఘ్యదానం ఇవ్వాలి. దీనితోపాటు నిత్యం గాయత్రీ మంత్రలేఖనం 15 లైన్లు వ్రాయాలి. తదుపరి లోకకళ్యాణం, ఆత్మకళ్యాణం కొరకై అంశదానం, సమయదానాలను ఇవ్వాలి.**

మానవకళ్యాణం, దేశకళ్యాణం, విశ్వకళ్యాణం లక్ష్యాలుగా ఎంచుకొని పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మరియు వందనీయ మాతాభగవతీదేవిశర్మలు అశ్వమేధ మహా యజ్ఞ శృంఖలను ప్రారంభించి విశ్వవ్యాపితం గావించారు. దీనిలో భాగంగా నేడు ఆంధ్రప్రదేశ్‌లో అశ్వమేధ మహాయజ్ఞాన్ని నిర్వహించుటకై సంకల్పం చేయబడినది. ఇట్టి మహాక్రతువులో మనందరము సాధకులుగా పాలుపంచుకొని సాధకులకై నిర్దేశింప బడిన నిత్య గాయత్రీమంత్రజప సాధనను చేపట్టవలసి యున్నది. మీతోపాటు మరికొంతమందిని సాధకులుగా ఈ మహోన్నతమైన కార్యక్రమంలో పాలుపంచుకునే విధంగా పరిచయం చేయవలసి నదిగా కోరడమైనది. ఈ అవకాశాన్ని జారవిడుచుకోకండి.

**చేస్తున్న పనిలో ఆనందం ఉంటే ఆ పని భారం అని అనిపించదు**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 30

**శ్రీమతి బొట్టా వసంత - శ్రీ హేమచంద్రరావు,**
**విశాఖపట్టణము**



శ్రీమతి శ్రీ బొట్టా అమ్మాజమ్మ–మోహనరావు దంపతులకు 1945లో హేమచంద్రరావుగారు విశాఖపట్టణములో జన్మించారు. వీరి బాల్యము విశాఖపట్టణములో మరియు విద్యాభ్యాసమంతా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పూర్తి చేయుట జరిగింది. చిన్ననాటినుండి వీరికి పూజలు, ఆధ్యాత్మిక పట్ల అంతగా విశ్వాసము ఉండేదికాదు. కాని పనిపట్ల శ్రద్ధ, అంకిత భావము, కర్తవ్యనిర్వహణలో, నిబద్ధత మెండుగా నిండుగా ఉన్న వ్యక్తి, విద్యాభ్యాసంకాగానే విశాఖపట్టణములోని పోర్టు ట్రస్టులో ఉద్యోగంలో ప్రవేశించి, 2003లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరుగా పదవీవిరమణ గావించారు. ఉద్యోగ బాధ్యతలు పని ఒత్తిడిల నుండి సాంత్వన పొందుటకై ధూమాపానము చేయుట అలవడింది.

వీరి జీవితభాగస్వామిగా, తుమ్మగూడెం గ్రామం, భద్రాచలం తాలుకా, ఖమ్మంజిల్లా నివాసితులైన శ్రీమతి & శ్రీ ముత్యాలమ్మ –నారాయణరావు దంపతుల కుమార్తె అయిన వసంతగారిని వీరు వివాహమాడుట జరిగింది. కుటుంబ వారసత్వంగా వసంతగారికి భగద్భక్తి అలవడింది. ఇదే అలవాటును మెట్టి నింట కొనసాగిస్తూ వైవాహిక జీవితంలో మరియు కుటుంబంలో శాంతిసౌభాగ్యాలను పెంపొందించుకొనెడి దిశగా కృషి చేయసాగింది.

పైకృషిలో భాగంగా తన వ్యక్తిగత, కుటుంబ సమస్యలకు, ఆరోగ్యసమస్యల పరిష్కారానికై మార్గాన్ని వెతుకసాగింది. ఈ ప్రయత్నంలో ఆమెకు, ఆమె స్నేహితురాలు గాయత్రీ యజ్ఞము స్వగృహములో చేయించుకొనుట ద్వారా సమస్యలకు పరిష్కారము లభించగలదని సూచించుట జరిగింది.

వెనువెంటనే స్నేహితురాలి మాటలపై విశ్వాసముంచి భర్తను ఒప్పించి మరునాడు తన ఇంటిలో గాయత్రీ యజ్ఞమును నిర్వహించుటకై ఏర్పాటు చేసికొనగా భీమిలి వాస్తవ్యురాలైన శ్రీమతి భారతమ్మగారు వచ్చి యజ్ఞాన్ని నిర్వహించారు. యజ్ఞము పూర్ణాహుతివేళ ఆరోగ్యాన్ని ప్రసాదించవలసిందిగా గాయత్రీమాతను ప్రార్థించుట జరిగింది. ఆనాటి నుండి శ్రీమతి వసంతగారి జీవితములో క్రమేపి సుఖశాంతులు ఒనగూడసాగాయి. దీనితో తన అర్ధాంగిలో పొడచూపిన నూతనోత్సాహాన్ని, సంతోషాన్ని పసిగట్టిన శ్రీ హేమచంద్రరావు గారికి, గాయత్రీ యజ్ఞముపట్ల, పరమపూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య మరియు పరమ వందనీయమాతా భగవతీదేవిశర్మల బోధనలపట్ల, వారి జీవనవిధానంపట్ల క్రమేపి విశ్వాసము కలుగసాగింది. ఇది రానురాను దృఢతరం కాసాగింది.

అట్లే ఈర్ష్యాద్వేషాలను కూడా తొలగించమని శ్రీమతి వసంతగారు ప్రార్థించింది. శ్రీ హేమచంద్రరావుగారికి సిగరెట్ త్రాగెడి అలవాటు ఆ రోజులలో తీవ్రంగా ఉండేది. ఉద్యోగ బాధ్యతల నిర్వహణ సమయంలో పని ఒత్తిడి నుండి సాంత్వన పొందుటకై సిగరెట్ త్రాగుట పెరుగుచూ ఇది క్రమేపి రోజుకు 4 పెట్టెల సిగరెట్లను కాల్చెడి ఒక వ్యసనంగా మారింది. అధిక ధూమపానంతో ఆరోగ్యము క్షీణించి, క్యాన్సరుకు దారితీస్తుందని డాక్టరు హెచ్చరించుట జరిగింది.

డాక్టరుగారి పై హెచ్చరికతో జాగరుకుడైన శ్రీ హేమచంద్ర రావుగారు, గురుదేవులు–మాతాజీల పట్ల పరిపూర్ణ విశ్వాసంతో, గాయత్రీ యజ్ఞములో పాల్గొని పూర్ణాహుతివేళ తనకుగల ధూమపానం అలవాటును ఆనాటి నుండి విడిచి పెట్టెదనని సంకల్పం గైకొన్నారు. చిత్రంగా ఆనాటినుండి ధూమపానం చేసెడి తన అలవాటును శాశ్వతంగా విడచిపెట్టారు. గాయత్రీ యజ్ఞముపట్ల, పూజ్యగురుదేవుల మాటపై పూర్తి విశ్వాస ముంచి నచో ఎట్టి అద్భుత సత్ఫలితాలను సాధకుడు పొందగలడు అనెడి దానికి శ్రీ హేమచంద్రరావుగారి ప్రస్తుత జీవన విధానము ఒక సజీవ ఉదాహరణగా మనముందు నిలుస్తుంది. వీరి

**మనిషికి సోమరితనమును మించిన దురదృష్టం మరొకటి ఉండదు**

జీవితం – శ్రద్ధ, విశ్వాసం, సమర్పణలు గలిగిన ప్రతివ్యక్తికి మార్గదర్శనాన్ని అందిస్తుందనుటలో ఎటువంటి సందేహము లేదు.

అట్లే వీరి శ్రీమతి వసంతగారు కూడా పూజ్యగురుదేవుల పట్ల, వారి బోధనలపై అచంచల విశ్వాసముంచి, 1998 నుండి అనేకానేక కార్యక్రమాలు చేస్తూ గురుదేవుల సాహిత్యాన్ని, తద్వారా వారి ఆలోచనల ప్రవంతిని సమాజంలోని ఇంటింటికీ చేర్చుటకై నిరంతరం కృషిచేయుచున్నారు.

ఈ ఆదర్శదంపతులకు, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలను, ఐశ్వర్యాలను ప్రసాదించవలసిందిగా పూజ్య గురుసత్తాను యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

**శ్రీమతి రాజరాజేశ్వరి - విశాఖపట్నం**



శ్రీమతి & శ్రీ మజ్జాపద్మావతి – సన్ని బాబు దంపతులకు రాజరాజేశ్వరిగారు 1951 డిసెంబరులో విశాఖ పట్టణంలో జన్మించారు. బాల్యం అంతా విశాఖ పట్టణంలోనే గడచి పోయింది.

కుటుంబ పోషణకై తల్లిదండ్రులు చిన్నపాటి వ్యాపారం చేస్తుండేవారు. ఈ వ్యాపారంలో రాజరాజేశ్వరిగారు తల్లి తండ్రులకు చేదోడువాదోడుగా ఉండేది. ఈ రీతిగా బాల్యంలో చదువుపట్ల శ్రద్ధచూపలేదు. వీరికి 1964లో శ్రీ హటకేశ్వర రావుగారితో వివాహం జరిగింది. తదుపరి విశాఖపట్టణం లోనే స్థిరపడిపోయారు. శ్రీమతి రాజరాజేశ్వరిగారికి గుడికి వెళ్ళి దైవదర్శనం చేసికొనుట ఒక అలవాటు.

ఒకనాడు శ్రీమతి రూపవాణి, గాయత్రీ పరివార్ విశాఖ పట్టణం గారిద్వారా 24 కుండముల గాయత్రీ యజ్ఞములో పాల్గొన్నది. ఈ 24 కుండముల యజ్ఞాన్ని డాక్టరు చంద్ర శేఖరరావుగారి సారధ్యంలో, వారి భార్య భారతి మరియు రూపవాణిగార్లు నిర్వహించారు. తదుపరి 1997లో విశాఖ పట్టణంలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము నిర్వహించెడి కార్యక్రమాలలో భాగంగా కొందరు శాంతికుంజ్, హరిద్వార్‌ను సందర్శించుటకై వెళ్ళుచుండగా వీరితోపాటు శ్రీమతి రాజేశ్వరిగారు కూడా శాంతికుంజ్‌ను సందర్శించుట జరిగింది. శాంతికుంజ్‌లో సంకల్పం చేసి తదుపరి శ్రీమతి రూపవాణి, భారతిగార్లకు సహాయ సహకారములనందిస్తూ విశాఖపట్టణం జిల్లాలో విస్తృతంగా తిరిగి గాయత్రీ ప్రచారము చేశారు. నిరక్షరాస్యుడైన భక్త కబీరుదాసు భగవంతునికి సమర్పణగావించుకొని తన భక్తిగీతాలను ఆసువుగా వల్లిస్తూ అశేష జనావళికి ప్రేరణ అందించారు. పరమపూజ్య గురు దేవుల జన్మలలో ఒక జన్మ అయిన కబీరుదాసును ఆదర్శంగా గొని, వారి జీవితాన్ని ప్రేరణగా గైకొని శ్రీమతి రాజరాజేశ్వరి తనకు చేతనైన రీతిలో గాయత్రీ ప్రచారానికై విశాఖపట్నంలో అవిశ్రాంతంగా కృషి సల్పుచున్నది. వీరిలోని సమర్పణ, పట్టుదల, నిష్ఠ, భక్తివిశ్వాసాలు మనందరికి ఆదర్శప్రాయం. కార్యక్రమాలు లేనప్పుడు విశాఖపట్టణంలోని గాయత్రీ పరివార్ కార్యాలయాన్ని ప్రతి ఆదివారం సందర్శిస్తూ తన సమయ దానాన్ని ఇస్తూ సేవచేయుచున్నది.

ఇట్టి వీరిని, వీరి కుటుంబాన్ని ఆ పరమపూజ్య గురుసత్తా సర్వవేళల కాపాడుచూ, ఆశీస్సులనందించాలని యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.




**గాయత్రి పరివార్**
**2017 వార్షిక క్యాలెండర్**
**(అశ్వమేధ మహాయజ్ఞం-2018)**

**యధావిధిగా గాయత్రి పరివార్ (తెలుగు) 2017 వార్షిక క్యాలెండర్ అశ్వమేధ మహా యజ్ఞమును కథా వస్తువుగా స్వీకరించి పంచరంగులలో తయారగుచున్నది.**

**నమూనా క్యాలెండర్ 15 నవంబర్ 2016 నాటికి మీకందించబడును.**

**15 డిసెంబర్ 2016 నాటికి ఇది అమ్మకమునకు సిద్ధముగా ఉండును.**

**కావలసిన వారు ఈ క్రింది చిరునామాలో సంప్రదించండి.**
**గాయత్రీ చేతనా కేంద్రము, హెచ్.పి.రోడ్.,**
**మూసాపేట, హైదరాబాద్-500018.**
**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**


**ఏ పని చేసినా బాగా చెయ్యాలి**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## హైదరాబాద్ గాయత్రీ చేతనా కేంద్రములో

విజయదశమి నవరాత్రులు పర్వదినాల సందర్భంగా (మహాలయ అమావాస్య) 30.09.2016 తేదిన గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట కార్యాలయ భవనంలోనున్న యజ్ఞశాలలో పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహింపబడింది. 25 మంది వారి పితృదేవతలకు పిండప్రదానం గావించారు.

అట్లే దశహరా (దసరా) నవరాత్రుల అనుష్ఠానం పూర్తి చేసిన వారు అక్టోబరు 11వ తేదిన (విజయదశమి) పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించుకొన్నారు. ఆనాటి యజ్ఞములో 80మంది వరకు పాల్గొన్నారు. పంచకుండీ గాయత్రి యజ్ఞము నిర్వహించబడింది.

## గుంటూరు జిల్లా కుందూరువారిపాలెంలో

సాందీప మహర్షి గాయత్రీ శక్తిపీఠము వారి ఆధ్వర్యంలో 14 అక్టోబరు, 2016 మంగళవారం , శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారిగారి 68వ జయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహింపబడ్డాయి. దాదాపు 200 మంది గాయత్రీ పరివార్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆధ్యాత్మిక మార్గ దర్శకులైన మాష్టార్ని స్మరించుకొంటూ వారికి తమ గౌరవ ప్రవృత్తుల చాటుకొన్నారు.

## విశాఖపట్టణములో

గాయత్రీ పరివార్ ట్రస్టు, బీచ్‌రోడ్, విశాఖపట్నం వారి సారథ్యంలో 51 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ట్రస్టు వార్షికోత్సవ సందర్భంగా విశాఖపట్టణములోని రాజస్థానీ సంస్కృతి మండలి భవనములో 2 అక్టోబరు 2016 ఆదివారం నాడు నిర్వహించబడింది.

అత్యంత భక్తిశ్రద్ధలతో, నిష్ఠాపూర్వకంగా, శాస్త్రసమ్మతంగా ఆత్మకళ్యాణ, కుటుంబకళ్యాణాలతోపాటు సమాజ కళ్యాణం, విశ్వకళ్యాణాల ఆకాంక్షిస్తూ యజ్ఞమును నిర్వహించారు. జలము మొదలుకొని, సమిధలు, హవన సామాగ్రి, పూలు, పండ్లు కలశముల ఎంపిక ఎండిన పండ్లు, ఘృతము మున్నగు వాని అన్నింటిలో శ్రేష్టతకు, పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చి యజ్ఞ క్రతువును నిర్వహించారు. హవన కుండముల అలంకరణ (రంగులతో) వేదిక నిర్మాణము, వేదిక అలంకరణ వగైరాలు కన్నులకింపుగా అమర్చి విశాల ప్రాంగణములో ఏర్పాటు చేయుట జరిగింది.

గురుదేవుల మాతాజీల ప్రేరణాగీతాలు యాజకులకు వీనుల విందు గావించాయి. 'యాజ' కార్యక్రమం చక్కగా నిర్వహించారు.

పైవానికి బలం చేకూర్చే విధంగా ప్రయాజ కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టని లోపం కనిపించింది. ముమ్ముందు దీనిని చక్కదిద్దినచో గాయత్రీ పరివార్ ట్రస్టు, విశాఖపట్టణం సాధన మరింత ప్రగతిని సాధించగలదని విశ్వసించుచున్నాం. యజ్ఞమును ట్రస్టు అధ్యక్షులైన శ్రీ చంద్రశేఖర జైన్‌గారు నిర్వహించారు. ఈ యజ్ఞంలో 1500 మంది పరిజనులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా తెనాలిలో

**తెనాలి పట్టణ పొలిమేరలో త్రిశక్తి గాయత్రి శక్తిపీఠము, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం:** గుంటూరు జిల్లా తెనాలి పట్టణ పొలిమేరలోని ప్రభుత్వ వైద్యశాల దాటిన తరువాత "త్రిశక్తి" గాయత్రి శక్తిపీఠము ప్రాణప్రతిష్ఠ కార్యక్రమము 12 అక్టోబరు 2016 బుధవారంనాడు జరిగింది. మొదటి అంతస్తులో గాయత్రీమాత విగ్రహము ప్రతిష్ఠించారు. క్రింది భాగములో పరమపూజ్య గురుదేవులు, పరమ వందనీయ మాతాజీల విగ్రహాలను ప్రతిష్ఠించుట జరిగింది.

ఈ సందర్భంగా 12 కుండము గాయత్రీ యజ్ఞము నిర్వహింపబడింది. డాక్టర్ శ్రీరామ్ గాయత్రీ పరివార్ వారి ఆధ్వర్యంలో పై కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి. ఈ కార్యక్రమంలో పరిజనులు విరివిగా పాల్గొన్నారు. శాంతికుంజ్ ప్రతినిధులుగా శ్రీ ఉత్తమ్‌కుమార్, శ్రీ తోషన్ సాహు తదితరులు హాజరైనారు.

**చేసే పనిలో అభిరుచి పెంచుకోవాలి**